అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 4-7-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 184 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

సీఎం కేసీఆర్‌తో అఖిలేశ్ భేటీ..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్.. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సోమవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ప్రగతి భవన్‌లో జరిగిన ఈ భేటీలో పలు కీలకాంశాలు చర్చకొచ్చినట్టు తెలుస్తోంది. ఇటీవల బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహించిన జాతీయ స్థాయి ప్రతిపక్షాల సమావేశానికి బీఆర్‌ఎస్‌ను ఆహ్వానించలేదు. బీజేపీకి ఆ పార్టీ దగ్గరగా ఉన్నందునే దాన్ని ఆహ్వానించలేదనే వార్తలొచ్చాయి. ఆ భేటీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తోపాటు అఖిలేశ్ కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ వ్యతిరేక ప్రచారంలో పాల్గొనేందుకు వీలుగా బీఆర్‌ఎస్‌తో మాట్లాడేందుకు రాహుల్

...11లో



మణిపూర్‌పై సమగ్ర నివేదికివ్వండి

- బీరెన్ సర్కార్‌కు సుప్రీం ఆదేశాలు..10వ తేదీకి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : మణిపూర్‌లో నెమ్మదిగానైనా పరిస్థితులు మెరుగుపడుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సోమవారం చెప్పింది. ఆదివారం తాజాగా హింస చెలరేగి మరో నలుగురు మరణించిన నేపథ్యంలో ఈ ప్రభుత్వ

...11లో




ప్రతిపక్షాల భేటీ వాయిదా

- ఈనెల 17-18న సమావేశం : కాంగ్రెస్

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాల బెంగళూరు సమావేశం వాయిదా పడింది. ఈనెల 12, 13 తేదీల్లో భేటీ కావాలని తొలుత నిర్ణయం తీసుకున్నారు. ఈసారి సమావేశాన్ని కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. గత నెల 23న పాట్నాలో తొలిసారిగా భేటీ

...11లో



ఉపాపై చర్చను ఎందుకు రద్దు చేశారు ?

- ఐఐఎస్‌సీ చర్యను ప్రశ్నించిన శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు
- డైరెక్టర్‌కు 500మందికి పైగా ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ : నిరంకుశమైన చట్ట విరుద్ధ కార్యకలాపాల (నిరోధక) చట్టం (యూఏపీఏ)పై చర్చను నిలిపివేయాలని నిర్ణయించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇండియన్

...11లో





మహబూబాబాద్‌లో...

గూడు చెదిరింది... ఎర్రదండు కదిలింది

రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడించిన పేదలు

- మహబూబాబాద్‌లో మళ్ళీ గుడిసెలు కూల్చివేత
- అయినా...తగ్గేదే లే... అంటూ పిడికిలెత్తిన శ్రామికులు

గూడు కోసం రాష్ట్రవ్యాప్తంగా శ్రామికదండు కదిలింది. మాకెందుకు ఇండ్లివ్వరంటూ సర్కారుపై కదం తొక్కింది... మరోవైపు సర్కారు అధికారగణం మహబూబాబాద్‌లో అదే పేదల ఇండ్లపై దాష్టీకానికి ఒడిగట్టింది. బుల్‌డోజర్లు, ప్రొక్లైనర్లు, జేసీబీలతో సర్కారు భూమిలో వేసుకున్న గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూల్చేసింది. నిరాశ్రయులైన మహిళలు, వృద్ధులు, పిల్లల ఆర్తనాదాలు, అరుపులతో కడుపు తరుక్కుపోయేలా ఏడ్చినా, కనికరించిన నాధుడు లేడు. అయినా...వెనక్కి తగ్గేది లేదంటూ ఎర్రజెండాను చేతబట్టి సమరానికి సై అన్నారు శ్రామికజనం. తాడోపేడో తేల్చుకుంటామంటూ భారీగా కలెక్టరేట్లను ముట్టడించి, నిరసనలు తెలిపారు. పేదలకు నీడ కల్పిస్తూ సర్కారు గూడు ఇచ్చేవరకు నిరంతర పోరాటమేనంటూ ఎర్రజెండా సాక్షిగా ఎలుగెత్తి నినదించారు.

- సర్కారు దిగొచ్చేదాకా పోరాటమేనంటూ ప్రజాసంఘాల నేతల హెచ్చరిక



హైదరాబాద్‌లో...

పేదల గుడిసెలపై దాష్టీకం

- మహిళలపై లాఠీచార్జి, సొమ్మసిల్లిన మహిళలు..అరెస్ట్ చేసిన వారిపై క్రిమినల్ కేసులు

నవతెలంగాణ-మహబూబాబాద్

రెక్కల కష్టం మీద బతుకుతున్న పేదలు శ్రామికులు నిలువ నీడ కోసం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే.. వాటిని తొలగించేందుకు వచ్చిన పోలీసులు, అధికారులను పేదలు అడ్డుకోవడంతో.. వారిపై లాఠీచార్జి చేయడంతో పాటు అరెస్టు చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ ఘటన సోమవారం మానుకోటలో జరిగింది. ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక నాయకులు బానోత్ సీతారాం, గుడిసెవాసులు చెప్పిన వివరాల ప్రకారం.. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి హమాలీ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులుగా జీవనోపాధి పొందుతున్న పేదలు ఎంతో మంది మహబూబాబాద్ పట్టణంలో నివసిస్తున్నారు. వారంతా నగరంలో అద్దెలు

...5లో

పేదలపై దౌర్జన్యమా?

- ఎస్ వీరయ్య



వివరాలు 5లో..

గూడు కోసం గుంపుగా..

కలెక్టరేట్లను ముట్టడించిన నిరుపేదలు

- ఇండ్లు, స్థలాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా.. నిరసన ప్రదర్శనలు ..పలు చోట్ల ఉద్రిక్తతలు.. అడ్డగింతలు..

నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం

గూడు కోసం నిరుపేదలంతా గుంపుగా కదిలారు.. ఎర్రజెండా నీడలో పేదలంతా కదం తొక్కారు.. అధికారులకు తమ మొర వినిపించేందుకు సీపీఐ(ఎం), తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక అండగా.. కలిసికట్టుగా సోమవారం కలెక్టరేట్లకు తరలివచ్చారు. కేంద్ర,

...12లో

బండి వద్ద రూ.100 కోట్లు ఎక్కడివి..?

పుస్తెలమ్మి ఎలక్షన్లలో ఎంపీగా నిలబడ్డారు..



- అలాంటిది కోట్లల్లో ప్రకటనలిచ్చే స్థాయి ఎక్కడిది..! : రఘునందన్‌రావు బ్లాస్ట్
- చుగ్, బన్సల్ బొమ్మలు చూసి ప్రజలు ఓట్లేయలేదు
- మునుగోడు ఎన్నికలో రూ.100 కోట్ల ఖర్చు
- పదేండ్లలో నాకంటే ఎక్కువ ఎవ్వరూ కష్టపడలేదు
- నా కులమే నా ఎదుగుదలకు శాపమా? : మీడియాతో చిట్‌చాట్‌లో రఘునందర్‌రావు
- టీ తాగుతూ మాట్లాడిన అంశాలను వక్రీకరించారని ప్రెస్‌మీట్

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు బ్లాస్ట్ అయిపోయారు. బీజేపీలో కొంతకాలంగా జరుగుతున్న ఆధిపత్య పోరు వాస్తవమేనని తన మాటల ద్వారానే తేల్చేశారు. బండి సంజయ్ స్వయంకృతాపరాధమే దానికి కారణమని స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన ఓపెన్ అయిపోయారు. బండిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ గత ఎన్నికల్లో పుస్తెలమ్మి పోటీ చేశారనీ, అలాంటిది ఇప్పుడు రూ.వందల కోట్లు యాడ్లు ఇచ్చేంత డబ్బు ఎక్కడిదని ప్రశ్నించారు. ఒక వేళ అది పార్టీ డబ్బు అనుకుంటే అందులో అందరికీ వాటా ఉంటుందన్నారు. పదేండ్ల నుంచి కష్టపడుతున్నా పార్టీ అధ్యక్ష పదవికి అర్హుడిని కాదా? అని ప్రశ్నించారు. పార్టీ అధ్యక్ష పదవి, ఫ్లోర్ లీడర్‌లో ఏదో ఒకటి ఇవ్వాలనీ, చివరకు జాతీయ అధికార ప్రతినిధి పదవి అయినా ఇవ్వాలని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. కొన్ని విషయాల్లో తన కులమే తనకు శాపం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాకలో తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, సంతోష్ బొమ్మలతో ఓట్లు రాలేదని చెప్పారు. తన కంటే ముందు పోటీచేసిన వారికి అక్కడ 3,500 ఓట్లే వచ్చాయని గుర్తుచేశారు. కేసీఆర్‌ను ఢీకొట్టే మొనగాడిని తానేనని జనాలు నమ్మారు కాబట్టే ఓటేశారనీ, అంతేకానీ బీజేపీని చూసి కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. దుబ్బాక ఎన్నికల్లో

...11లో

సీపీఎస్ ఉద్యోగులను పాత పెన్షన్ పరిధిలోకి తేవాలి

- సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పరిధిలోకి వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. దేశంలో ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం (సీపీఎస్) అమల్లో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, సెప్టెంబర్

...11లో

రాహుల్ తీరు సరికాదు

మా వల్లే వ్యవసాయ చట్టాలు ఆగిపోయాయి

- తమిళనాడు గవర్నర్‌ను తొలగించాలి : బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేకే





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను తమ పార్టీ సమర్ధించిందంటూ ఖమ్మం సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడటం హాస్యాస్పదమని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు ఎద్దేవా చేశారు. ఆయన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాసరెడ్డి, రాములు, కొత్త ప్రభాకరరెడ్డి, వద్దిరాజు రవిచంద్రతో కలిసి కేకే మాట్లాడారు. పార్లమెంటులో వ్యవసాయ నల్ల చట్టాలను తమ పార్టీ వ్యతిరేకించిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆ సమయంలో కేంద్రం తీరును నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంటు సమావేశాలను బహిష్కరించారని గుర్తు చేశారు. ఒకరకంగా చెప్పాలంటే బీఆర్‌ఎస్ కారణంగానే ఆయా నల్ల చట్టాలను మోడీ సర్కార్ ఉపసంహరించుకుందని వివరించారు. కానీ వాటిని తాము సమర్థించినట్టు ఓ జాతీయ నేత (రాహుల్ గాంధీ) చెప్పటం సరికాదన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. రాహుల్ తన ప్రసంగం ఆసాంతం

...5లో

మీరే దోపిడీ దొంగలు...

బందిపోటు దొంగల కంటే హీనం

- కాళేశ్వరానికి రూ.85 వేల కోట్లు బిల్లులు చెల్లించలేదా? :మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు రేవంత్‌రెడ్డి సూటి ప్రశ్న
- రాహుల్‌ను ప్రశ్నించడానికి మీకున్న అర్హత ఏంటి?



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు దోపిడీ దొంగలనీ, బందిపోటు దొంగలకంటే హీనమని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి విమర్శించారు. రూ.38 వేల కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పేరు డిజైన్ మార్చి బడ్జెట్‌ను రూ.1,49,131 కోట్లకు పెంచారని గుర్తుచేశారు. కాళేశ్వరానికి రూ.85 వేల కోట్ల బిల్లులు చెల్లించలేదా? అని ప్రశ్నించారు. మూడో టీఎంసీ కోసం రూ.25,831 కోట్ల బడ్జెట్ కేటాయించారని తెలిపారు. ప్రతి ఏటా రూ.25 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వానిదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వనరులను మింగే తెల్ల

...11లో

బండి ఔట్..!

అధ్యక్షులుగా కిషన్‌రెడ్డి

- ప్రచార కమిటీ చైర్మెన్ బాధ్యతలు ఈటలకే?
- సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి?
- త్రిముఖ వ్యూహంతో ఎత్తుగడ
- బీఆర్‌ఎస్‌కు లబ్ది చేకూర్చేందుకే ఈ నిర్ణయమంటూ ప్రచారం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను అధిష్టానం తప్పించినట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డినే అధ్యక్ష పీఠం ఎక్కించనున్నట్టు తెలిసింది. ఎన్నికల ప్రచార కమిటీ చైర్మెన్ బాధ్యతలను ఈటల రాజేందర్‌కు కట్టబెట్టాలనే తుది నిర్ణయానికి బీజేపీ అధిష్టానం వచ్చిందనే వార్త కోడై కూస్తున్నది. పదవుల పంచాయితీతో కొద్దిరోజులుగా నేతల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరుకు చెక్ పెట్టాలనే అధిష్టానం ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. కానీ, ఈ నిర్ణయమే ఆ పార్టీలో కొత్త పంచాయితీకి తెరదీయబోతున్నది. ఇది అగ్గి రాజేసే ప్రమాదముంది. మరోవైపు ఈ వార్తలను బండి గ్రూపు జీర్ణించుకోలేకపోతున్నది. రాష్ట్రంలో పార్టీకి బండి మంచి హైప్ తీసుకొస్తున్న తరుణంలో ఇలాంటి నిర్ణయమేమిటని ప్రశ్నిస్తున్నది. మరోవైపు ఇది టీఆర్‌ఎస్‌కు మేలు చేసేందుకేననే ప్రచారమూ జరుగుతున్నది. ఎట్లాగూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవలేమని నిర్ణయానికి బీజేపీ వచ్చిందనీ, రానున్న కాలంలో బీఆర్‌ఎస్ ఎంపీ సీట్లు అవసరం గనుకనే అధిష్టానం ఇలా ముందుకెళ్తున్నదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నది. కర్నాటక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్

...5లో



హాఫ్ నాలెడ్జ్ కామెంట్లు అవి....

- రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు అలా మాట్లాడితే ఎలా?:మంత్రి హరీశ్ రావు
- నిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ సిస్టమ్ ప్రారంభం

వివరాలు 2లో..

కనీస వేతనాలు కరువు

సలహా మండలి సిఫారసులు పట్టని ప్రభుత్వం

- అమలు కాని కాంట్రాక్టు లేబర్ యాక్ట్
- పదేండ్లుగా ఆగని పోరు..
- ఈ నెల 4 నుంచి 13 వరకు జీపు జాతా
- 17న 33 జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు



73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు పదిహేనేండ్లుగా కనీస వేతనాలు సవరించలేదు. ప్రయివేట్ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు జీతభత్యాలు పెరగకపోవడంతో తీవ్రంగా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. పెరిగిన ధరలకనుగుణంగా ఐదేండ్లకోసారి వేతనాల్ని పెంచాలని చట్టం చెబుతున్నా సర్కార్‌కు పట్టించుకోవడం లేదు. మూడు సార్లు కనీస వేతన సలహా మండలిని ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆ మండలి చేసిన ఏ ఒక్క సిఫారసుల్ని కూడా అమలు చేయలేదు. కాంట్రాక్టు లేబర్ యాక్ట్, 1979 అంతరాష్ట్ర వలస కార్మిక చట్టాలేవీ రాష్ట్రంలో అమలు కావడంలేదు. దాంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కనీస వేతనాలు సాధించుకునేందుకు కార్మికులు పోరు బాటపట్టారు. ఈ నెల 4 నుంచి 13 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జీపుజాత చేయబోతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

వివరాలు 5లో..



హాఫ్ నాలెడ్జ్ కామెంట్లు అవి...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యరంగంలో ప్రభుత్వం ఏమి చేయడం లేదని కొంత మంది హాఫ్ నాలెడ్జ్‌తో మాట్లాడుతున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు కూడా అదే విధంగా మాట్లాడితే ఎలా? అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నిమ్స్‌లో రూ.35 కోట్లతో ఏర్పాటు చేసిన రోబోటిక్ సర్జరీ సిస్టంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ చెడు చూడవద్దు, చెడు మాట్లాడవద్దు, చెడు వినవద్దు అని చెబితే కొంత మంది మంచి చూడవద్దు, మంచి మాట్లాడవద్దు, మంచి వినవద్దు అన్నట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏమి చేయక పోతే నీట్ ఆల్ ఇండియా ర్యాంకర్లు నిమ్స్‌లో పీజీ చేసేం దుకు ఎందుకు ఎంపిక చేసుకుంటున్నారని ప్రశ్నించారు. పేదల పట్ల సీఎం కేసీఆర్‌కు అంకిత భావం ఉందని తెలి పారు. ఆ అంకితభావం ఉండబట్టే దేశంలోనే అత్యాధునిక రోబోటిక్ సర్జరీ పరిక రాన్ని ప్రభుత్వరంగ నిమ్స్ అస్పత్రిలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. రోబోటిక్ సర్జరీతో కోత తక్కువగా ఉండి రోగులు త్వరగా కోలుకుంటారని హరీశ్ రావు తెలిపారు. రోగులు ఉండాల్సిన సమయం కూడా తగ్గు తుందన్నారు. భారతదేశంలోనే అతి పెద్ద డయాలసిస్ సెంటర్ నిమ్స్‌లో ఉందని చెప్పారు. నిమ్స్‌లో కొత్త పరికరాల కొనుగోలు కోసం రూ.154 కోట్ల ఇచ్చినట్టు తెలిపారు. అంతే కాకుండా ఆరోగ్యశ్రీ నుంచి రావాల్సిన నిధులతో పాటు మరింత సహాయం అందిస్తున్నట్టు చెప్పారు.

నిమ్స్ 4 వేల పడకలతో దేశంలోనే అతిపెద్ద ఆస్పత్రిగా రికార్డు స్థాపించ బోతున్నదని చెప్పారు. తెలంగాణ రాకముందు బోధనా సిబ్బంది సంఖ్య 111 ఉంటే దాన్ని 264కు, వైద్య విద్యార్థుల సంఖ్యను 82 నుంచి 169కి పెంచినట్టు తెలిపారు. ఓపీ 5 లక్షల నుంచి ఆరు లక్షలకు, ఇన్‌పేషెంట్ల సంఖ్య 26 వేల నుంచి 50 వేలకు, సర్జరీలు 12 వేల నుంచి 25 వేలకు, డయాలసిస్ లు 12 వేల నుంచి 72 వేలకు, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు 25 నుంచి 150కు పెరిగాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు 25 ఏండ్లలో 661 కిడ్నీ మార్పిడి సర్జరీలు చేస్తే రాష్ట్రం ఏర్ప డ్డాక తొమ్మి దేండ్లలో 753 చేసినట్టు తెలిపారు. మూలుగు మార్పిడి సర్జరీలు అప్పుడు 46 అయితే ప్రస్తుతం 154, మోకాలు మార్పిడి సర్జరీలు 134 నుంచి 1,444కు పెరిగాయని చెప్పారు. నిమ్స్‌కు 32 ఎకరాల భూమిని కేటాయించా మనీ, ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.1,571 కోట్ల పరిపాలనా అనుమతినిచ్చినట్టు గుర్తు చేశారు.14 అంతస్థుల్లో 24 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నట్టు వెల్లడించారు.

తెలుగులో తీర్పులివ్వండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మున్సిఫ్ కోర్టు, సబ్ కోర్ట్, జిల్లా కోర్టుల్లో తెలుగులోనే తీర్పులు ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టు న్యాయమూర్తులు టీ నవీన్‌రావు, నగేష్ భీమపాకలను తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీ శంకర్ కోరారు. సోమవారం హైకోర్టులో 'తెలుగులో తొలి తీర్పు' పుస్తకాన్ని న్యాయమూర్తులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జూలూరు గౌరీశంకర్ మాట్లాడారు. హైకోర్టులో తొలిసారిగా తెలుగులో తీర్పు ఇవ్వడాన్ని తెలంగాణ సమాజం స్వాగతిస్తోందని తెలిపారు. కిందికోర్టు నుంచి జిల్లా కోర్టువరకు తీర్పులన్నీ తెలుగులోనే ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మాతృ భాషలో తీర్పులు వస్తేనే కోర్టులు ప్రజలకు మరింత దగ్గరవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె నాగేశ్వరరావు, ప్రొఫెసర్ కిషోర్, ఉపాధ్యక్షులు కళ్యాణ్‌రావు, కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, న్యాయవాదులు వీ రామకష్టారెడ్డి, చిక్కుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు.. మూడు ప్రాంతాలు..

ప్రచార పర్వంలో తనతోపాటు కేటీఆర్, హరీశ్‌కు తగు ప్రాధాన్యత

- ఎన్నికల ప్రచారంపై సీఎం కేసీఆర్ యోచన
- ఇప్పటి నుంచే ఎలక్షన్ క్యాంపెయిన్
- కాంగ్రెస్, బీజేపీ జాతీయ నేతల రాకతో సరికొత్త వ్యూహం

> ఇప్పటిదాకా కలెక్టరేట్ల ప్రారంభోత్సవాలు.. ఎస్పీ ఆఫీసులు, బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాల ఓపెనింగుల పేరిట రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ పర్యటించి వచ్చిన సీఎం కేసీఆర్.. ఇప్పటి నుంచి 'రూటు' మార్చనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ స్పీడు పెరగటం, బీజేపీ జాతీయ నాయకులను తీసుకొచ్చి హడావుడి చేస్తుండటం తదితర కారణాల రీత్యా ఆయన కూడా సరికొత్త ఎన్నికల వ్యూహాన్ని రచించారు. ఇప్పటి నుంచే దాన్ని అమలు చేయబోతున్నారు.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు తనతోపాటు సమాన ప్రాధాన్యత కల్పించటం ద్వారా ఎన్నికల ప్రచారంలో ఆయన వారిని వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఉత్తర, దక్షిణ తెలంగాణాలతోపాటు హైదరాబాద్ నగరాన్ని ప్రత్యేకంగా విభజించుకుని... ఆయా ప్రాంతాల్లో వారు పర్యటించనున్నారు. ఇందుకోసం ఒక ప్రత్యేక ప్లాన్‌ను కేసీఆర్ రూపొందించినట్టు తెలంగాణ భవన్ వర్గాలు తెలిపాయి. ఉదాహరణకు ఆ షెడ్యూల్ ప్రకారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కేసీఆర్ పర్యటన ఉంటే... మిగతా రెండు ప్రాంతాల్లో కేటీఆర్, హరీశ్ విడివిడిగా పర్యటిస్తారు. మరో సందర్భంలో సీఎం దక్షిణ తెలంగాణ పర్యటనకు వెళితే... మంత్రులిద్దరూ మిగతా ఏరియాల్లో ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహిస్తారు. తద్వారా ఒకే రోజు ముగ్గురు నేతలూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ద్వారా అటు కాంగ్రెస్, బీజేపీ మీద ఎదురుదాడి చేయొచ్చన్నది కేసీఆర్ వ్యూహం.

జాతీయ పార్టీ కాంగ్రెస్ రాష్ట్రంలో ఇప్పటికే పలు సభలతో హడావుడి చేస్తోంది. కర్నాటక ఫలితాలతో ఆ పార్టీ కార్యకర్తల్లో నిండిన జోష్‌ను అలాగే కొనసాగించేందుకు అది మీటింగుల మీద మీటింగులు నిర్వహిస్తోంది. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన రాహుల్ గాంధీ సభతో రాజకీయాలు మరింత హీటెక్కాయి. హస్తం పార్టీ నిర్వహించిన ఈ సభ ద్వారా అది ఎలక్షన్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టినట్టే. అందువల్లే రాహుల్... ప్రజలపై వాగ్దానాల వర్షం కురిపించారు. ఈ క్రమంలో ఇప్పటి నుంచే రాహుల్‌తోపాటు సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తదితరులు రాష్ట్రంలో పర్యటించనున్నారు. వారితోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. మరో జాతీయ పార్టీ బీజేపీ కూడా ఢిల్లీ పెద్దల్ని రంగంలోకి దించనుంది. ఇప్పటికే ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు రాష్ట్రంలో పర్యటించి వెళ్లారు.

ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ప్రధాని మోడీతోపాటు బీజేపీ రాష్ట్రాల సీఎంలు వరసగా తెలంగాణలో సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఈ పరిణామాలన్నింటి రీత్యా... కాంగ్రెస్, బీజేపీలతో ఢీ అంటే ఢీ అనే విధంగా గులాబీ దళపతి తన వ్యూహాన్ని, కార్యాచరణను సిద్ధం చేసుకున్నట్టు బీఆర్‌ఎస్‌లోని సీనియర్లు చెబుతున్నారు. అందుకే ఆ రెండు పార్టీలపై మూకుమ్మడిగా విమర్శనాస్త్రాలు సంధించటం ద్వారా వాటిని గుక్క తిప్పుకోకుండా చేయాలంటూ ఆయన కేటీఆర్, హరీశ్‌లకు దిశా నిర్దేశం చేశారు. ప్రచారం సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు వివరించాలని ఆయన వారికి సూచించారు. దాంతోపాటు పెన్షన్లు, రైతులకు సహాయాలు, ఉద్యోగుల జీత భత్యాలు, మహిళా సంక్షేమం తదితరాంశాలను కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోల్చి చూపటం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రత్యేతకను చాటి చెప్పాలంటూ సీఎం ఆదేశించారు. అప్పుడే ఆ రెండు జాతీయ పార్టీలను ధీటుగా ఎదుర్కోగలమనీ, ప్రచారాన్ని వేడెక్కించగలమని ఆయన భావిస్తున్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి.

వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా మోడల్ స్కూల్ సిబ్బంది బదిలీలు

- పాత జోన్ల ప్రకారమే నిర్వహణ
- రేపటినుంచి దరఖాస్తుల స్వీకరణ
- 18,19 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదు
- 21 నుంచి 23 వరకు బదిలీల ఉత్తర్వులు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎట్టకేలకు మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న బదిలీలకు మోక్షం లభించింది. ఆన్‌లైన్‌లో వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మోడల్ స్కూళ్లను ప్రారంభించిన పదేండ్ల తర్వాత మొదటిసారి ఈ బదిలీలు జరుగుతుండడం గమనార్హం. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, మోడల్ స్కూల్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవసేన సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రాథమిక ఖాళీల వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈనెల 14న ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లను ప్రకటిస్తామని వివరించారు. ఈనెల 16, 17 తేదీల్లో తుది ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లను విడుదల చేస్తామని తెలిపారు. ఈనెల 18,19 తేదీల్లో బదిలీలకు సంబంధించి వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు బదిలీల ఉత్తర్వులను జారీ చేస్తామని వివరించారు. 23 నుంచి 29 వరకు బదిలీల ఉత్తర్వులపై అప్పీళ్లను స్వీకరిస్తామని తెలిపారు. ఆన్‌లైన్ బదిలీల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అయితే రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో మూడు వేల మంది ఉపాధ్యాయులు, 90 మంది ప్రిన్సిపాళ్లు పనిచేస్తున్నారు. కోర్టు కేసు వల్ల వారికి నూతన జోన్ల ప్రకారం ఉపాధ్యాయుల విభజన జరగలేదు. దీంతో పాత జోనల్ విధానం ప్రకారమే బదిలీలు జరుగుతున్నాయి. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆమోదం పొందిన తర్వాతే ఈ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు.

టీఎస్‌యూటీఎఫ్, ఎంఎస్‌టీఎఫ్ హర్షం

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయడం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి, టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి కొండయ్య, ఎస్ మహేష్ హర్షం ప్రకటించారు. పదేండ్లుగా ఒకే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు గత కొన్ని ఏండ్లుగా బదిలీలు కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అధికారులకు ప్రాతినిధ్యాలు చేశామని, ఆందోళనలు నిర్వహించామని గుర్తు చేశారు. ఇందుకోసం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు.

ప్రభుత్వానికి టీఎంఎస్‌టీఏ కృతజ్ఞతలు

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు షెడ్యూల్ విడుదల చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి టీఎంఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు, ప్రధాన కార్యదర్శి కె నగేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

పోడు పట్టాల పంపిణీ వారంలో పూర్తిచేయాలి

- వృత్తిదారుల ఆర్థిక సహాయం దరఖాస్తులు పరిశీలించండి : కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోడు భూముల పట్టా పంపిణీ పురోగతిని సమీక్షించారు. గృహలక్ష్మి పథకం, ఎరువులు, విత్తనాల నిల్వలు, తెలంగాణకు హరితహారం, బీసీ చేతివత్తుల వారికి ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ పథకం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై ఆమె కలెక్టర్లను అడిగి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వానా కాలం సీజన్‌లో పోడు పట్టాల లబ్ధిదారులకు రైతుబంధు పథకం కింద ఆర్థిక సహాయం అందించాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను వారంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. పోడు రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను రైతు బంధు పోర్టల్‌లో జమ చేయాలని, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని,తాజాగా చెట్లను నరికివేయకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఎరువులు, విత్తనాల నిల్వలపై కలెక్టర్లు రోజువారీ సమీక్ష నిర్వహించాలన్నారు.కలెక్టర్లు రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి, వాటి పనితీరు సామర్థ్యాన్ని పరిశీలించాలనీ, మిల్లుల్లోని స్టాక్ పొజిషన్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. బీసీ చేతివృత్తిదారులకు ఆర్థిక సహాయం కింద అందిన దరఖాస్తు‌లన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయత్ రాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, రోడ్లు, భవనాల కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎస్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఎస్సీ డెవలప్‌మెంట్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగింది పడకల సంఖ్యే..

నర్సుల సంఖ్య కాదు..

- సర్కారీ దవాఖానాల తీరిది
- ప్రస్తుతమున్న నర్సులపై పనిభారం...
- రోగులకు సేవల్లోనూ ఇబ్బందులు
- ఖాళీలన్నీ భర్తీ చేస్తేనే ప్రయోజనం





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో పడకల సంఖ్య గణనీయంగా పెరిగింది. తెలంగాణ ఏర్పడక ముందు 17 వేలున్న పడకలు దాదాపు రెట్టింపు కాగా వాటి సంఖ్యను 50 వేలకుపైగా పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నది. దీంతో ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లోనూ నమ్మకం పెరిగింది. ఆ మేరకు ఆస్పత్రుల సామర్థ్యాన్ని మించి రోగులు వస్తున్నట్టు తెలుస్తున్నది. అందుకు తగినట్టుగా నర్సుల సంఖ్య మాత్రం పెరగకపోవడంతో రోగులకు సేవల్లో జాప్యం జరుగుతున్నది. సదుపాయాలు, సౌకర్యాలు, భవనాల నిర్మాణం, డాక్టర్ల నియామకం చేపడుతున్నా.... నర్సులందించాల్సిన సేవలు మాత్రం పూర్తి స్థాయిలో లేకపోవడం లోటుగా కనిపిస్తున్నది.

2014 నాటికి రాష్ట్రంలో 17 వేల పడకలుండగా మంజూరైన నర్సుల పోస్టులు 9,200 ఉండేవి. అంటే అప్పటికే దాదాపు నాలుగు వేల మంది విధులు నిర్వహిస్తుండగా, మరో ఐదు వేల వరకు ఖాళీలున్నాయి. 2017లో భర్తీ చేసిన నర్సుల పోస్టులతో కలిపి ఇన్‌సర్వీస్‌లో దాదాపు 6 వేల మంది పని చేస్తున్నారు. తాజాగా మరో 5,204 పోస్టులకు త్వరలో పరీక్ష నిర్వహించనుండగా, ఇటీవల 1827 పోస్టులను భర్తీ చేసుకునేందుకు ఆర్థిక శాఖ అనుమతించింది. కరోనా సమయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్న నర్సుల్లో వెయ్యి మందికి పైగా తొలగించారు.

ప్రస్తుతం ఉన్న పడకలు, రోగులకు మెరుగైన సేవలందించాలంటే కనీసం 13 వేల మంది నుంచి 15 వేల మంది వరకు నర్సులు అవసరమని నిపుణులు చెబుతున్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ, జిల్లా ఆస్పత్రుల స్థాయి అప్‌గ్రేడ్ తదితర వాటితో విస్తరించిన వైద్యసేవలకు అనుగుణంగా నర్సుల నియామకం చేపట్టకపోవడం ఇబ్బందులకు తావిస్తున్నట్టు తెలుస్తున్నది. నిలోఫర్ లాంటి ఆస్పత్రుల్లోనూ ప్రస్తుతం ఉన్న నర్సుల సంఖ్యకు రెట్టింపు సంఖ్యలో అవసరముంటారని తెలుస్తున్నది. మరోవైపు ఆస్పత్రి సేవలను విస్తరిస్తున్నారు. దీంతో అదనంగా నర్సుల సేవలూ అవసరమవుతాయి. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో నిత్యం పడకల సంఖ్యకు మించి రోగులు వస్తుండటంతో ప్రస్తుత సిబ్బందిపై భారం పడుతున్నది. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు 50 వేల పడకలకు విస్తరిస్తే కనీసం 18 వేల నుంచి 20 వేల మంది నర్సులు అవసరముంటాదని అంచనా.

శాశ్వత సేవలకు తాత్కాలిక సిబ్బంది....

ఖాళీ పోస్టులు భర్తీ చేసే వరకు ప్రభుత్వం కీలకమైన సేవల విభాగంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నర్సుల సేవలను ఉపయోగించుకుంటోంది. అయితే రెగ్యులర్ నర్సులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా సమాన పనికి సమాన వేతనం రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యసేవలనేవి శాశ్వత సేవలు. అదే రీతిలో నర్సులను కూడా శాశ్వత ప్రాతిపదికన సకాలంలో నియమించాలని నిపుణులు సూచిస్తున్నారు. రెగ్యులర్ నర్సుల పోస్టుల భర్తీకి పరీక్ష జరగనున్న నేపథ్యంలో తాత్కాలిక సిబ్బంది వాటి కోసం సిద్ధపడేందుకు ఎక్కువగా సెలవుల్లో ఉంటున్నట్టు సమాచారం. దీంతో ఆయా ఆస్పత్రుల్లో నర్సింగ్ సేవలకు మరింత విఘాతం కలుగుతున్నట్టు తెలిసింది. కొత్త ఆస్పత్రులు, పాత ఆస్పత్రుల విస్తరణ, పడకల సంఖ్య పెంపు వంటి నిర్ణయాలు తీసుకున్న సమయంలోనే నియామక ప్రక్రియనుకూడా ప్రారంభిస్తే రోగులకు మరింత మెరుగ్గా సేవలందించే అవకాశముంది.

ఆర్జీయూకేటీకి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి వీసీ
- ఈ నెల 7, 8, 9న కౌన్సెలింగ్

నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లాలోని బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో 2023-24విద్యా సంవత్సరానికిగాను పీయూసీ మొదటి సంవత్సరానికి ఎంపికైన విద్యార్థుల ప్రవేశాల జాబితాను సోమవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ విడుదల చేశారు. యూనివర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.1404 సీట్లకుగాను, 13,538 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎంపికైన 1404 మంది విద్యార్థుల వివరాలు తెలిపారు. బాలికలు 67శాతం సీట్లు, బాలురులు 33 శాతం సీట్లు పొందారన్నారు. ఆర్జీయూకేటీలో 99 శాతం సీట్లను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పొందినట్టు తెలిపారు. అత్యధికంగా సిద్దిపేట జిల్లాకు 322 సీట్లు దక్కగా, అత్యల్పంగా జోగులాంబ గద్వాల జిల్లాకు 2 సీట్లు వచ్చాయని తెలిపారు. నిర్మల్ జిల్లాకు 92 సీట్లు వచ్చాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 7, 8, 9 తేదీల్లో 500 మంది విద్యార్థుల చొప్పున యూనివర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని, రాబోయే సంవత్సరం నుంచి 100 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉంటరాని తెలిపారు. విద్యార్థులకు 2,200ల్యాప్‌ట్యాప్‌లు కొనుగోలు చేశామని, తరగతి గదుల మరమ్మతు పూర్తి చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఆయా విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఉపా' ఎత్తివేతకు ఐక్య పోరాటాలు

- 11 వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) ఎత్తివేత కోసం ఐక్య పోరాటాలను చేపట్టాలని 11 వామపక్ష, కమ్యూనిస్టులు పార్టీలు నిర్ణయించాయి. సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో ఉన్న ఓంకార్ భవన్‌లో ఆ పార్టీల సమావేశాన్ని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సారంపల్లి మల్లారెడ్డి (సీపీఐఎం), మండల శ్రీనివాస్ (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), ఎం హన్మేష్ (సీపీఐఎంఎల్ ప్రజాపంథా), పి మహేష్ (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), సిహెచ్ మురహరి (ఎస్‌యూసీఐసీ), జానకి రాములు (ఆరెస్పీ), వనం సుధాకర్, వి తుకారాం నాయక్ (ఎంసీపీఐయూ) తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. ములుగు జిల్లా తాడ్వాయిలో 152 మందిపై పెట్టిన ఉపా కేసులను ఎత్తేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. పోడు రైతులకు హక్కు పత్రాలివ్వటంలో, పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం, పంపిణీలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. నిరుద్యోగం, నిరుద్యోగ భృతి ఇవ్వటంలో రాష్ట్ర ప్రభుత్వం దాటవేత విధానం అవలంభిస్తున్నదని పేర్కొన్నారు. ఇంకా గృహలక్ష్మి, ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యలపై ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా, నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. త్వరలో మరో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.

ఎన్‌ఈపీ, సీపీఎస్‌ను రద్దు చేయాలి

విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై నిరసన

- 11,12,13 తేదీల్లో మండలాల్లో పాదయాత్రలు
- కేజీబీవీ, యూఆర్ఎస్ సమస్యలపై 20న చలో ఎస్పీడీ కార్యాలయం
- గురుకుల టీచర్ల సమస్యలపై ఆగస్టు 5న హైదరాబాద్‌లో మహాధర్నా
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యలో కేంద్రీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణను పెంచి పోషించేలా ఉన్న జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ-2020)ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లౌకిక, ప్రజాస్వామిక, శాస్త్రీయ విలువలతో కూడిన ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని కోరింది. ఉద్యోగుల కుటుంబాల సామాజిక భద్రతకు ముప్పుగా పరిణమించిన జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్-సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని తెలిపింది. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని వర్చువల్ పద్ధతిలో సోమవారం నిర్వహించారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.ఏడు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పొదుపు మొత్తాలపై ఇచ్చే పన్ను రాయితీని రూ.మూడు లక్షలకు పెంచాలని కోరారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో మండలాల్లో పాదయాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. వచ్చేనెల 12న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపడతామని పేర్కొన్నారు.

టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ తదితర పర్యవేక్షణాధికారుల పోస్టులను మంజూరు చేసి రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని జంగయ్య, చావ రవి డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలని కోరారు. బడుల్లో మౌలిక వసతులు కల్పించాలని, నెల మొదటి తేదీన వేతనాలివ్వాలని, ట్రెజరీల్లో పాసై ప్రభుత్వం వద్ద నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. బకాయి ఉన్న రెండు డీఏ వాయిదాలను విడుదల చేయాలని, రెండో పీఆర్సీ కమిటీని నియమించి ఈ ఏడాది జులై ఒకటి నుంచి ఆర్థిక ప్రయోజనంతో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని యాజమాన్యాల విద్యాసంస్థల్లోని ఉద్యోగులకు ఆరోగ్య కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. శ్రమకు తగిన వేతనాలివ్వాలని పేర్కొన్నారు. గురుకుల విద్యా సంస్థలు, మోడల్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ పాఠశాలలు, కేజీబీవీ, యూఆర్ఎస్, సింగరేణి తదితర విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయా యాజమాన్యాల వారీగా దశలవారీ ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని వివరించారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 17న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు, వచ్చేనెల ఐదో తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్ సమస్యలపై ఈనెల 20న చలో ఎస్పీడీ కార్యాలయం కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. ఈ పోరాట కార్యక్రమాలన్నింటిలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు.

డిమాండ్లు

- జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ-2020)ని రద్దు చేయాలి.
- జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్-సీపీఎస్)ని రద్దు చేసి పాత పెన్షన్ విధానా(ఓపీఎస్)ని పునరుద్ధరించాలి.
- ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.ఏడు లక్షలకు పెంచాలి. పొదుపు మొత్తాలపై ఇచ్చే రాయితీని రూ.మూడు లక్షలకు పెంచాలి.
- దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
- కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ తదితర తాత్కాలిక ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనమివ్వాలి.
- రాష్ట్రంలో విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ముందు సీఐటీయూ ధర్నా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్, డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలనీ, రాష్ట్రవ్యాప్తంగా ఒకటే హోదాను అమలు చేయాలని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్, డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దీనికి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.బ్రహ్మాచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా డైలీవేజ్ వర్కర్లుగా పిలవబడుతూ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టల్స్ ఆశ్రమ, పాఠశాలలో 3,070 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఆర్థిక శాఖ డైలీవేజ్ అనే పదాన్ని ఆమోదించటం లేదనే సాకుతో వారిని ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా మార్చి వేతనాలు తగ్గించాలనే ప్రయత్నానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకున్నదని విమర్శించారు. ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సహజ న్యాయ సూత్రానికి విరుద్ధంగా ఉన్న వేతనాన్ని తగ్గించడం చట్ట వ్యతిరేక చర్య అని అభివర్ణించారు. జీవో నెంబర్ 70లో ప్రభుత్వమే డైలీవేజ్ ప్రాతిపదికన కార్మికులను తీసుకోవాలనీ, కాంట్రాక్టు ప్రాతిపదికన టీచర్లను నియమించాలని జీవో ఇచ్చిందని గుర్తుచేశారు. 1994కి ముందు నుంచే 400 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారనీ, వారిలో ఇప్పుడు 150 మంది పేర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని అధికారులు చెప్పటం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రమేర్పడే నాటికి ఐదేండ్ల సర్వీస్ కలిగిన కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

హైకోర్టు తుదితీర్పు తర్వాత ...

- ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం : మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు తుదితీర్పు వచ్చాక ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. సోమవారం సచివాలయంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం అంశం పై ఆ ఆస్పత్రి పరిధి ప్రజా ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి నూతన నిర్మాణం చేపట్టాలని ఏకగ్రీవంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల వైద్య అవసరాల కోసం పాత భవనాలు తొలగించి అయినా నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ వారి అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిశీలించి, అఫిడవిట్ రూపంలో హైకోర్టుకు తెలియ చేస్తుందని తెలిపారు. నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ 2015లోనే ఆ ఆస్పత్రిని సందర్శించి, కొత్త భవన నిర్మాణానికి ఆదేశించినట్టు మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. తదనంతరం నిర్మాణం కూల్చవద్దని కొందరు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు స్టే ఇచ్చిందని తెలిపారు.హైకోర్టు ఆదేశాల మేరకు వేసిన ఐఐటీ హైదరాబాద్ నిపుణుల కమిటీ కూడా ఆస్పత్రి అవసరాలకు ఈ భవనం పని చేయదని చెప్పిందని వివరించారు. కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకున్నట్టు వివరించారు. కొత్త భవనం నిర్మాణానికి ఏకగ్రీవంగా అంగీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీలు ప్రభాకర్ రావు, వాణీ దేవి, రహమత్ బెగ్, హసన్ ఎఫెండి, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, దానం నాగేందర్, గోపీనాథ్, జాఫర్ హుస్సేన్, కౌసర్ మొయినుద్దీన్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, సీఎం ఓఎస్డీ గంగాధర్, టీఎస్ఎంఐడీసీ ఛైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఈఎన్‌సీ గణపతి రెడ్డి, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం నిర్మించాలి

- అధునాతన వైద్యం ఉన్నా స్థలం లేదు
- లీగల్ సమస్యకు ప్రత్యామ్నాయం ఆలోచించాలి
- ఉస్మానియా ఆస్పత్రిని సందర్శించిన గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ - ధూల్ పేట్

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా ఆస్పత్రిలో వైద్యసేవలు, వస్తున్న రోగులకు అనుగుణంగా నూతన భవనం నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సోమవారం ఉస్మానియా ఆస్పత్రిని ఆమె సందర్శించారు. సూపరింటెండెంట్ కార్యాలయంలో వివిధ విభాగాల హెచ్ఓడీలు, అడిషనల్ సూపరింటెం డెంట్, ఆర్ఎంఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణం లో ఉన్న కులీకుతుబ్‌షా భవనంలోని కార్డియాలజీ నెఫ్రాలకార్డియాలజీ, ఏఎన్ఎస్యుబ వార్డులను పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్య చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ఒకే భవనంలో నాలుగు అంతస్తుల్లో రోగులను ఇరుకు ఇరుకుగా బెడ్ల పైన ఉంచి వైద్య చికిత్స అందిస్తున్న పరిస్థితిని చూసి గవర్నర్ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగో ఫ్లోర్‌లో వార్డులోనే పలు బాత్రూంలకు డోర్లు లేవని, అదేవిధంగా రెండ్రోజుల నుంచి నీరు రావడం లేదని పలువురు రోగులు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. రెండో అంతస్తులోని ఫ్లోరింగ్ పైకప్పు లేకపోవడంతో దాన్ని చూసిన గవర్నర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇదిలా ఉండగా ఆస్పత్రిలోని ఖాళీ స్థలంలో నూతన భవనాలు నిర్మించాలని పలువురు విభాగాల అధికారులు, సిబ్బంది గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆమె సానుకూలంగా స్పందించి ఈ విషయంపై ప్రభుత్వానికి లేఖ రాస్తానని తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉస్మానియాలో కనీసం 3000 నుంచి 4000 బెడ్స్ ఉండాలన్నారు. మూడు భవనాల్లో ఉండాల్సిన రోగులను ఒక్క భవనంలో ఉంచి వైద్యం అందించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇరుకుగా ఉన్న ఆస్పత్రిలోనే మెరుగైన సేవలు అందిస్తున్న వైద్యులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. 2019లో గవర్నర్ అయ్యాక మొదటిసారి తనను ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ పాండు నాయక్, ఓజిహెచ్ వైద్యులు వచ్చి కలిసి, లేఖ అందించారని గుర్తు చేశారు. ఆస్పత్రి భవనం విస్తరించాలని అనేక మార్లు ప్రభుత్వానికి చెప్పామని తెలిపారు. కొత్త భవనం నిర్మాణానికి లీగల్ సమస్యలు ఉంటే ప్రత్యామ్నాయ పరిస్థితులు చూడాలన్నారు. త్వరగా నూతన భవనం కట్టాలని చెప్పడం కూడా రాజకీయం అనిపిస్తే ఏమి చెప్పగలమన్నారు. ఇలాంటి విషయాలను సుహృద్భావంతో తీసుకోవాలి కానీ తాను రాజకీయ నేతలా మాట్లాడుతున్నానని అనడం సరికాదన్నారు. తనను ప్రశ్నించడానికి బదులుగా సమస్యకు పరిష్కారం చూపితే బావుంటుందని చెప్పారు. 7.5 ఎకరాల్లో ఎక్కువ అంతస్తులు వేసి ఆస్పత్రి భవనం కట్టొచ్చని సూచించారు.

సంపాదకీయం

బీజేపీ 'మహా' కుట్ర

ప్రతిపక్షాలను ధ్వంసం చేయడమే పనిగా పెట్టుకున్న బీజేపీ మహారాష్ట్రలో ఎన్సిపిని చీల్చిపడేసింది. శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న అజిత్ పవార్, తన అనుచర ఎనిమిది మంది ఎమ్మెల్యేలను వెంటేసుకొని ఉన్నపళంగా ఆదివారంనాడు అధికార శివసేన (ఏక్నాథ్ షిండే), బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం పంచన చేరారు. అలా వచ్చారో లేదో ఇలా అజిత్కు కేబినెట్లో ఉపముఖ్యమంత్రిగా, తతిమ్మా ఎనిమిది మందిని మంత్రులుగా నియమించారు ముఖ్యమంత్రి ఏక్నాథ్ షిండే. వెనువెంటనే రాజ్భవన్లో గవర్నర్ రమేశ్ బైస్ వారి చేత పదవీ ప్రమాణం చేయించారు. ఉదయం తొమ్మిది గంటలకు అజిత్ నేతృత్వంలో ఎమ్మెల్యేల భేటీ, ప్రతిపక్ష నేత పదవికి అజిత్ రాజీనామా, క్షణాల్లో స్పీకర్ ఆమోదం, ప్రభుత్వంలో చేరిక, ప్రమాణ స్వీకారం... ముందస్తు ప్రణాళిక లేకుండా కొన్ని గంటల్లో ఈ 'రాజకీయ' క్రతువు ఎంతమాత్రం సాధ్యమయ్యే పని కాదు. కేంద్ర బీజేపీ కనుసన్నల్లోనే వ్యవహారమంతా నడిచింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ ఎన్సిపి ఫినిష్ అయిపోతుందని ప్రకటించారు. అంతకుముందు అజిత్ పవార్ కేంద్ర హోం మంత్రి అమిత్షాతో సమావేశ మయ్యారు. వీటికి కొనసాగింపే అజిత్ ముఠా ఫిరాయింపు.

అధికారం కోసం నానా గడ్డి కరవడం బీజేపీకి అలవాటే. ప్రతిపక్ష పార్టీలలో అసంతృప్తి నాయకులకు గాలం వేసి ఏదొక రకంగా చేరదీయడం, ప్రభుత్వాలను కూల్చేయడం చూస్తున్నదే. మధ్యప్రదేశ్లో, గతంలో కర్నాటకలో అదే చేసింది. రాజస్థాన్లో అటువంటి ప్రయత్నాలే చేస్తోంది. నాలుగేండ్ల నుంచి మహారాష్ట్రలో చేస్తున్నవి అలాంటి కుట్రలే. ప్రభుత్వాల ఏర్పాటులో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ వంటివి పాత్ర పోషించడం బీజేపీ నిరంకుశ, ఏకపక్ష రాజకీయాలకు పరాకాష్ట.




మహారాష్ట్రలో 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత గడచిన నాలుగేండ్లలో పార్టీల చీలికలు, ఎమ్మెల్యేల ఫిరాయింపులు డ్రామాలా జరుగుతుండగా వీటికి పక్కా స్క్రిప్టు అందిస్తున్నది మోడీ-షా ద్వయమేనన్నది జగమెరిగిన సత్యం. ఎన్నికలకు ముందు బీజేపీ, శివసేన కలిసి పోటీ చేశాయి. సి.ఎం. పదవి విషయంలో విభేదాలు రావడంతో శివసేన దూరం జరిగింది. మెజారిటీ లేనప్పటికీ కేంద్ర బీజేపీ సూచనల మేరకు అప్పటి గవర్నర్ తెల్లవారుజామున బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ చేత సి.ఎం.గా ప్రమాణం చేయించారు. అప్పుడే అజిత్ పవార్ను దువ్వి ఆయనతో డిప్యూటీ సిఎంగా ప్రమాణం చేయించారు. నాలుగు రోజుల్లోనే శరద్ పవార్ ఒత్తిడి మేరకు అజిత్ వెనక్కొచ్చేశారు. ఫడ్నవీస్ సర్కారు కూలిపోయింది. ఉద్ధవ్ ధాకరే నేతృత్వంలో శివసేన-ఎన్సిపి-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. సహించలేని బీజేపీ గతేడాది జూన్లో శివసేనను నిట్టనిలువునా చీల్చి ఏక్నాథ్ షిండేకు మద్దతిచ్చి సి.ఎం.ను చేసింది. ఏడాదిలో ఇప్పుడు ఎన్సీపీ ఎమ్మెల్యేల్లో చీలిక పెట్టింది. వాస్తవానికి ఏక్నాథ్, బీజేపీ ప్రభుత్వానికి మెజార్టీ ఉంది. రానున్న పార్లమెంట్ ఎన్నికలు, ఆపై అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఎన్సీపీని బీజేపీ చీల్చింది. సి.ఎం.గా పని చేసిన ఫడ్నవీస్ ఏక్నాథ్ కేబినెట్లో డిప్యూటీ సి.ఎం.గా ఉన్నారు. మరలా అజిత్ కోసం మరో డిప్యూటీ సి.ఎం. పదవిని సృష్టించడం భవిష్యత్ రాజకీయ లబ్ధి కోసమే. కాగా తమ పార్టీ చీలిపోలేదని, కొంత మంది ఎమ్మెల్యేలు మాత్రమే వెళ్లారని, వారిపై చర్యలు తప్పవని ఎన్సిపి చీఫ్ శరద్ పవార్ అంటున్నారు.

అధికారం కోసం నానా గడ్డి కరవడం బీజేపీకి అలవాటే. ప్రతిపక్ష పార్టీలలో అసంతృప్తి నాయకులకు గాలం వేసి ఏదొక రకంగా చేరదీయడం, ప్రభుత్వాలను కూల్చేయడం చూస్తున్నదే. మధ్యప్రదేశ్లో, గతంలో కర్నాటకలో అదే చేసింది. రాజస్థాన్లో అటువంటి ప్రయత్నాలే చేస్తోంది. నాలుగేండ్ల నుంచి మహారాష్ట్రలో చేస్తున్నవి అలాంటి కుట్రలే. ప్రభుత్వాల ఏర్పాటులో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ వంటివి పాత్ర పోషించడం బీజేపీ నిరంకుశ, ఏకపక్ష రాజకీయాలకు పరాకాష్ట. బీజేపీ పంచన చేరిన అజిత్ పవార్పై అవినీతి కేసులున్నాయి. ఆయనతో వెళ్లిన ఎమ్మెల్యేలందరూ కేసులెదుర్కొంటున్నవారే. అజిత్ పదవీ కాంక్ష ఉండనే ఉంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఒంటరిపాటు చేసి ఓడించే లక్ష్యంతో మొన్న పాట్నాలో నిర్వహించిన విపక్షాల భేటీలో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ కీలకంగా నిలిచారు. ఆ భేటీకి ఆతిథ్యమిచ్చిన నితీష్ సర్కారును అస్థిరపర్చే కుట్రలు చేసి విఫలమైంది బీజేపీ. ఇప్పుడు ఎన్సీపీ ఎమ్మెల్యేలకు ఎర వేసి ఆ పార్టీని ఇబ్బంది పెట్టి భయపెడుతోంది. ప్రజాస్వామ్యాన్ని అంతమొందించేందుకూ బీజేపీ వెనుకాడట్లేదు. బీజేపీ కుట్రలను ఎదుర్కొని నిలబడటమే పార్టీల ముందున్న సవాల్. ప్రజాస్వామ్య పరిరక్షణే దేశ ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

ఎఫ్సిఐ వికృత తర్కం

ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎఫ్సిఐని పక్కన పెట్టి నేరుగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకుంటే అప్పుడు జాతీయ ప్రజాపంపిణీ వ్యవస్థ మొత్తం దెబ్బతినిపోతుంది. అలా దెబ్బ తినిపోతే దానికి బీజేపీ నుంచి పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఆ పార్టీకి ప్రజల అవసరాలేమీ పట్టవు. నిజానికి ఆ పార్టీ ముందుకు తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలు గనుక అమలులోకి వచ్చివుంటే ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బ తినిపోయివుండేది. కాని ఈ వ్యవస్థ దెబ్బ తింటే దానివలన నష్టపోయేది యావత్తు దేశమే.

కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం "అన్న భాగ్య" పథకాన్ని ఈనెల 1వ తేదీ నుండి అమలు చేస్తామని ప్రకటించింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతీ కుటుంబానికీ నెలకు 10 కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందజేయాలన్నది ఆ పథకం లక్ష్యం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆ కుటుంబాలకు నెలకు 5కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. దానికి మరో 5కిలోలను అదనంగా చేర్చి ఒక కోటి 19 లక్షలమంది నిరుపేదలకు అందించాలన్నది కర్నాటక ప్రభుత్వం ఉద్దేశ్యం. ఇప్పుడు ఈ పథకం చిక్కుల్లో పడింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్సిఐ) కర్నాటక ప్రభుత్వానికి బియ్యం అమ్మడానికి నిరాకరించింది. కేంద్ర ప్రభుత్వం కరోనా కాలంలో మొదలుపెట్టిన అంత్యోదయ పథకాన్ని ఎత్తివేయాలని కొంతకాలంగా యోచిస్తోంది. కర్నాటక ప్రభుత్వం గనుక అన్నభాగ్య పథకాన్ని మొదలుపెడితే కేంద్రం అంత్యోదయను కొనసాగించాల్సి ఉంటుంది.


ప్రభాత్ పట్నాయక్

ఎఫ్సిఐ నిరాకరించిన అనంతరం ఇతర కేంద్ర ఏజెన్సీలనుండి గాని, వేరే రాష్ట్రాలనుండి కాని బియ్యాన్ని కొనుగోలు చేయడానికి కర్నాటక ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కాని వాటివద్ద తగినంత నిల్వలు లేవు. పైగా ఆ కేంద్ర ఏజెన్సీలు కూడా కర్నాటకకు బియ్యం అమ్మకుండా కేంద్రం అడ్డు పడవచ్చు. పైగా ఈ విధంగా కొనుగోలు చేయడం వలన బియ్యం ఖరీదు పెరుగుతుంది. స్కీమును అమలు చేయడానికి ఎక్కువ సొమ్ము ఖర్చవుతుంది. రాష్ట్ర బడ్జెట్ మీద అదనపు భారం పడుతుంది.

బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి, ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఏదో అరుదుగా జరిగిన ఘర్షణ కాదిది. అధికారాలు విపరీతమైన రీతిలో కేంద్రీకరించబడిన వైనం ఇది. కేవలం రాజకీయ కారణాల కోసం, అందునా, ఒక ప్రతిపక్ష పాలిత ప్రభుత్వం ప్రజాదరణ పొందకుండా ఉండడానికి కేంద్రం చేస్తున్న కుట్ర ఇది. అందుకోసమే ఒక ప్రజానుకూల కార్యక్రమాన్ని చెడగొట్టింది. ఒకపక్క కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ అన్నభాగ్య పథకాన్ని అమలుకానీయకుండా అడ్డుపడుతూవుంటే, మరోపక్క రాష్ట్రంలోని బీజేపీ అక్కడ ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం ఎన్నికల హామీలనన్నింటినీ అమలు చేయాల్సిందేనంటూ గొంతెత్తి అరుస్తోంది.

రాష్ట్రాలలో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు చేపట్టినప్పుడు వాటిని కేంద్రం వ్యతిరేకించడం కొత్తేమీ కాదు. గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆహారధాన్యాలను సబ్సిడీపై ప్రజలకు అందించే పథకాన్ని కుదించి కేవలం పేదవారికే దానిని పరిమితం చేసింది. అప్పటికి కేరళలో సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థ అమలులో ఉంది. ఆ పథకాన్ని కొనసాగించడానికి కేరళలోని ఎల్డిఎఫ్ ప్రభుత్వం అదనపు బియ్యాన్ని రాష్ట్రంలోనే కొనుగోలు చేసింది. నిజానికి ఎఫ్సిఐ కేరళ రాష్ట్రం నుండి లెవీ బియ్యాన్ని సేకరించదు. బియ్యం ఉత్పత్తిలో కేరళ లోటు రాష్ట్రంగా ఉండడమే దానికి కారణం. అయినా, ఎల్డిఎఫ్ ప్రభుత్వం ఏ మేరకు అదనంగా బియ్యాన్ని రాష్ట్రంలో సేకరించిందో, ఆ మేరకు ఎఫ్సిఐ తన సరఫరాను కుదించింది!

అనవసరమైన, అవాంఛనీయమైన కేంద్రీకరణ అనేది కొత్తేమీ కాదు. కాని బీజేపీ ప్రభుత్వం ఆ ప్రక్రియను ఇంతకుమునుపెన్నడూ లేనంతగా అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో కూడా కొనుగోలు చేయడానికి వీలులేని పరిస్థితులను కల్పిస్తోంది. ఈ విధానం ఒక రాష్ట్ర ప్రభుత్వం పట్ల అనుసరిస్తున్న కక్షపూరితవైఖరి. నిజానికి ఆ రాష్ట్రంలోని పేదలమీద సాగిస్తున్న దాడి అని గ్రహించాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రదర్శిస్తున్న వ్యతిరేకత వలన నష్టపోతున్నది పేదలే.

ఎఫ్సిఐ కర్నాటక ప్రభుత్వానికి బియ్యం అమ్మడానికి నిరాకరించడం వెనుక రాజకీయ దురుద్దేశాలేమీ లేవని అంటూ బీజేపీ నాటకం ఆడుతోంది. కాని బియ్యం అమ్మకపోడానికి చెపుతున్న కారణాలు ఏవీ సరైనవి కావు. కేంద్రం వద్ద తగినంతగా బియ్యం నిల్వలు లేనందువలన అమ్మడం సాధ్యపడడం లేదన్నది మొదటి కారణం. మరి అటువంటప్పుడు కొద్ది రోజుల్లోనే 5లక్షల టన్నుల బియ్యాన్ని, 4లక్షల టన్నుల గోధుమల్ని అమ్మబోతున్నట్టు ఏ విధంగా ప్రకటించారు? కర్నాటక ప్రభుత్వం అడిగినది 2.46లక్షల టన్నుల బియ్యాన్ని మాత్రమే. ఆ మేరకు ఎఫ్సిఐ కర్నాటకకు అమ్మవచ్చు. కాని, ఎఫ్సిఐ రాష్ట్ర ప్రభుత్వానికి కాకుండా బియ్యం వ్యాపారులకు అమ్మడానికి సిద్ధమైంది.

ఎందుకిలా చేస్తోంది? అన్న ప్రశ్నకు చెపుతున్న సమాధానం ఏమిటి? వ్యాపారులకు బియ్యం అమ్మితే దాని వలన మార్కెట్లో ధరల పెరుగుదలను అరికట్టడం వీలవుతుందట. ఎఫ్సిఐ ఛైర్మన్ మీడియా ముందు చాలా స్పష్టంగా ఈ విషయాన్ని ప్రకటించాడు. బహిరంగంగా బియ్యాన్ని మార్కెట్లో అమ్మడం వలన ఆహారధాన్యాల ధరలు మార్కెట్లో తగ్గుతాయని చెప్పాడు. ఇది చాలా వికృతమైన వాదన. ఆహారధాన్యాల ధరల పెరుగుదలకు కారణం వాటి డిమాండ్ పెరగడమే వాస్తవం అయితే అప్పుడు ప్రభుత్వమే నేరుగా ఆహారధాన్యాలను వినియోగదారులకు అందించడం వల్ల మార్కెట్లో డిమాండ్ తగ్గి ధరలు తగ్గుతాయి. అదే వ్యాపారులకు ఆహారధాన్యాలను అమ్మితే వారు వాటిని వెంటనే మార్కెట్లో అమ్మకానికి పెడతారన్న గ్యారంటీ ఏమీ లేదు. వారు వాటిని నిల్వచేయవచ్చు. అప్పుడు ఆహారధాన్యాల ధరలు తగ్గవు. అదే ఆహారధాన్యాలను గనుక రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేస్తే అవి నేరుగా ప్రజలకు చేరుతాయి. అప్పుడు ధరలు తగ్గుతాయి.

1972లో కూడా ఇదేమాదిరిగా జరిగింది. అప్పుడు పంటలు దెబ్బతిన్నాయి. అందువలన ఆహారధాన్యాలకు కొరత ఏర్పడవచ్చునన్న అంచనాతో వాటి ధరలను బాగా పెంచివేశారు. అప్పటి ప్రభుత్వం వద్ద నిల్వలు సరిపడా ఉన్నాయి. అప్పుడు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం విడుదల చేసివుంటే, ప్రజానీకంలో గణనీయమైన భాగం బహిరంగ మార్కెట్కు రాకుండా దూరంగా ఉండేవారు. దానివలన బహిరంగ మార్కెట్లో బియ్యం డిమాండ్ తగ్గివుండేది. కాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయడానికి బదులు ఆ నిల్వలను బహిరంగ మార్కెట్లో అమ్మడానికి పూనుకుంది. బియ్యం వ్యాపారులు మహదానందంగా నిల్వలను అన్నింటినీ కొనుగోలు చేసి దాచిపెట్టారు. దాంతో ద్రవ్యోల్బణం యథాతథంగా కొనసాగింది.




అది జరిగి యాభై సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం మళ్ళీఅదే పొరపాటు చేయడానికి సిద్ధపడుతోంది. ఇక్కడ మరో వాదన రావచ్చు. కర్నాటక ప్రభుత్వ స్కీము వలన పేదలకు మరో 5కిలోల బియ్యం అదనంగా లభిస్తుంది. ఆదనపు బియ్యాన్ని వాళ్ళు అదనంగా వినియోగిస్తారు. అంతే తప్ప బహిరంగ మార్కెట్లో బియ్యం డిమాండ్ ఏమీ తగ్గదు. అందుచేత ధరలు తగ్గవు. - ఇదే ఆ వాదన.

ఈ వాదన రెండు కారణాలరీత్యా తప్పు. మొదటిది: ఈ స్కీము వలన ప్రయోజనం పొందేవారు 4.42కోట్లమంది. వీరంతా తమ వినియోగాన్ని పెంచుతారే తప్ప బహిరంగ మార్కెట్ నుంచి చేసే కొనుగోళ్ళను తగ్గించరు అని భావించడం వాస్తవికత అనిపించుకోదు. ఎంతో కొంతమేరకు బహిరంగ మార్కెట్లో ఈ స్కీము వలన బియ్యం డిమాండ్ తగ్గుతుంది.

రెండవది: మనం ద్రవ్యోల్బణం గురించి ఎందుకు ఆందోళన చెందుతాం? అది పేదలను తక్కిన తరగతుల ప్రజలకన్నా ఎక్కువగా బాధిస్తుంది కనుక. దాని ఫలితంగా వారి వినియోగం తగ్గుతుంది కనుక. ఇప్పుడు ఈ స్కీము ద్వారా వారి వినియోగాన్ని నేరుగా పెంచడం సాధ్యపడుతోంది కదా! అటువంటప్పుడు ద్రవ్యోల్బణం తగ్గడం అనేదానికి పెద్ద ప్రాధాన్యత ఏముంటుంది? ఒకవైపు భారతదేశం ఆకలిసూచికలో 100వ స్థానంలో ఉన్నా, పేదల ఆకలి తీర్చడం కన్నా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికే ప్రాధాన్యత ఇవ్వడం అంటే ప్రభుత్వం ప్రాధాన్యతలే తప్పు అని అనుకోవాలి.

అందుచేత బీజేపీ ప్రభుత్వం ధరలను తగ్గించడం గురించి మాట్లాడుతున్నది కర్నాటకకు బియ్యం అమ్మకపోడాన్ని సమర్థించుకోడానికే. దీనిని క్షమించకూడదు. తన స్వార్థరాజకీయాల కోసం పేదల బతుకులతో బీజేపీ ప్రభుత్వ చెలగాటం ఆడుతోంది. ఈ కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే ఆహారధాన్యాల ధరలను తగ్గించాలన్న నిశ్చయం ఉంది అని అనుకుంటే అప్పుడు రాష్ట్రానికి నేరుగా బియ్యాన్ని అమ్మాలే తప్ప వ్యాపారులకు కాదు. ఆహారధాన్యాల పంపిణీని కేంద్రీకృతం చేయడం వలన మొత్తం దేశ ఆహార వ్యవస్థకే దెబ్బ తగులుతుంది. ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎఫ్సిఐని పక్కన పెట్టి నేరుగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకుంటే అప్పుడు జాతీయ ప్రజాపంపిణీ వ్యవస్థ మొత్తం దెబ్బతినిపోతుంది. అలా దెబ్బ తినిపోతే దానికి బీజేపీ నుంచి పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఆ పార్టీకి ప్రజల అవసరాలేమీ పట్టవు. నిజానికి ఆ పార్టీ ముందుకు తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలు గనుక అమలులోకి వచ్చివుంటే ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బ తినిపోయివుండేది. కాని ఈ వ్యవస్థ దెబ్బతింటే దానివలన నష్టపోయేది యావత్తు దేశమే.

(స్వేచ్ఛానుసరణ)



సాయుధ పోరాట నెత్తుటి తిలకం దొడ్డి కొమరయ్య

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మొదటి అమరుడు దొడ్డి కొమరయ్య. 1946 జులై 4న కడివెండి గ్రామంలో జరిగిన ఆనాటి దమనకాండ తెలంగాణ ప్రజల జీవితాల్ని మార్చి వేసింది. జాగీర్దారులు, జమీందారుల పెత్తనంతో నలిగి చావడం కంటే ప్రాణాలు బలిదానం చేసైనా తమ జీవితాలను మార్చుకోవాలన్న దృఢ నిశ్చయంతో కదం తొక్కుతూ ముందుకు నడిచారు పోరాటవీరులు. ఎన్ని ప్రాణాలు బలి తీసుకునైనా తామే గెలవాలని అను కున్నారు దేశ్ముఖ్, వారి గుండాలు. చివరకు గెలుపెవరిదో చరిత్ర చెప్పింది. కాకిగా పుట్టి కలకాలం బతకడం కంటే నెమలిగా పుట్టి కొన్ని ఘడియలు బతికినా చాలనే సామెత ఉంది. రెండూ పక్షులే కానీ వాటికా విలువ ఎందు కొచ్చింది. కాకి తనకోసం మాత్రమే బతుకుతుంది. నెమలి మనకెంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. తనకు జన్మతహా వచ్చిన శరీర భాగాల్ని నృత్యరూపంలో ప్రదర్శిస్తూ ఖ్యాతిని పొందింది. అలాగే అమరుల త్యాగాలు కూడా మానవాళి అభ్యున్నతికి ఆభరణాలు. ఇక్కడ అమరుల గురించి ఒక వాక్యం రాయాలనిపించింది. ప్రజలకోసం పరిమళించిన ఎర్ర మల్లెలు మన అమరవీరులు. భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆనాడు వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలిచ్చిన 4వేల మంది త్యాగధనులు, వారందించిన కర్తవ్యాన్ని ముందుకు తీసుకు పోయే క్రమంలో ఈనాటివరకు తమ రక్తం ధారబోస్తున్న వీరులు ఎందరో ఆ మల్లెలకు పరిమళాలు నింపుతూనే ఉన్నారు. కొండకోనల్లో నివసించే గిరిజనుల విముక్తి కోసం పోరాడి అసువులు బాసిన బండారు చంద్రరావు, బత్తుల భీష్మారావు, పులిబిడ్డ పులి రామయ్య, శ్యామల వెంకటరెడ్డి, భూస్వాముల గుండెల్లో దడ పుట్టించిన గండ్లూరి కిషన్ రావు, గాదె శ్రీనివాసరెడ్డి, నరహరి, పాషా, విద్యుత్తు ఉద్యమ అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ.. ఇలా ఎందరో తమ ప్రాణాలు పోతాయని తెలిసికూడా ప్రజల సమస్యల కంటే తమ ప్రాణాలు ఎక్కువ కాదని చురకత్తుల గాయాలను పూలహారాలుగా స్వీకరించారు. శత్రుమూకలే వీరి ధైర్య సాహసాలను చూసి భయపడి వెనక్కితగ్గిన సందర్భాలు లేకపోలేదు.

ఎంత రక్తం ధారబోసినా ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు వస్తేనేగాని మన లక్ష్యం నెరవేరదు. పది లక్షల ఎకరాల భూమి పంపకం వల్ల ఎందరో పేద, కౌలు రైతులు దొరల దోపిడీనుండి కొంత విముక్తి పొందారు. వ్యవసాయం మీద వచ్చే ఆదాయంతో తమ బిడ్డల్ని చదివించుకున్నారు. ఆ బిడ్డలే ఇవాళ తెలంగాణలో నూతన మార్పు కోసం గళమెత్తి ప్రభుత్వాల మెడలు వంచుతున్నారు. ఈరోజు జరుగుతున్న అనేక పోరాటాలకు ఎజెండాలకు దారి చూపింది నాటి వీర తెలంగాణ సాయుధ పోరాట అనుభవాలే అనేది ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి, మల్లు స్వరాజ్యం, చిట్యాల ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి వంటి ఎందరో యోధానుయోధుల వీరగాథలే ఈనాటి పోరాటాలకు స్ఫూర్తినిస్తున్నాయి. కానీ వారు కోరుకున్న గ్రామ స్వరాజ్యాన్ని కూలదోస్తున్న శక్తులు నేడు పెరుగుతున్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, అప్పులపాలైన స్థితిలో దుర్భరంగా మారింది. నిరుద్యోగం, ధరల పెరుగుదలతో మధ్యతరగతి బాధలు వర్ణనాతీతం. మనుస్మృతినే రాజ్యాంగంగా పరిగణిస్తూ సాధించుకున్న హక్కుల్ని కాలరాస్తున్నారు. స్త్రీలు, సామాజిక తరగతుల జీవితాల్లో వచ్చిన మార్పుని వంద ఏండ్ల వెనక్కి నెడుతున్నారు. బీజేపీ పాలకుల రాక్షసకృత్యాలు పసిగట్టలేని తెలంగాణ ప్రజలు అక్కడక్కడా కొందరిని గెలిపించి కొరివితో తల గోక్కుంటున్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే సమస్యలన్నీ తీరుస్తామన్నారు. నేడు రాష్ట్రంలో మాజీ జాగీర్దార్లు, జమీందార్లు కొత్త అవతారం ఎత్తి మంత్రులు, ఎమ్మెల్యేలుగా మారారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలకు, అమలు చేసినదానికి పొంతన లేదు. ఇండ్లు లేక పేదలు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు అనేక అవస్థలు పడుతున్నారు. వారికి ఇవ్వడానికి జానెడు భూమి లేదు గానీ పాలక పార్టీల్లో ఉన్నవారికి వందలవేల ఎకరాలు ఎట్లా వస్తోంది. నిరుద్యోగం యువతను పెడదోవ పట్టించి అశక్తులను చేస్తుంటే, అది పరిష్కరించాల్సింది పోయి తాగుడుకి బానిసల్ని చేసి, శవాలపై కాసులేరుకునే చందంగా మద్యం అమ్మకాలు పెంచడం ఏ అభివృద్ధికి సూచికో ఆలోచించండి. తాగేవారు ఉన్నారు కాబట్టి అమ్ముతున్నామంటున్నారు. పిల్లలు చిన్నప్పుడు తెలియక అశుద్ధం తినబోతే తిననిస్తామా? ప్రపంచ రికార్డులకెక్కే నిర్మాణాలు కట్టేంత ధనమున్న మీకు మద్యం మీద ఆదాయం లేకపోతే ప్రభుత్వం నడవదా. వచ్చిన ఆదాయమంతా మద్యానికి ధారబోస్తే, కుటుంబాలు ఎంత అస్తవ్యస్తమవుతున్నాయో మీ దృష్టికి రాలేదా. ఆడపిల్లలపై హింస పెరగడానికి మద్యం కారణమని ఎన్నో నివేదికలు చెప్పినా ఫలితం శూన్యం. డ్రగ్ మాఫియా కూడా స్వైర విహారం చేస్తూ ఇంకా పసిపిల్లల ఉసురు తీస్తున్నది. ఇటువంటి అనేక సమస్యలు పరిష్కారం కాకుండా సాయుధ పోరాట ఫలాలు భావితరాలకు అందవు. ఈ మౌలిక మార్పులకు అవసరమైన ఎజెండాలతో త్యాగపూరితమైన ఉద్యమాలు ఇంకా ఉధృతం చేద్దాము. తొమ్మిది నెలలు మోసినా, ప్రకృతి సహజమే అయినా, భయంకరమైన పురిటి నొప్పులు లేకుండా, రక్తం చిందించకుండా శిశువుకు జన్మనివ్వలేదు తల్లి. నూతన సమాజం అవతరించాలంటే మన వేలాదిమంది అమరవీరులు అందించిన మార్గమే మనకు అనుసరణీయం. జోహార్ దొడ్డి కొమరయ్య. జోహార్ అమరవీరులకు.

(నేడు దొడ్డి కొమరయ్య వర్థంతి)

- బి. హైమావతి, 9391360886

కిరాయి మూకలకు బుర్రుంటుందా?

శిష్యుడు: గురువుగారూ గురువుగారూ... బందిపోట్లకు, హంతకులకు నీతి ఉంటుందా..?

గురువు: ఎందుకుండదు శిష్యా! భారీ దొంగతనం చేసినా, సుపారీ తీసుకుని కిరాయి హత్య చేసినా, ఓ ముఠాగా చేసినప్పుడు వారి మధ్యన కూడా ఓ కనీస నీతి ఉంటుంది. దానినే హీనపక్షం నీతి అంటారు. పక్కా ప్లాను వేసినందుకు ఇంత, కాపలా కాసినందుకు ఇంత, పట్టుబడితే పోలీసులకు ముట్టచెప్పేదానికింత అని అన్నీ ముందే నిర్ణయించుకుంటారు. దాని ప్రకారమే లబ్ధిపొందిన ఆ సొమ్మును ఆ విధంగా చివరకు పంచుకుంటారు.

శిష్యుడు: ఒకవేళ ఆ కనీస నీతి కూడా తప్పితే..

గురువు: ఏముంది వారి మధ్యలోనే మరల హత్యలు, చావులు, డ్రగ్స్ మాఫియా, ఉగ్రవాద గ్రూపుల్లో ఇలాంటివి చాలా తేలిగ్గా జరుగుతుంటాయి. మనం ఎన్ని వినడం లేదు. ఎన్ని చూడటం లేదు. విషనాగుల మధ్య చెలగాటమే ఆ జీవితాలు.

శిష్యుడు: ఇప్పుడు రష్యాలో అధ్యక్షుడు పుతిన్కు వ్యతిరేకంగా కిరాయి సైన్యం తిరుగుబాటు చేసిందని అంటున్నారు.

గురువు: అవును. ఆ కిరాయి సైన్యం మూకపేరు వాగ్నర్. ప్రయివేటు మిలటరీ కంపెనీ (పి.ఎం.సి) అంటారు. దాని అధినేత ప్రిగోజిన్. రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా పక్కన ఉన్న ఈ వాగ్నర్ మూక అకస్మాత్తుగా ప్లేటు ఫిరాయించి ఉక్రెయిన్ పక్షాన చేరి రష్యాపై ఎదురుదాడి చేసింది. రష్యాలో ఓ నగరమైన 'రోస్తావ్-అన్-డాన్' చేజిక్కించుకుని మాస్కోవైపు అడుగులు వేసింది. ఈ విపత్కర పరిణామానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ దిగ్భ్రమకు లోనయ్యాడు. వెన్వెంటనే బెలారస్ నేత లుకషెంకో రంగంలోకి దిగి పుతిన్ - ప్రిగోజిన్ మధ్య సంధి చేకూర్చాడు. తదనంతరం వాగ్నర్ కిరాయి సైన్యం మూక మరల తమ అధినేత చెప్పినట్టు ఉక్రెయిన్పై యుద్ధం చేయడానికి సన్నద్ధమైంది.

శిష్యుడు: అదేనండి గురువుగారూ నాకర్థంకావడం లేదు. నాయకుడు ఎవరిపక్షాన చేరితే వారి పక్షాన చేరి ఇతరుల ప్రాణాలు అంత తేలిగ్గా తీయడం సబబుగా ఉంటుందా..?


గురువు: యుద్ధం అంటే అదేగా శిష్యా! ప్రాణాలను బలిపెట్టడం లేదా బలితీసుకోవడం. అందుకే "యుద్ధం - శాంతి" నవల రాసిన టాల్స్టాయ్ ఏమన్నాడో తెలుసా?

శిష్యుడు: ఏమన్నాడు?

గురువు: యుద్ధాలు - హత్యలు - మారణహోమాలు ప్రపంచంలో ఉన్నంత కాలం నాగరిక మానవుడు ఉద్భవించలేడు.

శిష్యుడు: నిజమే. అసలు ఈ కిరాయి సైన్యం గురించి కొంత వివరించండి.

గురువు: ప్రపంచ సైనిక చరిత్రను అధ్యయనం చేస్తే, క్రీస్తుపూర్వం నుండే ఈ కిరాయి సైన్యం బెడద ఉన్నది. అలెగ్జాండర్ సైన్యంలో కూడా ఐదువేల కిరాయి సైన్యం ఉన్నదట. ఎప్పుడైనా, ఎక్కడైనా, అసలు సైన్యాధిపతులు ఇచ్చిన ఆజ్ఞలే ఈ కిరాయి సైన్యం పాటించాలి. స్థానిక పాలకుల అరాచక చర్యలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే గుంపులు, బందిపోటు ముఠాలు కూడా ఒక్కోసారి వారి వారి అవసరార్థం ఇలా ప్రధాన సైన్యంలో కిరాయికి చేరేవి. అలా కలిసాక అవి ఇక సైనిక నేత అంటే ఆ రాజు ఆజ్ఞలే గుడ్డిగా పాటించాలి. ఎలాంటి వివేచనా చూపకూడదు.



వర్తమానానికి వస్తే నేడు ప్రపంచంలో ఇలాంటి కిరాయి సైన్యం ముఠాలు దాదాపు పదహారువేలు ఉన్నట్టు అంచనా. ఇవి యుద్ధాల్లో పాల్గొనడంతో పాటు ఓడలు, గనులు, చమురు బావులు మొదలగు వనరులకు రవాణా స్థావరాలకు కాపలా కాస్తుంటాయి. బంగారం, ఖనిజాలు, కలప, డ్రగ్స్ అక్రమ రవాణాల్లో కీలక భూమిక పోషిస్తుంటాయి. ఇదో చీకటి సామ్రాజ్యం. మనదేశంలో కూడా కొన్ని రాష్ట్రాల్లో కొందరు కార్పొరేటర్లు, రాజకీయ నేతలు ఇలాంటి కిరాయి సైన్యం మూకలను పోషిస్తున్నారు. వారికి రాజ్యమన్నా, రాజ్యాంగమన్నా, చట్టమన్నా, అధికారులన్నా పెద్ద లెక్క ఉండదు. ఎంతకైనా తెగిస్తారు. వారికి వారి నాయకుడు చెప్పిందే శాసనం.

శిష్యుడు: అయితే ఈ కిరాయి వారికి సొంత బుర్ర ఉండదా?

గురువు: ఉన్నా ఉపయోగించరు. వారు ఆ ప్రయివేటు చట్రంలో బందీ. అయితే దానిలో ఉపాధి భద్రత దొరుకుతుందనే ఆశతో యువత ఆ మూకలో చేరుతుంది.

శిష్యుడు: అవునవును. ఆ మధ్యన కేంద్రం 'అగ్నిపథ్' వీరులు సైన్యంలో చేరిన నాలుగేళ్ళ అనంతరం వారికో సర్టిఫికెట్ ఇచ్చి ఇంటికి పంపిస్తే, దాని ఆధారంగా ప్రయివేటు కంపెనీలు ఉద్యోగాలు ఇస్తాయంటే ఏమో అనుకున్నా. అవి ఇలాంటి కిరాయి సైన్యం ఉద్యోగాలన్న మాట. ఇటు యువతకు సైనిక ఉద్యోగం, అటు కిరాయి సైన్యం ఏర్పరుచుకోమని ప్రయివేటు కంపెనీలకు చెప్పటం ఒకే దెబ్బకు రెండు పిట్టలు.

గురువు: బాగా చెప్పావ్.

శిష్యుడు: అసలు ఈ యుద్ధాలు ఎందుకు జరుగుతాయి?

గురువు: దోపిడీ, ఆధిపత్యం, సామ్రాజ్యవాదం యుద్ధాలకు కారణం.

శిష్యుడు: మరిప్పుడు వాగ్నర్ గ్రూపు తిరుగుబాటును మనం ఎలా చూడాలి?

గురువు: పదహారు నెలలుగా జరుగుతున్న ఈ దీర్ఘకాల యుద్ధంలో ఈ తిరుగుబాటు ఓ టీకప్పులో తుఫాను వంటిదని పరిశీలకులు అంటున్నారు. ఎంత అకస్మాత్తుగా పైకెగిసిందో అంతే అకస్మాత్తుగా చిచ్చుబుడ్డిలా చల్లారిపోయింది. రణతంత్రంలో ఏది అసలు ఏది నకిలీ అర్థమవడం కష్టసాధ్యం. మిత్రులు శత్రువులుగాను, శత్రువులు మిత్రులుగాను క్షణక్షణం మారుతుంటారు. కోవర్టులూ కోకొల్లలే, బయటపడినప్పుడు ఉలిక్కిపడతాం. అసలు యుద్ధం అంటేనే కకావికలం.


కె. శాంతారావు
9959745723

శిష్యుడు: మరి ఈ యుద్ధాలకు అంతం ఉండదా?

గురువు: నరహంతకులు ఉన్నంత కాలం యుద్ధాలు తప్పవు. మహనేత స్టాలిన్ చెప్పినట్టు శాంతిసాధనలో యుద్ధం అనివార్య భాగమే.

ప్రశ్నా - పరాభవమా?

'ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడులను ప్రశ్నించినవారి నోళ్ళు నొక్కుతున్నారని హక్కుల సంఘాల వారు అంటున్నారు. దీనికి మీ సమాధానం...

ఆ... ఎంత మరిచిపోదమన్నా, మరువడం కుదరడం లేదు. పగలైనా, రేయైనా, కలలో ఉన్నా, మెలుకవలో ఉన్నా అదే చిత్రం విచిత్రంగా పదే పదే కళ్ళముందు త్రిడి ఎఫెక్టుతో తారట్లాడుచున్నదే...

అధినేతగా ఎక్కడా, ఏనాడూ పత్రికా సమావేశం పెట్టని మేము, ఇప్పుడు ఇలా కన్నంలో దొంగలా పట్టుబడవలసి వచ్చిందే.

మయసభ నందు భంగపడిన సుయోధనుని చూసి పాంచాలి పక్కున నవ్వినట్టు, అమెరికా జర్నలిస్టు సబ్రినా సిద్దిఖీ సంధించిన ప్రశ్న... మా పతనానికి ఓ కారణం కాదు కదా? ఏమీ విధి వైపరీత్యము?

అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మా గౌరవార్థం యిచ్చిన విందుకు మేమేల పోవలె. పోయితిమి పో... వారితో కలసి వైట్హౌస్ ఒత్తిడిమేరకు ఈ విలేకరుల సమావేశమునకు మొహమాటముతో ఏల అంగీకరించవలె. అంగీకరించితిని పో... ఆ సమావేశమునకు సదరు సబ్రినా సిద్దిఖీ ఏల రావలె? వచ్చినది పో... రాజకీయ వ్యవస్థకే ఆయువుపట్టు వంటి ఆ ప్రశ్ననే ఏల సంధించవలె...

ఊహించని ప్రశ్నకు మా నుండి లిప్తపాటున వచ్చిన సమాధానం.


'అలా అంటున్నారా... ఆశ్చర్యపోతున్నాను. ప్రజలు అడగరే. భారత్ ప్రజాస్వామ్య దేశం. భారత్ - అమెరికా డిఎన్ఎ లోనే ప్రజాస్వామ్యం ఉంది. ప్రజాస్వామిక విలువల్లో కుల మత వయోబేధపరంగా భారతదేశంలో వివక్షలేదు.'

మా హృదయమేగా ఆ మాటలు మాట్లాడింది. పైపై పెదాలు కాదుగా. అయినా ఆ క్షణాన మా ముఖమెందుకు అంతగా పాలిపోయింది. దర్పణంలేక పోయినా వివర్ణమైన మా మోము మాకు స్పష్టంగా గోచరించిందే. అవును మా అంతరంగానికి అందని పరిణామమేదో జరుగుతున్నది.

ఆ... ఇంతకీ ఆమె ఎవరు? పాకిస్థాన్ మూలాలు ఉన్న అమెరికా వాసి. వాషింగ్టన్, గార్డియన్ పత్రికల్లో పనిచేసిన ఘననుభమున్న నేమి? ఆమె స్త్రీయే... అవును స్త్రీయే... ఒక ప్రక్క పాకిస్థానీ మూలాలు... మరో ప్రక్క స్త్రీ... ఈ రెండు కారణాలు చాలు మా అనుచరగణం వెంటబడి వేధించడానికి హా... హా... హా...

మా వారు ప్రభువును మించిన ప్రభు భక్తులని ఆమె ఎరుగురుగాక ఎరుగరు. వారి వికృత విశ్వరూపం చూసి ఎందరెందరో తోకముడిచి మా పంచకు చేరి మా భజన చేసినవారే.

మా భీకర సహచర గణం సాటిలేని అద్వితీయ



బూతుపంచాంగంతో ట్రోలింగ్ చేస్తూ ఎవ్వరిపైనానై ఇట్టే లంఘించగలదు. ఈ అంశంలో వారి సృజన శీల అపారమైనది. మాపై విమర్శలు సంధించిన వారిని పాత్రికేయ వేశ్యలు - ప్రెస్టిట్యూట్స్ అనడం లేదా మేం వినడం లేదా.

కానీ... ఇదిఏమి? ఎంతగా సమర్థించుకుందామనుకున్నా కొంగున కట్టిన నిప్పువలె మమ్ములను ఈ అంశము వదలక లోలోన దహించుచున్నదేమి. ఆమెకే అంతకంతకు అంతటయూ మద్దతు లభిస్తున్నదేమి? కడకు వైట్హౌస్ ప్రతినిధి వర్గం కూడా ఈ ట్రోలింగ్లు తమకు 'అంగీకార యోగ్యం కాదని' ప్రకటించినదేమి? సిద్దిఖీ అడిగినట్లు ప్రశ్నించినవారి నోళ్ళు నొక్కేయడం ఆమెకే ఎదురైన అనుభవంగా లోకం గమనించుచున్నదా..? మా అనుచరగణం ట్రోలింగ్లు బూమ్రింగ్ వలె మాపై విరుచుకు పడటం లేదుకదా..?!

నవతెలంగాణ



చికెన్ ధరలు
హైదరాబాద్
వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 128
రిటైల్ (లైవ్)	రూ. 150
స్కిన్‌తో	రూ. 218
స్కిన్‌లెస్	రూ. 248

కేరళకు 'ఓడీఎఫ్ ప్లస్' హోదా
సరైన పారిశుద్ధ్యం, వ్యర్థాల తొలగింపులో భేష్
- తెలంగాణ, కర్నాటకలకూ ఇదే హోదా



న్యూఢిల్లీ: కేరళ రాష్ట్రం మరో ఘనతను సాధించింది. రాష్ట్రం లోని అన్ని గ్రామాలను స్వచ్ఛ భారత్ మిషన్ కింద నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా తీర్చి దిద్దినందుకు కేంద్రం కేరళకు 'బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) ప్లస్' హోదాను అందించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్దేశించిన అంశాల ప్రకారం అన్ని గ్రామాల్లో పారిశుధ్యం, వ్యర్థాల నిర్మూలన కోసం ఆధునిక సౌకర్యాలు కల్పించబడినందున కేరళ ఈ హోదాను పొందిందని కేరళ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ (కేఎస్‌డబ్ల్యూఎంపీ) విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నది. డిసెంబర్ 2023 నాటికి కేరళ 100 శాతం ఓడీఎఫ్ మోడల్ హోదాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇది పూర్తయితే దేశంలోనే ఆ లక్ష్యాన్ని సాధించిన మొదటి రాష్ట్రంగా కేరళ అవతరించనున్నదని అంచనా. కేఎస్‌డబ్ల్యూఎంపీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. "అన్ని గ్రామాలు, గ్రామ పంచాయతీలు ఈ విషయంలో ప్రమాణాలను చేరు కోవడంలో కేంద్రీకరించిన ప్రయత్నాలు కేరళకు హోదాను సాధించడంలో సహాయపడ్డాయి. ఇది ప్రభుత్వ విధాన కార్యక్రమాలు, వాటి కచ్చితమైన అమలును ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నది.

గ్రామ పంచాయతీలు బయోడిగ్రేడబుల్ వ్యర్థాల మూల స్థాయి నిర్వహణ, హరిత కర్మ సేన ద్వారా బయోడిగ్రేడబుల్ వ్యర్థాల సేకరణ, కమ్యూనిటీ, గృహ మరుగుదొడ్ల నిర్మాణం, బయోడిగ్రేడబుల్ వ్యర్థాల కోసం పబ్లిక్ డిస్పోజల్ ఫెసిలిటీస్ ఏర్పాటు, ద్రవ వ్యర్థాలను పారవేసే సౌకర్యాలు, వివిధ ప్రచార కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని వివరించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 1,509 గ్రామాలలో 491 గ్రామాలకు 'ఆస్పైరింగ్', 48 'రైజింగ్', 970 'మోడల్' కేటగిరీలో ఓడీఎఫ్ ప్లస్ హోదాను పొందాయని పేర్కొన్నది. శాతాలవారీగా చూస్తే దేశంలోనే కేరళలో అత్యధిక మోడల్ గ్రామాలు ఉన్నాయి. సంవత్సరాంతానికి 100 శాతం ఓడీఎఫ్ మోడల్ హోదాను సాధించడానికి.. రాష్ట్రంలోని అన్ని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా ఉంచడంతోపాటు పాఠశాలలు, అంగన్‌వాడీలు, గ్రామ పంచాయతీ ప్రధాన కార్యాలయాలు, పబ్లిక్ వాష్‌రూమ్‌లలో మంచి నిర్వహణతో కూడిన మరుగుదొడ్లను సృష్టించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ప్రకటన వివరించింది. అంతేకాకుండా, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిలిచిపోవడం, చెత్త కుప్పలు నివారించడం, కమ్యూనిటీ కంపోస్ట్ సౌకర్యాలు సృష్టించడం, బయోడిగ్రేడబుల్ వ్యర్థాల సేకరణ, నిర్వహణ వంటి సౌకర్యాలున్నాయని పేర్కొన్నది. కేరళతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన కర్నాటక, తెలంగాణలకూ ఓడీఎఫ్ ప్లస్ హోదా లభించిందని ఆ ప్రకటనలో పేర్కొన్నది.

రాహుల్ తీరు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

అబద్ధాలనే వల్లే వేశారని విమర్శించారు. తమ పార్టీ మాదిరిగా జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా మరే పార్టీ పోరాడటం లేదని చెప్పారు. ఆ రకంగా బీజేపీకి వ్యతిరేకంగా కలుస్తున్న పార్టీల్లో బీఆర్ఎస్ ముందుంటుందని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో విపక్షాల సమావేశానికి సంబంధించి బీఆర్ఎస్ వస్తే... తాము హాజరు కాలేమంటూ రాహుల్ చెప్పా రని వివరించారు. ఈ మాటను ఆయన గతంలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నిం చారు. బీజేపీ వ్యతిరేక కూటమికి నాయకత్వం వహించే లక్షణాలు రాహుల్‌కు లేవని ఎద్దేవా చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించి, దాన్ని అవ మానించిన తమిళనాడు గవర్నర్‌ను తక్షణం ఆ పదవి నుంచి తొలగించాలని కేకే ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. నామా మాట్లాడుతూ... బీజేపీకి దగ్గరగా వ్యవహరించేది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. పార్లమెంటు లో ప్రధానిని కౌగిలించుకున్నది ఎవరంటూ పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బీజేపీ వ్యతిరేకంగా కాంగ్రెస్ ఏనాడూ పోరాడలేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో ఒకరకంగా, తెలంగాణలో మరో రకంగా మాట్లాడటం రాహుల్‌కే చెల్లిందని విమర్శించారు. దేశంలో వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించేది కేవలం కేసీఆర్ మాత్రమేనని అన్నారు.

పప్పు అనటంలో తప్పు లేదు :రాహుల్‌పై మంత్రులు వేముల, పువ్వాడ విమర్శలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని గతంలో పప్పు అని ఎవరైనా సంబోధిస్తే కొంచెం బాధ అనిపించేదని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కానీ ఖమ్మం సభ తర్వాత ఆయన్ను పప్పు అనటంలో ఎలాంటి తప్పూ లేదనే భావనకు తామొచ్చామని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి పువ్వాడ అజయకుమార్, ప్రభుత్వ విప్ ఎమ్మెస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, సురేందర్, సండ్ర వెంకటవీరయ్య తదితరులతో కలిసి వేముల మాట్లాడారు. రాహుల్ గాంధీ.. ఒక రిమోట్ గాంధీలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన ఖమ్మం సభ వచ్చా మా.. మాట్లాడామా.. పోయామా... అన్నట్టుగా సాగిందని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను మాత్రమే చదివి వెళ్లిపోయిన ఆయనకు ఏమాత్రం విషయ పరిజ్ఞానం లేదని అన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా వేముల వ్యాఖ్యానించారు. ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారో అందరికీ తెలుసునని విమర్శించారు.



విద్యావైద్యం ఉచితంగా అందిస్తేనే అభివృద్ధి

బడులు, ఆస్పత్రుల్లో పారిశుధ్యంపై కేంద్రీకరించాలి
- పర్యవేక్షణ వ్యవస్థను ప్రభుత్వం మెరుగుపర్చాలి
- తెలంగాణ పౌర స్పందన వేదిక డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మానవాభివృద్ధి సూచికల్లో విద్యావైద్యం ముఖ్యమైనవని తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) తెలిపింది. ఎక్కడైతే ప్రజలందరికీ విద్యావైద్యం ఉచితంగా అందుబాటులో ఉంటాయో ఆ దేశంగానీ, రాష్ట్రంగా అభివృద్ధి సాధిస్తాయని పేర్కొంది. అవి ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే ప్రజలందరికీ అందుతాయని స్పష్టం చేసింది. కరోనా కరాళనృత్యంతో భీతిల్లిపోయిన సందర్భంలో పేద, మధ్య తరగతి ప్రజలకు దాని ప్రాధాన్యత బాగా అర్థమైందని తెలిపింది. టీపీఎస్వీ ఏర్పడి రెండేండ్లు అవుతున్న సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యావైద్యం ప్రభుత్వ బాధ్యత అనే నినాదంతో 2021, జులై నాలుగున ఈ సంఘం ఏర్పడిందని గుర్తు చేశారు. ఏడు జిల్లాల్లో కమిటీలు ఏర్పడ్డాయని వివరించారు. పాఠశాలల వారీగా సర్వే ద్వారా సమస్యలను సేకరించి అధికారులకు నివేదికలు సమర్పించామని తెలిపారు. పాఠశాలల్లో పారిశుధ్య పరిస్థితులు, సహాయ సిబ్బంది కొరత, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలపై అనేక వినతిపత్రాలను ఇచ్చామని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించి జిల్లా కలెక్టర్లకు, వైద్యాధికారులకు ఇచ్చామని గుర్తు చేశారు. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో విద్యకు పది శాతం, వైద్య రంగానికి ఆరు శాతం నిధులను కేటాయించాలంటూ సుమారు 14 వేల మంది ప్రజానీకం వద్ద సంతకాల సేకరణ చేసి ప్రధానికి మెమోరాండం ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 24 శాతం, వైద్యరంగానికి 12 శాతం నిధులు కేటాయించాలని కోరుతూ రెండు వేల మంది సంతకాలతో ఆర్థిక మంత్రికి వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను ఎవరు కాపాడుకోవాలి, పిల్లలు ఎందుకు రావడం లేదనే అంశంపై ప్రజలను చైతన్యపరచడం కోసం తొమ్మిది చోట్ల రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించామని గుర్తు చేశారు. ప్రజలు విస్తృతంగా ప్రభుత్వ విద్యాలయాలు, ఆస్పత్రులను వినియోగించుకుంటేనే వాటి మనుగడ కొనసాగుతుందని తెలిపారు.

ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తీర్చాలి

వైద్యరంగంలో ఈ మధ్య కాలంలో కొంత మెరుగుదల ఉన్నా ఇంకా జరగాల్సింది చాలా ఉందని నర్సిరెడ్డి, రాధేశ్యాం పేర్కొన్నారు. భారీ పథకాలతో అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించడం ఆహ్వానించదగిందేనని తెలిపారు. అయితే అవి అందుబాటులోకి రావడానికి చాలా సమయం పడుతుందని వివరించారు. భవనాలు, వసతులున్నా సిబ్బంది లేకపోతే ప్రయోజనముండబోదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యరంగంలో ప్రధాన సమస్య సిబ్బంది కొరతేనని తెలిపారు. కేవలం 40 నుంచి 50 శాతం సిబ్బందితోనే అన్ని స్థాయిల్లో ప్రభుత్వ ఆస్పత్రులు నడుస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతమున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల నుంచి ఆశాలు, అటెండర్ల వరకు తగినంత సిబ్బంది నియామకాలు జరిగితే ఉస్మానియా, గాంధీ, నిమ్స్ వంటి ఆస్పత్రులపై ఒత్తిడి చాలా తగ్గుతుందని సూచించారు. ఇంకోవైపు ప్రజలకు అతి చేరువలో నాణ్యమైన వైద్యం అందించొచ్చని కోరారు. అన్ని స్థాయిల్లోని ఆస్పత్రుల్లో పారిశుధ్యంపై కేంద్రీకరిస్తే మధ్య తరగి ప్రజలు కూడా ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తారని వివరించారు.

21 వేల ఉపాధ్యాయ ఖాళీలు

విద్యారంగంలో పర్యవేక్షణ లోపం, పారిశుధ్య లోపం ప్రధానంగా ఉన్నాయని నర్సిరెడ్డి, రాధేశ్యాం తెలిపారు. 33 డీఈవోలకుగాను 29 పోస్టులు, 62 డిప్యూటీఈవోలకుగాను 58 పోస్టులు, 467 ఎంఈవోలకుగాను 467 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. గతంలో అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులుండేవారని గుర్తు చేశారు. రెండేండ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఆ పోస్టులను రద్దు చేసిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 21 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యావాలంటీర్లను రెండేండ్లుగా నియమించడం లేదని వివరించారు. మన ఊరు-మనబడి, మనబస్తీ-మనబడితోపాటు సిబ్బంది కొరతపైన, పర్యవేక్షణ అధికారుల కొరతపైన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రీకరిస్తే విద్యావ్యవస్థను మెరుగుపర్చుకోవచ్చని సూచించారు.

విప్లవ వీరుని విగ్రహం వద్ద మూత్రం
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- విచారణ హామీతో రాస్తారోకో విరమణ

నవతెలంగాణ -గజ్వేల్

విప్లవ వీరుని విగ్రహం వద్ద ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేశారని ఆరోపిస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో మరో గ్రూపు రాస్తా రోకోకు దిగింది. సోమవారం రాత్రి గజ్వేల్ పట్టణంలోని పిడిచేడు రోడ్డులో ఉన్న విప్లవ వీరుని విగ్రహం వద్ద మూత్ర విసర్జన చేస్తున్న వ్యక్తిని చూసిన స్థానికులు ఆయన్ను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, సీఐ వీరప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. మూత్ర విసర్జన చేసిన అతనిపై విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కాగా, మూత విసర్జన చేసిన వ్యక్తి మద్దతుదారులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ వీర ప్రసాద్‌ను కలిసి సమస్యను వివరించారు. అరెస్టు చేసిన వ్యక్తిని వదిలిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. రెండు గ్రూపులు ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు పట్టణంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కనీస వేతనాలు కరువు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో వేలాది భారీ, మధ్యతరహా పరిశ్రమలు విస్తరించాయి. పారిశ్రామిక రంగంతో షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కోటి మందికిపైగా కార్మికులు న్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పటాన్‌చెరు, పాశ మైలారం, బొంతపల్లి, బొల్లారం, హత్నూర, సదాశివపేట, కొండాపూర్, కంది, సంగారెడ్డి, జహీరాబాద్, పుల్కల్, నర్సాపూర్, తూప్రాన్, మనోహరాబాద్, చినశంకరంపేట, ములుగు, మర్కుల్, గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాల్లో పరిశ్రమలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 30 వేల మందికి పైగా వలస కార్మికులు పనిచేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు దాన్ని ఆనుకొని ఉన్న పలు జిల్లాల్లో ఫార్మాసూటికల్, కెమికల్, ఐరన్, ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ, రైస్‌మిల్లులు, స్పిన్నింగ్ మిల్లులు, ఆస్పిటల్స్, కన్‌స్ట్రక్షన్, రోడ్డు భవనాలు, పౌల్ట్రీ, మ్యాన్యు ఫ్యాక్టరింగ్ యూనిట్స్, డిస్టెలరీస్, బ్రేవరీస్, మెటల్ పౌండరీస్, ఆటోమొబైల్, సాఫ్ట్‌డ్రింక్స్, ఎరెటెడ్, వాటర్ మ్యాన్యు ఫ్యాక్టరీస్ వేల సంఖ్యలో విస్తరించాయి. వీటిల్లో స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్, టెక్నికల్ కేటరిగి, అసిస్టెంట్ కేటగిరి, బాటిల్ పుల్లర్స్, ఆపరేటర్స్, అన్‌స్కిల్డ్ ప్యాకర్స్, బాయిలర్ హెల్పర్, సేల్స్‌మెన్, ప్లాంట్ ఆపరేటర్స్ ఇలానే అనేక రకాల పేర్లతో కార్మికులు పనిచేస్తున్నారు.

అమలు కాని కాంట్రాక్ట్ యాక్ట్, అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం

పారిశ్రామిక రంగంలో 90శాతం కాంట్రాక్టు కార్మికులే ఉంటున్నారు. హమాలీలు మొదలుకొని భారీ పరిశ్రమల్లోని స్కిల్డ్ వర్కర్స్ వరకు వలస కార్మికులు అధికంగా ఉంటున్నారు. వీరంతా బీహార్, ఒరిస్సా, యూపీ, బెంగాల్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రతో పాటు ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అంతర్రాష్ట్ర వలస కార్మికులే ఉన్నారు. పురుషులతో పాటు మహిళా కార్మికుల సంఖ్య కూడా పెరుగుతోంది. వీరందరి కోసం కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్, 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం ఉంది. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు, బోనస్, గ్రాట్యూటీ ఇతర సౌకర్యాల్లేవీ అమలు కావడంలేదు. చట్టబద్ధమైన హక్కులు కూడా సరిగ్గా అమలు చేయడంలేదు.

రోజుకు 12 గంటల పాటు పని చేయించుకుంటున్నారు. ఓవర్ టైం వేతనాలు చెల్లించడంలేదు. అనేక భారీ పరిశ్రమల్లో కాంట్రాక్టు, క్యాజువల్, ట్రైనీలు, లాంగ్‌టర్మ్ ట్రైనీలు, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్, నీమ్, న్యాప్స్ న్యాట్స్ లాంటి అప్రెంటీస్ స్కీమ్‌ల ద్వారా నియమించబడిన కార్మికులను ఉత్పత్తిలో శాశ్వత కార్మికులతో సమానంగా పనిచేయిస్తూ శ్రమను దోచుకుంటున్నారు. వలస కార్మికులను కంపెనీల ఆవరణలో చిన్నపాటి గుడారాలు, గదుల్లో 10 నుంచి 20 మందిని పెట్టి కనీస సౌకర్యాలు లేకుండా బానిసల మాదిరి గొడ్డు చాకిరి చేయిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, లేబర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్మికులు దోపిడీకి గురవుతున్నారు.

పెరగని కనీస వేతనాలు

కనీస వేతన చట్టం 1948 ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి ఐదేండ్లకోసారి వేతనాల్ని సవరించి పెంచాల్సి ఉంది. 2021 జూన్‌లో 5 రంగాలకు కనీస వేతనం రూ.18000లుగా నిర్ణయించి ఉన్నత అధికారులు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్లు కూడా గెజిట్ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు సార్లు కనీస వేతన సలహా మండలిని ఏర్పాటు చేసింది. కార్మికుల వేతనాలపై చర్చించిన ఆ మండలి అనేక సిఫార్సులు చేసింది. వాటిల్లో ఏ ఒక్క సిఫార్సునూ ప్రభుత్వం అమలు చేయలేదు. 8 గంటల పని విధానం కాకుండా 12 గంటల పాటు పనిచేయిస్తున్నారు. వార్షిక బోనస్ ఇవ్వడంలేదు. ఐదేండ్లు కంటిన్యూగా పనిచేస్తే సెమీ స్కిల్డ్ వేతనం ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడా అమలు చేయడంలేదు. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయంలేదు. 2023లో కరువు భత్యంతో కలిపి వివిధ పారిశ్రామిక రంగాల్లో ప్రస్తుత జీవోల ప్రకారం చెల్లించాల్సిన వేతనాలు కార్మికులకు అందని ద్రాక్షలా మారాయి.

కనీస వేతనం రూ.26 వేల కోసం పోరు

కనీస వేతనం రూ.26 వేలివ్వాలని సీఐటీయూ అనేక రూపాల్లో పోరాడుతోంది. ఇప్పటికే అనేక ఆందోళనలు, ఉద్యమాలు చేశాం. ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఒక్కసారి కూడా కనీస వేతనాల్ని సవరించలేదు. దీని వల్ల కోట్లాది మంది కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వేతనాలు సాధించుకునేందుకు ఈ నెల 4 నుంచి 13 వరకు పది రోజుల పాటు పారిశ్రామిక జిల్లాల్లో జీపుజాతా నిర్వహించనున్నాం. 17న 33 జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఆందోళనలు చేపట్టనున్నాం. కనీస వేతన సలహా మండలి చేసిన సిఫార్సుల్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

జె.మల్లికార్జున్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు

బండి ఔట్..! అధ్యక్షులుగా కిషన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

రోజురోజుకీ పడిపోతున్నది. మరోవైపు కాంగ్రెస్ పుంజుకుంటున్నది. మంచిగా ఉన్నప్పుడు అందరూ గమ్మున ఉండి ఆహో..ఓహో అని బండి సంజయ్‌ని పొగిడేశారు. రఘునందన్‌రావు, ఈటల గెలుపుతో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతున్నది అని తెగ ఆరాటం చేశారు. తేడా కొట్టగానే ఒక్కొక్కరూ లోపాలు ఎత్తిచూపటం మొదలుపెట్టారు. సీను సితార కావడంతో బీజేపీ లుకలుకలు కొంతకాలంగా బయటపడుతూనే ఉన్నాయి. నేతలంతా మూడు, నాలుగు గ్రూపులుగా విడిపోయి ఎవరికివారే యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తూ బీజేపీని తెలంగాణలో ఎక్కడ మొదలుపెట్టారో తిరిగి అదే స్థాయికి తీసుకొచ్చారు. ఇలాంటి తరుణంలో తెలంగాణ శాఖలో ప్రక్షాళనకు బీజేపీ అధిష్టానం పూనుకున్నది. ఈటల రాజేందర్, డీకే అరుణ, రాజగోపాల్‌రెడ్డి, తదితర పేర్లను పరిశీలించిన అధిష్టానం చివరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి వైపు మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. అయితే, మొదట రాష్ట్ర అధ్యక్ష పదవిని తీసుకునేందుకు ఆయన ససేమిరా అన్నట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో జాతీయ నాయకులు ఆయన్ను ఒప్పించారనే వార్త వినిపిస్తున్నది. కిషన్‌రెడ్డికి సౌమ్యుడిగా, బీజేపీలో అందర్నీ కలుపుకుని పోయే నేతగా ప్రచారముంది. అయితే, ఆయన సీఎం కేసీఆర్‌కు సన్నిహితంగా ఉంటారనే విమర్శా ఉంది. ఇదే విషయాన్ని బండి గ్రూపు ఎత్తిచూపుతున్నది. కిషన్‌రెడ్డి, ఈటల, రాజగోపాల్‌రెడ్డి, పలువురు సీనియర్లు ఒక్కటై బండిని పదవి నుంచి దింపేసే పనికి పూను కున్నారని బీజేపీ రాష్ట్ర శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. బండి సంజయ్‌కి కేంద్ర సహాయ మంత్రి పదవి ఇచ్చి రాష్ట్రంలో కీలకంగా పనిచేసేలా బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారముంది. ఇలాగైతే బండి అనుకూల, వ్యతిరేక గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు మరింత తీవ్రమయ్యే అవకాశమే ఎక్కువ. ఇష్టం లేని పదవుల్లో ముగ్గురు నేతలు ఎంత కాలం కొనసాగుతారో, ఎన్నికల ముందు రెక్కలు రాలకుండా కమలం పువ్వును ఎంత ముందుకు తీసుకెళ్తారో, అనూహ్యనిర్ణయాలు, వ్యూహాలు, ప్రయోగాలతో కమలం పువ్వు వికసిస్తుందో, వాడిపోతుందో వేచిచూడాల్సిందే.

పేదల గుడిసెలపై దాష్టీకం

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించలేక, నిలువ నీడ కోసం కొరివి రోడ్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో అరునెలల కిందట గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. కాగా, అందులో కొంత ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నట్టు గుడిసెవాసులు చెప్తున్నారు. కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ, ఎక్సైజ్, అటవీ, ట్రాన్స్‌పోర్టు శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే ఐదు సార్లు గుడిసెలు కూల్చివేశారు. అయినా వెనుదిరగని పేదలు.. అదే స్థలంలో కర్రలు, తాటాకులు, టార్పాలెన్లు, చీరలు, జాబు కవర్లతో గుడిసెలు వేసుకుని తలదాచుకుంటున్నారు. అది సహించని జిల్లా అధికార యంత్రాంగం.. సోమవారం ఉదయం 8 గంటలకు మరోసారి గుడిసెలపై దాడికి సిద్ధమయ్యారు. ఒక వైపు ఇండ్ల స్థలాల కోసం రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా జరుగుతున్న సందర్భంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. పోలీస్ బెటాలియన్ మొత్తం గుడిసెల కూల్చివేతకు రాగా.. గుడిసెలు కూల్చవద్దని మహిళలు వారి కాళ్లావేళ్లా బడ్డారు. అయినా కనికరించని అధికారులు.. రెండు జేసీబీలతో గుడిసెల కూల్చివేత ప్రారంభించారు. దాంతో ఆగ్రహించిన పేదలు.. జేసీబీలను అడ్డుకున్నారు. దాంతో అడ్డుకున్న మహిళలు, పురుషులపై పోలీసులు లాఠీఛార్జి చేసి భయభ్రాంతులకు గురిచేశారు. మహిళలను చితకబాదడంతో కొంతమంది స్పృహ కోల్పోయారు. వెంటనే పోలీసులు వారిని తీసుకెళ్లి డీసీఎంలో పడేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఇలా గంటసేపు పోలీసులకు గుడిసె వాసులకు మధ్య తోపులాటతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. 13 మంది మహిళలు, ఇద్దరు పురుషులను పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం వరకు స్టేషన్‌లోనే ఉంచారు. సాయంత్రం వరకు వదిలిపెడతామని చెప్పిన పోలీసులు.. సాయంత్రం హఠాత్తుగా వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నట్టు చెప్పారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో.. బండోజ్ కవిత, గోపి, సునీత, బానోతు సునీత, గుండోజు నాగలక్ష్మి, అజ్మీర జ్యోతి, కిన్నెర ధనమ్మ, సండ్ర పట్ల ఉమా, అజ్మీర కవిత, పుడిశెట్టి కవిత, దేవుని బోయిన పద్మ, భూక్య మమత, వేముల శైలజ గూగుల్ లోతు పార్వతి తోపాటు అనిల్, వేణు ఉన్నారు.

పేదలపై దౌర్జన్యమా?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గుడిసెవాసులపై పోలీసుల దౌర్జన్యాలను ఆపాలనీ, అందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని లేదంటే ప్రజా ఉద్యమం తప్పదని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం ఉదయం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గుడిసెవాసులపై పోలీసులు దౌర్జన్యం చేశారని తెలిపారు. ఈ ఘటనలో పది మంది పేదలు గాయపడ్డారని పేర్కొన్నారు. మరో పది మంది మహిళలను అరెస్టు చేశారని తెలిపారు. స్టేషన్‌లో వారిని బూతులు తిడుతూ కొట్టారని పేర్కొన్నారు. వారిపై నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ల ముందు ధర్నాకు సిద్ధమవుతున్న పేదలపై పోలీసుల దాడులు, దౌర్జన్యాలు చేశారని తెలిపారు. గుడిసెలు కూల్చేసి, పేదలపై విరుచుకుపడ్డారని పేర్కొన్నారు. పది రోజుల క్రితం వనస్థలిపురంలోనూ ఇలాంటి ఘటన కొనసాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఅప్రజాస్వామిక చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు.

ఆలయాన్ని సందర్శించిన డీసీపీ



నవతెలంగాణ-నాగోల్
గురు పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం నాగోల్ డివిజన్‌లోని జైపూర్ కాలనీలో గల సాయిబాబా మందిరాన్ని ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి మందిర్ ట్రస్టు సభ్యులు డీసీపీని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డిని కూడా దేవాలయం ట్రస్ట్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాలయం ట్రస్టు సభ్యులు దేవాలయ వ్యవస్థాపకులు గుణగంటి రాములు గౌడ్, వెంకటరెడ్డి, రంజిత్ రెడ్డి ,సోమయ్య ,మోహన్ రెడ్డి, బాబు, లక్ష్మణ్ గౌడ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్
ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో ఎలాంటి సమస్యలు లేకుండా తగిన పరిష్కారం చేస్తున్నట్టు వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి అన్నారు. ఘట్కేసర్ మున్సిపాల్టీ 9వ వార్డులో సుమారు రూ. 16 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఘట్కేసర్ మున్సిపాల్టీ వైస్ చైర్మన్ లిపలుగుల మాధవ్ రెడ్డి ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండీ నజీర్, సుబ్బారావు, బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

పెరుగుతున్న ధరలతో సామాన్యులు విలవిల

- కొండెక్కుతున్న కూరగాయల ధరలు
- రైతులను, వినియోగదారులను నిలువునా ముంచుతున్న దళారులు



నవతెలంగాణ- నాగోల్
రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో ఉన్న వారు కూరగాయలను కొనుగోలు చేయలేక నాణ్యమైన ఆహారానికి దూరమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒకవైపు నిత్యావసర వస్తువులు పప్పు, బియ్యం, నూనెలతో పాటు ఇతర వస్తువుల ధరల పెరిగిపోతున్న తరుణంలో పుండు పై కారం చల్లినట్టుగా కూరగాయల ధరలు కూడా ఆకాశానంటే రీతిలో పెరిగిపోయి తమ కొనుగోలు శక్తిని మరింత దిగజార్చుతున్నాయని ఆవేదనలు వ్యక్తమవుతున్నాయి.

ఏది తక్కువ ధర ఉందో దాన్ని కొని ఈ పూట జరుపుకుందామనుకుంటున్న సామాన్యులకు ఏ కూరగాయ ధర చూసిన 80 రూపాయల పైచిలుకే ఉన్నాయని వాపోతున్నారు. శనివారం నాటి మార్కెట్‌లో కూరగాయ ధరలు చూస్తే టమాటా 140 , పచ్చిమిరపకాయ160, వంకాయలు 60 రూపాయలు, బెండకాయలు 80 రూపాయలు, దొండకాయ 80 రూపాయలు, దోసకాయ 50 రూపాయలు, ఇలా కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో మధ్యతరగతి వారు, పేద వారు ఒకవైపు ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు తదితర అవసరాలకు తమ సంపాదన చాలక కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర, కూరగాయల ధరలతో ఆర్థికంగా మరింత కుంగిపోయి అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నట్టు పలువురు దినసరి కూలీలు, ఇతర కార్మికులు, ప్రయివేటు ఉద్యోగస్తులు ఆందోళన చెందుతున్నారు.

కనీసం ఆర్థికంగా ఎదిగి ఆస్తుల వెనకేసుకొలేకపోయినా పర్వాలేదు కానీ ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా భార్య పిల్లలను పోషించుకుంటే చాలు అనుకునే వారికి ఈ ధర పెరుగుదల మానసిక కృంగదీస్తున్నది.

రైతు పండించిన పంటకు సరైన ధర పెట్టని మధ్య దళారులు రైతుల నుంచి కారు చౌకగా కొనుగోలు చేసి మార్కెట్ వ్యవస్థ, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని కుంటి సాకులు చెబుతూ విపరీతమైన ధర నిర్ణయించి విక్రయిస్తూ అటు రైతులను, ఇటు వినియోగదారులను నిలువునా ముంచుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం రైతు మార్కెట్లను ఏర్పాటు చేసి వినియోగదారులకు కూరగాయలను అందుబాటులోకి తెచ్చిన పుటికీ మధ్య దళారి వ్యవస్థల వల్ల విపరీతమైన ధరల నిర్ణయంతో వినియోగదారులు గత్యంతరం లేక వాటిని ఆశ్రయించి మోస పోవాల్సి వస్తుందని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ధర ల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలక, ప్రతిపక్షాలకు ఓట్లు ,సీట్లు తప్పా ప్రజా సంక్షేమం పట్టడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ ప్రజా సమస్యల పట్టించుకోకుండా కేవలం అధికారం కోసం పాకులాడుతున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెరిగిపోతున్న నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరల కు కళ్లెం వేసి పేద, మధ్యతరగతి ప్రజలు కడుపునిండా నాణ్యతమైన ఆహారాన్ని తీసుకునేలా చర్యలు చేపట్టాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జీహెచ్ఎంసీలో జెడ్‌సీలు, డీసీల బదిలీ..?

నవతెలంగాణ-సిటీబ్యూరో
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బదిలీలు పలువురు జోనల్ కమిషనర్ లు, డిప్యూటీ కమిషనర్‌లు బదిలీ అయ్యారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా దీర్ఘకాలికంగా పనిచేస్తున్న పలువురు అధికారులను ఇతర జోన్లకు, సర్కిల్స్‌కు బదిలీ చేశారు. ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారి జాబితాను రూపొందించడంలో డిప్యూటీ కమిషనర్‌లదే కీలక పాత్ర. ప్రస్తుత కమిషనర్ బదిలీపై వెళ్ళనున్న నేపథ్యంలో తాజాగా జోనల్ కమిషనర్‌లు, డిప్యూటీ కమీషనర్‌లు బదిలీలు జాబితా ముందుగానే సిద్ధం చేశారనే ప్రచారం జరుగుతోంది. త్వరలో మరికొన్ని బదిలీలు కూడా జరగనున్నట్టు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం జరిగిన బదిలీలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా శ్రీనివాస్ రెడ్డి, అక్కడ పనిచేస్తున్న శంకరయ్యను ఎలక్షన్స్ అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను సికింద్రాబాద్‌కు పంపించగా ఆయనకు ఖైరతాబాద్ జోన్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంకా శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ టి.వెంకన్నను చార్మినార్ జోనల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. చార్మినార్ జోనల్ కమిషనర్‌గా ఉన్న అశోక్ సామ్రాట్‌ను సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్‌గా పంపించారు. శేరిలింగంపల్లి డిప్యూటీ కమీషనర్ సుదాంష్‌కు చందానగర్ బోసిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

అర్హులైన పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

- సీఐటీయూ సర్కిల్ కన్వీనర్ యాదయ్య



నవతెలంగాణ-వనస్థలిపురం
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ సర్వే నెంబర్ 71 లో అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు 400 మందితో ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇండ్ల స్థలాలు ఇమ్మన్నందుకు కేసులు బనాయించడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే పరిస్థితి అన్నారు. సర్వే నెంబర్ 71లో పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, లేనియెడల ఈ పోరాటం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గట్టిగుండ్ల సుజన్ వెరీ, దేశి వెంకటేష్, అంజయ్య గౌడ్, సిహెచ్ రాములు, ఎల్ లక్ష్మణ్, దండు అంజమ్మ ముత్యాలమ్మ, మంగమ్మ, సైదులు, లింగమ్మ ఆవు దొడ్ల సైదులు రాధా, ఐత రాజు అంజయ్య, జీ నరసింహ మోహన్, పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు బాల్యం నుంచే అలవడాలి

- ఐఆర్ఎస్ అధికారి ఎన్. బలరాం



నవతెలంగాణ-బడంగ్‌పేట్
నేటి సమాజంలో విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని ఐఆర్ఎస్ అధికారి ఎన్.బలరాం అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రతి ఏడాది జరిగే ఇన్వెస్టిచర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐఆర్ఎస్ ఆఫీసర్ ఎన్. బలరాం (ఫైనాన్షియల్ డైరెక్టర్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్), కల్నల్ అనిల్ కుమార్ హాజరయ్యారు. అలాగే ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మెన్ మల్కా కొమరయ్య, సీఓఓ మల్కా యశస్విలు పాల్గొన్నారు. అతిథులను పాఠశాల ప్రిన్సిపాల్ టి.పద్మ జ్యోతి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నిబద్ధత, విశ్వాసం, సమర్థతతో పాఠశాలను ముందుండి నడిపించేం దుకు అర్హులైన యువ ప్రతిభావంతులైన విద్యార్థులకు బాధ్యతలు అప్పగించే ఇన్వెస్టిచర్ వేడుకను పాఠశాల ఘనంగా నిర్వహించిందన్నారు. వివిధ కష్టతరమైన ఇంటర్వ్యూలు, ప్రచారం తర్వాత నామినేషన్లు, ఓటింగ్ ద్వారా విద్యార్థులచే ఎన్నుకోబడిన విద్యార్థి కౌన్సిల్ సభ్యులచే ప్రమాణం చేయించారు. ముఖ్య అతిథులచే బ్యాడ్జీలను విద్యార్థులకు అందజేశారు.అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ అనేది విద్యార్థులకు ఎంతో అవసరమని, దీనివలన క్రమశిక్షణతో పాటు పట్టుదల, పోటీతత్వం , దేశసేవ లాంటి సద్గుణాలు అలవాడతాయని, భవిష్యత్తులో ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కూడా లభిస్తాయని అన్నారు. బలరాం మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదవాలని, సజనాత్మకతను పెంచుకోవాలన్నారు. మల్కా కొమరయ్య మాట్లాడుతూ.. ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నేటి విద్యార్థినీ విద్యార్థులను దష్టిలో పెట్టుకొని అధునాతనమైనటువంటి వసతులను కల్పిస్తున్నామని, వాటిని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికలలో గెలుపొందిన విద్యార్థుల్లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్, సెక్రటరీస్ మొదలైనటువంటి బాధ్యతలను స్వీకరిస్తూ తమకిచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ టి. పద్మ జ్యోతి మాట్లాడుతూ.. జీవితం మన ముందు విసురుతున్న ఆటంకాలు, సవాళ్లను అధిగమించి ముందుకు సాగాలని విద్యార్థులను చైతన్యపరిచారు. పాఠశాల సీఓఓ మల్కా యశస్వి మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను మరింత ముందుకు తీసుకెళ్లి దేశంలోనే అగ్రగామి విద్యాసంస్థగా పాఠశాలను తీర్చిదిద్దాలని యువ నాయకులను అభినందించారు. వసుధైక కుటుంబం- ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే అంశంపై డ్రిల్‌ను విద్యార్థులు ప్రదర్శించడంతో వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు ఘనంగా సత్కారం

- 40 మంది జలమండలి ఉద్యోగుల పదవీ విరమణ

నవతెలంగాణ-సిటీబ్యూరో
జలమండలిలో వివిధ హోదాల్లో పనిచేసిన 40 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. బోర్డు పరిధిలోని పలు డివిజన్లలో పనిచేసిన వీరంతా గత నెల 30న పదవీ విరమణ పొందారు. ఇందులో 10 మంది టెక్నికల్ గ్రేడ్- 2గా, 17 మంది ఎస్‌పీఈ లుగా, మరో 13 మంది జీపీఈ లుగా పనిచేశారు. వీరందర్నీ ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు.

మరుసటి రోజే ప్రయోజనాలు

జలమండలిలో పదవీ విరమణ పొందే నాటికి వాటికి సంబంధించిన అన్నింటినీ సిద్ధం చేసి విరమణ చేసిన మరుసటి రోజే అన్ని ప్రయోజనాలను అందిస్తున్నారు. తాజాగా 40 మంది పదవీ విరమణ చేసిన సందర్భంగా వారందరికీ ఇచ్చిన చెక్కుల విలువ దాదాపు రూ.14 కోట్లు (ఒక్కక్కరికి సగటున రూ.20 లక్షల చెక్కులను) అందించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్, తెలంగాణ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్తర్, జనరల్ సెక్రటరీ జయరాజ్‌లతో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి



- అనుమతులు లేని సీబీఎస్‌సీ ఇంటర్నేషనల్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

నవతెలంగాణ-బోడుప్పల్
ఫీజుల పేరుతో తల్లిదండ్రుల రక్తం తాగుతున్న కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. సోమవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి ముఖ్య నాయకుల సమావేశానికి హాజరై లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకు కార్పొరేట్ విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని అన్నారు. ఏలాంటి అనుమతులు లేకుండా సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ పేరుతో పాఠశాలలు ప్రారంభించి పాఠ్య పుస్తకాలు,స్కూల్ యూనిఫారాలు,బెల్టులు, షూస్ అంటూ ఇష్టానుసారంగా తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూళ్ళు చేస్తుంటే పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన విద్యా శాఖ అధికారులు నిమ్మకు నిరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ప్రభుత్వంలో పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్న కొందరు లాభార్జనే ధ్యేయంగా కార్పొరేట్ విద్యా సంస్థలు నడుపుతూ రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే ప్రొఫెసర్ చలపతిరావు రూపొందించిన ఫీజుల నియంత్రణ కమిటీ రిపోర్ట్ ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు అందని ద్రాక్షగా మారిన కార్పొరేట్ విద్యాను అందరికీ అందుబాటులోకి వచ్చేలా సర్కార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ అన్వర్,నాయకులు హరీష్, వినయ్, దుర్గ ప్రసాద్, గణేష్, నర్సింహా, అనిల్, సైదులు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందిస్తేనే ప్రజాదరణ



నవతెలంగాణ-బడంగ్‌పేట్
నేటి సమాజంలో హోటల్స్, రెస్టారెంట్ యజమానులు వినియోగ దారులకు రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తేనే ప్రజాదరణ పొంది వ్యాపారంలో రాణిస్తారని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు పెద్దబావి శోభా ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,స్వప్న జంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, సూర్జగంటి అర్జున్, నాయకులు రాళ్లగూడం శ్రీనివాస్ రెడ్డి,లిక్కి కష్ణారెడ్డి,బంగారు ప్రభాకర్,గౌర శ్రీనివాస్‌లు అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న క్రీడా మైదానానికి ఎదురుగా మోటి మమ్మీ కిచెన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది చదువుకున్న నిరుద్యోగ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి కోసం కుటీర పరిశ్రమలతో పాటు హోటల్స్, రెస్టారెంట్లను నిర్వహిస్తూ ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించటం జరుగుతుందన్నారు. ప్రతి నెలా హోటల్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కంటెస్టడ్ కార్పొరేటర్, బీఆర్ఎస్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి ఏ.బి.శ్రీనివాస్, ప్రొప్రైటర్స్ పూనమ్ కుమారి, సునీల్ చౌరాసి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికుల రాష్ట్ర కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నాగోల్
రాష్ట్రంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని అమతవాణి సెంటర్లో రాష్ట్రంలోని పలు మాజీ సైనికుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు 33 జిల్లాలోని సైనికులు ఐక్యంగా కలిసి మాజీ సైనికుల హక్కులు, సమస్యల సాధన కోసం రాష్ట్ర స్థాయి కమిటీని ఎన్నుకున్నట్టు రాష్ట్ర కమిటీ కోశాధికారి వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ కే. మహేందర్ రెడ్డిలు తెలిపారు. కమిటీ లో గౌరవ అధ్యక్షులుగా పి .భూపతిరెడ్డి ,అధ్యక్షుడిగా లెఫ్టినెంట్ కలర్ మాచర్ల బిక్షపతి, ఉపాధ్యక్షులుగా జి. సుదర్శన్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా డి. కరుణాకర్ రెడ్డి కోశాధికారిగా టి .వెంకటేశ్వర్లు, సలహాదారులుగా కెప్టెన్ సురేష్ రెడ్డి, ఎల్ .జగన్ రెడ్డి, పి. మనోహర్ రెడ్డి, ఎం నాగేశ్వరరావు ,ప్రభాకర్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సంతోష్ రెడ్డి,పెంటారెడ్డి సంయుక్త కార్యదర్శులుగా మురళీకష్ణ, వేణుగోపాల్ రెడ్డి, పీ ఆర్వోలుగా సురేందర్ రెడ్డి, రవీందర్రెడ్డి కోఆర్డినేటర్ గా కే రాజు, కే మహేందర్రెడ్డి లతోపాటు రాష్ట్రంలోని 21 జిల్లాలలోని మాజీ సైనిక సంఘం అధ్యక్షులు, ప్రతినిధులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్టు వారు తెలిపారు. అదేవిధంగా మిగిలిపోయిన 12 జిల్లాలలోని కూడా సభ్యులను గుర్తించి కమిటీలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఖమ్మంలో కాంగ్రెస్ సభ విజయవంతం

- మల్ రెడ్డి రాంరెడ్డి, యోగేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్
కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన సభకు భారీగా జనం హాజరైనారని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్ రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి యోగేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం దిల్ సుఖ్ నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యోగేశ్వర్ రెడ్డి మాట్లా డుతూ ఖమ్మంలో జరిగిన భారీ బహిరంగ సభను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ వాళ్ల ఓడిపోతామన్న భయంతో ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు . ఆనాడు తెలంగాణ ఇస్తే బీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తామని చెప్పిన ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ స్కాములు చేసిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధు, పెన్షన్లు ఇవ్వదని అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా దుష్ప్రచారాలు ఆపి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన బుద్ధి చెబుతారనీ హెచ్చరించారు.

మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో జరిగిన భారీ బహిరంగ సభను చూసి కేసీఆర్ కుటుంబానికి రాత్రి నిద్ర పట్టి ఉండదని, ఖమ్మంలోని పది నియోజకవర్గాల నుంచి ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎదురొడ్డి జనాలు స్వచ్ఛందంగా తరలివచ్చారని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ 60 సంవత్సరాలు అధికారంలో ఉన్నా కూడా ఇప్పుడు తమ దగ్గర పార్టీ ఆఫీస్ నడిపించుకోవడానికి కూడా రూపాయి లేదు కానీ, ఆరోజు రబ్బరు చెప్పులతో తిరిగిన బీఆర్ఎస్ నాయకులకు రూ.లక్షల కోట్లు ఎలా సంపాదించారో ప్రజలకు తెలిపాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి బీ-టీం అని, ఇంతకాలం ఓవైసీ అసదుద్దీన్ బీ-టీం గా పనిచేశారు.. వాళ్ళను ప్రజలు నమ్మేటట్లు లేరు కాబట్టి , ఈ రోజు యూపీఏలోని భాగస్వామ్య పార్టీలను చీల్చడానికి బీజేపీ కేసీఆర్‌ను ఒక శిఖండిలా వాడుతున్నారని రాంరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు అంతా గమనిస్తున్నారని, దానికి నిదర్శనమే రూపాయి ఖర్చు పెట్టకుండానే దాదాపు నాలుగు లక్షల మంది నిన్న జరిగిన సభకి వచ్చారని, బీఆర్ఎస్ పార్టీ నాయకులను నియోజకవర్గాలలో తిరగకుండా ప్రజలు తరిమికొట్టే రోజులు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు బండ సురేందర్ రెడ్డి, లింగాల కిషోర్ గౌడ్, కుట్ల నర్సింహా యాదవ్ మరియు పన్యాల జైపాల్ రెడ్డి, మహేష్ , సాయి, సూర్య నరేందర్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

'రాజకీయంగా బురద జల్లేందుకే ఆరోపణలు'



నవతెలంగాణ-బోడుప్పల్
తన ఎదుగదలను చూసి ఓర్వలేక తనపై బురద జల్లేందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ నేత దానగళ్ల యాదగిరి అన్నారు. సోమవారం మేడిపల్లి పీఎస్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దానగళ్ల యాదగిరి మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ దేవేందర్ నగర్ కాలనీ పేజ్-2 అధ్యక్షుడిపై అకారణంగా దాడి చేసినట్టు తనపై ఆరోపణలు వచ్చాయని ఇది కేవలం తన రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్న కుట్ర మాత్రమేనని అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ దేవేందర్ నగర్ కాలనీ ఫేస్1లో ఓ వ్యక్తి తన ఇంటి వద్ద అనుమతి లేకుండా రోడ్డు తవ్వకం చేస్తున్నాడని కాలనీవాసుల ఫిర్యాదు చేయగా పరిశీలించడానికి వచ్చిన తనను కాలనీ అధ్యక్షుడు బైరుగొండ మల్లేష్ దూషించడంతో పక్కనే ఉన్న కాలనీవాసులు అడ్డుపడగా తాగిన మైకంలో నానా హంగామా చేయడంతో తోపులాట జరిగిందన్నారు. దానిని ఆసరా చేసుకుని తనను అప్రతిష్టపాలు చేసేందుకు, కొందరు ప్రత్యర్థులు ఏకమై కొందరిని తనపైకి ఉసిగొల్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా మారి డివిజన్ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి, చీరాల నర్సింహ్మా, బందారపు శ్రీధర్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు గోపు రాములు,కొండా శ్రీనివాస్,దుర్గయ్య,ముత్యాలు,శంకర్,భగవత్,మైసగళ్ళ శివ,దానగళ్ళ వెంకటేష్, బాలకృష్ణ, మైసయ్య,పద్మ,మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



నవతెలంగాణ-వనస్థలిపురం
గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ సోమవారం బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ సాయి స్థలి సాయిబాబా మందిరం, గాయత్రీ నగర్ బ్యాంకు కాలనీ సాయిబాబా మందిరాలలో షిరిడీ సాయినాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో ఆలయ కమిటీ ప్రతినిధులు గుండమల్లయ్య, కోడి రాజశేఖర్, లక్ష్మీ దుర్గ, శ్యామ్ కుమార్, కిరణ్ కుమార్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ నాయుడు, తిరుమల రెడ్డి, ప్రభాకర్ రావు, మోహన్ , చిన్న గౌడ్, రావుల రంజిత్ గౌడ్, సోమయ్య , హరిప్రసాద్ తదితరులున్నారు.

సంతోష్‌నగర్ : గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని చంపాపేట డివిజన్ వినయ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి.. బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినయ్‌నగర్ కాలనీలో ఉన్న సాయిబాబా దేవాలయంలో ప్రతీ సంవత్సరం గురుపౌర్ణమి ఉత్సవాలు, శ్రీరామనవమి ఉత్సవాలు, ఉగాది తదితర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. అంతకుముందు సామ రమణారెడ్డిని దేవాలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందు కుమార్ శ్రీనివాస్ శర్మ తదితరులున్నారు.



ప్రయాణం.. ప్రమాదకరం



నవతెలంగాణ-సంతోష్ నగర్
రోడ్డు మధ్యలో అడ్డుగా ఎలక్ట్రికల్ పైపుల కోసం గుంత తవ్వి వదిలారు. గుంతను మరమ్మతు చేయకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతోంది. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ దుర్గా భవాని నగర్ భాష్యం హై స్కూల్ వెళ్లే దారిలో డాక్టర్ సి శ్రీనివాస్ రెడ్డి ఫ్యామిలీ క్లినిక్ వద్ద 3 నెలలు రోడ్డును తొవ్వి మరమ్మతు మరిచారు. భాష్యం హైస్కూల్ వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, వాహనదారులు ఆస్పత్రికి వచ్చే రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు మాట్లాడుతూ.. ఓట్ల సమయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఇంటింటికి తిరిగి సీసీ రోడ్డు, డ్రయినేజీ, మంచినీటి మురుగు స్థానిక సమస్య తలెత్తకుండా చూస్తామని వాగ్దానాలు చేస్తుంటారని.. అనంతరం కేవలం వాళ్ల ఆస్తిని కాపాడుకోసమే పార్టీలు మారుస్తారన్నారు. రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇటీవల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఏమరుపాటుగా వచ్చే ద్విచక్ర వాహనదారులు గుంతలు పడి గాయాల పాలవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా పూర్తిగా మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇచ్చిన హామీ మేరకు ఇండ్లు కేటాయించాలి.



నవతెలంగాణ- నాగోల్
ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు కాలయాపన చేయకుండా వెంటనే ఇండ్లను కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి డిమాండ్ చేశారు.సోమవారం న్యూ నాగోలులోని సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం ఎస్ఏ డాంగే భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి కష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాగోల్ డివిజన్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాల వారు స్థిర నివాసం కోసం 2016 సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన రెండు పడకల గదుల ఇండ్ల కోసం ఎన్నో వ్యయ, ప్రయాసాలకు ఓర్చి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు ఇండ్లను కేటాయించకుండా కాలయాపన చేస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. దీంతో అటువంటి నిరుపేదల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంభించకుండా ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. జీవనోపాధి కోసం హైదరాబాద్ నగరం తో పాటు పరిసర ప్రాంతాలలో జీవిస్తున్న కుటుంబాలకు అద్దెలు చెల్లించలేక కుటుంబాలను పోషించడం భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న అధిక ధరలతో చాలీచాలని ఆదాయంతో సంసారం నెట్టుకోస్తున్న పేద కుటుంబాలకు వెంటనే ఇండ్ల కేటాయింపు జరపాలని లేని పక్షంలో దరఖాస్తు దారుల పక్షాన సీపీఐ నిలబడి నిర్మించిన ఇండ్లను ఆక్రమింప చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో నాగోల్ జైపూర్ కాలనీ దివ్యాంగుల కాలనీల శాఖల కార్యదర్శిలు, సహాయ కార్యదర్శిలు, మండల కౌన్సిల్ సభ్యులు, డివిజన్ ఇన్‌చార్జిలతో పాటు ఆయా ప్రజా సంఘాల నాయకులు, స్థానిక నాయకులు భూపతి సురేష్ ,చింతల లలిత, ఎస్ రాములు, మధు తదితరులు పాల్గొన్నారు

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



నవతెలంగాణ సంతోష్‌నగర్
సంతోష్ నగర్ డివిజన్ రక్షకపురం పరిధిలోని శివాలయంలో భక్తిశ్రద్ధలతో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక హారతులు, అభిషేకాలు, అర్చనలు చేశారు. పూజా కార్యక్రమంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక ంలో స్థానికులు,నాయకులు భక్తులు అశ్విని, నరేందర్ రెడ్డి, రిధాన్ రెడ్డి, పద్మ, శ్యామల, ఆలయ ఇన్‌చార్జి పార్థసారథి, అర్చకులు మాధవ శర్మ, మధుసూదన్ శర్మ, బాలకష్ణ శుక్ల, ఈవో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు

గురు పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే పూజలు

నవతెలంగాణ-కాప్రా



గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం ఆనంద్‌భాగ్ ఆర్‌యుబీ దగ్గర సాయి బాబా దేవాల యంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నాదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, సునీత రామూయాదవ్, జితేంద్ర నాథ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నాయకులు బద్దమ్ పరశురాం రెడ్డి, అధికార ప్రతినిధి, మల్కాజ్ గిరి సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా విష్ణు పూరి ఎక్స్టెన్షన్ శ్రీ ద్వారకామాయి సాయి బాబా దేవాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. డివిజన్ పరిధిలోని షిరిడి నగర్‌లో బాక్స్ డ్రెన్ పనులను ఎమ్మెల్యే డివిజన్ కార్పొరేటర్ కలిసి పరిశీలించడం జరిగింది.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై ఎస్ఓటి పోలీసులు దాడులు చేశారు. నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామం, ఆర్ఎల్‌నగర్‌లోని మధుర నగర్ కాలనీలో ఓ నివాసంను పేకాటకు అడ్డాగా మార్చుకున్న పేకాట రాయుల గుట్టు రట్టయింది. దాదాపు 8 మంది పట్టుబడ్డ పేకాట రాయులు వారి వద్ద నుంచి 8 మొబైల్ ఫోన్స్ ,16000 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ పేకాట రాయలు మొత్తం ఎనిమిది మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు. బద్దం మహేందర్, చెరుకుపల్లి అశోక్ రెడ్డి, మూర్తి శ్రీనివాస్, ఏర్గదిండ్ల మహేష్, పురమని శివ రెడ్డి, కోడూరి కరుణాకర్, పల్లపు మహేష్, పెద్దుల శ్రీనివాస్ పట్టు బడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పేకాట రాయుళ్లను రిమాండ్‌కు తర లిస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా అన్ని పథకాలు విజయవంతంగా చేపడుతున్నాం

జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా అన్ని పథకాలు విజయవంతంగా చేపడుతు న్నామని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కు మారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి పోడు భూములు పంపిణీ, హరిత హరమ్, రెండవ విడత గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి కార్యక్రమం, ఇంటి స్థలాల పంపిణీ, జీపీ భవనాల నిర్మాణం, బీసీ కుల వృత్తులకు ఆర్థిక సహాయం, వైకుంఠధామాలకు విద్యుత్ స దుపాయం పలు అంశాలు పై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావే శం నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాస్థాయి అధి కారుల సూచనల మేరకు హైదరాబాద్ జిల్లా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యక్రమాలు, పథకాలు విజయవంతంగా



నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ వీడియో కాన్ఫ రెన్స్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వివరించారు. రాష్ట్రంలోనే అన్ని అభివృద్ధి రంగాల్లో తమ జిల్లా ముందుస్థానంలో ఉందని అందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో తమ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన తెలంగాణకు హరితహారం, ముఖ్యమంత్రి సహాయనిధి, ఇళ్ల స్థలాల పంపిణీ, బీ సీ కుల వృత్తులకు ఆర్థిక సహాయం, గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీ, గృహలక్ష్మీ పథకం, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలు, వైకుం ఠధామాలకు విద్యుత్తు, తాగునీటి సదుపా యాలు కల్పించడం జరుగుతోందని ఈ విషయంలో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వ హించి, అన్ని శాఖల అధికారులను అప్ర మత్తంగా ఉండేలా అవస రమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అమోయ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్లో సీఎస్ శాంతి కుమారికి తెలిపారు. అలాగే తమ సూచనలు, సలహాలతో జిల్లాను మరింత అగ్రగామిగా నిలిపి ఆదర్శంతంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ అమోయ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్లో స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం, కాప్రా డివిజన్‌లోని ప్రశాంతి, మాధవపురి, గ్రీనోపార్క్ ఎన్‌వోలతో పాటు వివిధ కాలనీల లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధి కార యంత్రాంగం యుద్ధప్రాతికన పూర్తి చేయాలని, పను లను పూర్తి చేయకుండా అవినీతికి పాల్పడుతూ కాలయా పన చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రా క్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ బృందం కాప్రా సర్కి ల్ డిప్యూటీ కమిషనర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కాప్రా డివిజన్‌లోని ప్రశాంత్ నగర్, మాధవపురి, గ్రీన్ పార్క్ ఎంక్లేవ్, అరుల్ కాలనీలతో పాటు పలు కాలనీలలో రోడ్డు పనులు పూర్తికాక, ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి మట్టిపని, వెట్ మిక్సింగ్ ప్రక్రియ పూర్తికాగా, రెండు లేయర్లతో వేయాల్సిన రెడీ మీక్ కాంక్రీట్ పనులు పూర్తిగా జరగలేదని వారు స్పష్టంచేశారు. ఈ అసంపూర్తి పనులను పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా, అధికారుల అలసత్యం కారణంగా కాలయాపన జరుగుతూ ఇక్కడి ప్రజలకు తరచూ ప్రమా దాలు జరుగుతున్నాయని అన్నారు. కాంట్రాక్టర్ రోడ్డు పను ల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, అధి కారులతో కుమ్మక్కయ్యారని వారు ఆరోపించారు. ఈ నేప థ్యంలో లోనే సదరు కాంట్రాక్టర్, అధికారుల మధ్య ఘర్ష ణతో పనులు ఆగాయని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి డివిజన్ వ్యాప్తంగా ఉన్న రోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికార యంత్రాంగం ద్వారా యుద్ధప్రాదికన పనులను పూర్తి చేయాలన్నారు. ప్రజల ప్రాణాలను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంట్రాక్ట ర్‌ను బ్లాక్ లిస్టులో పొందుపరచాలని సీపీఐ డిమాండ్ చేస్తు న్నదని వారు స్పష్టంచేశారు. లేకుంటే అన్ని కాలనీల ప్రజల ను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వ హిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవై ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, సీపీఐ కార్య వర్గ సభ్యులు బాబు రావు, గిరి, బాబుమురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టో రెట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకి సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ , ప్రజాసంఘాల పో రాట వేదిక రాష్ట్ర నాయకులు డీజీ నరసింహారావులు హాజ రై మాట్లాడుతూ ప్రజలకు 100 గజాలు జాగా ఇవ్వలేని ప్ర భుత్వం బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ము కాస్తూ, భూములను ధారా దత్తం చే స్తుందని అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పేదల పక్షమా పెట్టుబడిదారుల పక్షమా తేల్చుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న కార్మికులు కర్షకులు,పేదలు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఏకమై ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో అనేక జిల్లాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తే ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి గుడిసెలు తీసేయించి లాఠీ చార్జీలు చేసి అక్రమ కేసులు బలాయిం చడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. బీజేపీ ప్రభు త్వం 2022 నాటికి అందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని మో డీ వాగ్దానం చేసిన అది నేటికీ అమలు చేయలేదని విమర్శి ంచారు. కేంద్రప్రభుత్వం వెంటనే ఇంటి స్థలం ఉన్న పేదల కు 10,000 రూపాయలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్ర భుత్వం మరొక ఐదు వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మన దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిన నేటికీ ఉండడానికి 100 గజాలు కూడా లేకుండా బాధపడే పరిస్థితి ఎందుకు ఉన్నదో ప్రభుత్వం ఆలోచించు కోవాలని అన్నారు. ఈ ధర్నా అనంతరం డీఆర్ఓ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, చంద్రశేఖర్ ఐద్వా నాయ కులు వినోద, మంగ, నాయకులు వెంకట్ రమేష్ కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలపీర్, కృపా సాగర్, జిల్లా నా యకులు శ్రీనివాస్ సీఐటీయు నాయకులు గణేష్ వెంకన్న సబిత రాజశేఖర్ ఉన్ని కృష్ణ , లింగస్వామి, శ్రీనివాస్ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

హర్షవర్ధన్ కాలనీలో పర్యటించిన నేతలు

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ బోర్డ్ 6 వార్డులోని హర్షవర్ధన్ కాలనీలో సోమవారం నాడు బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ కం టోన్మెంట్ నియోజకవర్గ ఇన్చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు, అధి కారులు పర్యటించారు. హర్షవర్ధన్ కాల నీ, రాంరెడ్డి కాలనీ, మారుతి ఎవెన్యూలలో పర్యటించి సమస్యలు తెలుసుకు న్నారు. మాజీ సభ్యుడు పాండు యాదవ్, ఈ బాలకృష్ణ, ఏఈ. అరవింద్‌లతో కలిసి నాలాలను వీక్షించి వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ముంపు సమస్య పునరా వృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రస్తుత నాలాతో పాటు, సెంటర్ పాయింట్ వరకు మరొక నాలాను ప్రజల విజ్ఞప్తి మేరకు నిర్మించా లని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, రాజు సింగ్, ప్రవీణ్ యాదవ్, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్పొరేటర్ పూజలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



గురు పౌర్ణమి సందర్భగా సోమవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరి ధిలోని యాప్రాల్ సాయిబాబా దేవాల యం, జీకే కాలనీలోని సాయిబాబా ఆలయాలలో కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రా రంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఆ సాయిబాబా దయ తో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, చెన్నారెడ్డి, మోహన్, మహే ష్, రాజేష్,రఘుపతి రెడ్డి, గోపి, శోభ, రాధ, పరిమళ, ఆర్తీ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-మల్కాజిగిరి



వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును సోమవారం వికలా ంగులు ఆయనకు వినతిపత్రాన్ని అందించారు. ఈ రోజు ఈస్ట్ ఆనంద్ బగ్ డివిజన్ పరిధిలోని సాయి బాబా ఆలయానికి గురు పౌర్ణమి సందర్భగా శ్రీ మైనంపల్లి హను మంత్‌రావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించా రు. వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్ .వినయ్ మాట్లాడుతు వినతి పత్రంలో వికలాంగులకు 5శా తం జీఓ ప్రకారం డబుల్ బెడ్రూం ఇండ్ను, ఎలాంటి షురిటీ లేకుండా రూ.5లక్ష నుండి రూ.6లక్షల వరకు రుణాలు మ ంజూరు చేయాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న వికలాం గులకు మోటార్స్ వేహీల్ వాహనాలు ఇవ్వాలని కోరుతూ ,వి విధ అంశాలను ఎంఎల్ఏ గారి దృష్టికి తీసుకువెళ్లి చెప్పడం జరిగింది. అందుకు ఎంఎల్ఏ గారు స్పందించి సకాలంలో మా సమస్యలు పరిష్కారం అయేళ చూస్తానని హామీ ఇచ్చా రు. ఈ కార్యక్రమంలో అర్.కృష్ణ నాయక్ హజరత్ రెడ్డి, అర్.మల్లేశ్ నాగమణి, రమేష్ కుమార్, శాంతి కుమారి, రజరమణ్ రేవతి నాగయ్య వరలక్ష్మి గోపన్న పాల్గొన్నారు.

మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జార్జి విల్సన్ ఎన్నిక



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో పని చేసే జర్నలిస్టులు అందరూ కలిసి యూనియన్లకు అతీతంగా టియుడబ్ల్యుజె (ఐజెయు), 143 సభ్యులు ఏకగ్రీవంగా మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా జార్జి విల్సన్‌ను ఎన్నుకున్నారు. జనరల్ సెక్రెటరీగా బాలాజీ, కోశాధికారిగా గిరి గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా మురళి కృష్ణ యాదవ్, మహేష్ గౌడ్, ఉపాధ్య క్షులుగా అనబత్తుల రమేష్, సంయుక్త కార్యదర్శిగా నాయు డు, ప్రచార కార్యదర్శిగా శివ కుమార్, కమిటీ సభ్యులుగాని యమితులయ్యారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పని చేసే జర్నలిస్టుల అం దరి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య భ ద్రత, ఇండ్ల పట్టాలు, జర్నలిస్టుల పిల్లల విద్య తదితర విష యాలపై తోడ్పాటును అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గతంలో ప్రెస్ క్లబ్ నాయకులు 15 సంవత్సరాల నుంచి జర్నలిస్టులుకు ఎలాంటి సహాయం అందించలేదని ఆరోపించారు. ఇప్పుడు కొత్తగా ఎన్నికైన నాయకులు అంద రూ జర్నలిస్టులు కలిసి కట్టుగా పనిచేసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఒకరికొకరు విమర్శలు చేసుకోకూడ దని పేర్కొన్నారు. నేరేడ్‌మెట్‌లో నూతన ప్రెస్ క్లబ్ బిల్డింగ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు, సర్కిల్ పరిధిలో పనిచేసే ప్రతి జర్నలిస్టులు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసేం దుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్కా జిగిరి ఎమ్మెల్యే జర్నలిస్టుల సంక్షేమానికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయన సహకారం జర్నలిస్టులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిది గా పాల్గొన్న టియుడబ్ల్యుజే 143 రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి చోటా ఇలాగే యూని యన్‌లకు అతీతంగా జర్నలిస్టులు ఏకతాటిపైకి వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. నేరేడ్‌మెట్ లో నూతనంగా నిర్మిస్తున్న ప్రెస్ క్లబ్ భవనానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే, జర్నలిస్టులకు చేస్తున్న సహకారాన్ని అభినందించారు.

మంత్రి శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బేగంపేట్

బాపూనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి



పనులను దాతల సహకారంతో త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా బాపూ నగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గల సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమీర్ పేట లోని కుమ్మరి బస్తీలో గల హనుమాన్ దేవాలయంలోని సాయిబాబాను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమాలలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఈఓ. విఠలయ్య, నరేందర్ రెడ్డి, సభ్యులు సత్యనారాయణ యాదవ్, లక్ష్మణ్, నరే ష్, శేఖర్ గౌడ్, రాజేశ్వరి, ప్రవీణ్ రెడ్డి, నర్సింహ, హరిసింగ్ పాల్గొన్నారు.

లింగ్యానాయక్ అదనపు కలెక్టర్‌గా బదిలీ

పదోన్నతిపై వెళ్తున్న లింగ్యానాయక్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్

కలెక్టరేట్ ప్రతి ఉద్యోగికి బదిలీలు సాధారణమని ప్రజలకు చేసిన సేవలే వారికి మంచి గుర్తింపునిస్తాయని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు.మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ వికా రాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్ళడం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలె క్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య,జిల్లా స్థాయి అధికా రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి సందర్భంగా రంగ్రేస్ బజార్ బస్తీలో సిక్వాల్ సమాజ్ వాళ్లతో కలిసి పౌర్ణమి పూజలు పాల్గొన్న అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ గారు,మురళివిహస్, ఆనంద్ పాటిల్, రాజేష్ విహస్, చంద్ర ప్రకాష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బేగంపేట్





గురు పౌర్ణమి సందర్భంగా సనత్ నగర్ డివిజన్ నెహ్రూ నగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయాన్ని హనుమాన్ దేవస్థానంలో ఉన్న సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్ రెడ్డి కార్పొరేటర్ భక్తులందరికీ గురు పౌర్ణమి శు భాకాంక్షలు తెలియజేస్తూ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవస్థానం ఈవో శ్రీనివాస రాజ్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్ రెడ్డి శశిధర్ రెడ్డి శేషగిరిరావు శ్రీనివాస్ అర్చకులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బేగంపేట్

బస్తీ సమస్యలపై విస్తృతంగా పర్యటించిన రాగిడి

నవతెలంగాణ-కాప్రా



ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ రాగిడి లక్ష్మారెడ్డి ఇందిరా గృహకల్ప కాలనీలో స్థానిక ప్రజల ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని, డ్రైనేజీ సమస్య అస్తవ్యస్తంగా మారి మంచి నీటి పైప్ లైన్‌లో కలవడం వల్ల నీరు కలుషితం అవుతుంది కలుషితం అవుతుందన్నారు. తద్వారా ప్రజలకు మలేరియా డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నా యని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చర్లపల్లిలో ప్రధాన సమస్య మూడు ఎకరాలలో స్మశాన వాటిక ఉన్నా గానీ, కనీస వసతులు లేక శవాలను దహనం చేయాలన్న ఎలాంటి సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇట్టి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని లేనియెడల, జోనల్ కమిష నర్ దృష్టికి తీసుకెళ్తామని రాగిడి లక్ష్మారెడ్డి గారు హెచ్చరిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కాంగ్రె స్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులు గడ్డం యాదగిరి, ఇంద్ర గృహకల్ప కాలనీ అధ్యక్షులు ముత్యాలు, చిన్న, ప్రసాద్ ,దయాకర్, దర్శనం లక్ష్మయ్య, గడ్డం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో సామూహిక వ్రతాలు

నవతెలంగాణ-నేరేడ్ మెట్



గురు పూర్ణిమ పురస్కరించుకొని సోమవారం రామ్ నగర్‌లోని సాయిబా బా ఆలయంలో సామూహిక వ్రతాలు ని ర్వహించారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, వెంకటాపురం డివిజన్ కా ర్పొరేటర్ సబిత, అనిల్ కిషోర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల నూతనంగా అల్వాల్ సీఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఉపేందర్ రావ్ సాయి బాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ. హరికృష్ణ రెడ్డి, కవిత, సాయిరాం గౌడ్, అనిల్ కిషోర్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మేయర్



నవతెలంగాణ-కాప్రా

గురుపౌర్ణమి సందర్భంగా అమీర్ పేట్ హెచ్.బి.కాలనీ, శ్రీసాయిబాబామం దిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అ నంతరం అన్నదాన కార్యక్రమం, సాయి బాబా దీవెనలు ప్రజల ందరికీ ఎల్లప్పుడు కలిగి ఉండాలని దేవుణ్ణి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, రామంతపూర్ మాజీ కార్పొరే టర్ గంధం జోత్స్న, నాయకులు మేకల హనుమంతు రెడ్డి, గంధం నాగేశ్వర్ రావు, నందికొండ రెడ్డి, స్వామి తదితరులు పాల్గోన్నారు

ఉప్పల్ ఎమ్మెల్యే నివాసంలో ఏఎస్ రావు నగర్ డివిజన్ భవాని నగర్ కాలనీకి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొత్త అంజి రెడ్డి ఆధ్వర్యంలోఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి కాలనీలో సీని యర్ సిటిజెన్ రూమ్ సాంక్షన్ చేయాలని వినతిపత్రం అందజేశారు. అందుకు గాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్



అసోసియేషన్ భవాని నగర్ కాలనీ అధ్య క్షులు ఎజికే రాజు, ఉపాధ్యక్షులు సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, జాయింట్ సెక్రెటరీ ఈవి రమణ ,కోశాధికారి వెంక టేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అరవింద్ కుమార్, భూపాల్ రెడ్డి, రామకృష్ణ, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

అడ్వకేట్ కమిషనర్ హాల్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా కోర్టులో అడ్వకేట్ కమిషనర్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి హరెకెష్ణ భూపతి హాజరై రిబ్బన్ కట్ చేసి కమిషనర్ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డికొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ్ రెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ ఎ. అనంత సేన రెడ్డి, అడ్వకేట్ మ్యుచ్వల్లి ఎయిడెడ్ కొ-అపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళలు కుట్టు శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ లోని 18 వ వార్డు లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో కార్మిక కుటుం బాల మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మ ంత్రి మాట్లాడుతూ సెల్ఫ్ ఎంప్లాయిస్ టైలరింగ్ శిక్షణను ఉపయోగించుకోని స్వయం ఉపాధిని సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ శిక్షణకు తీసుకోవడానికి లేబర్ కార్డుతో పాటు ఆధార్ కార్డును కలిగిన మహిళలు ఉపయోగించుకో గలరని అన్నారు.మేడ్చల్ నియోజకవర్గంలో సుమారు 200 0 మంది మహిళలకు కుట్టు మిషన్ అందజేస్తున్నట్లు తెలిపా రు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి , వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్ మున్సిపల్ కమీషనర్ వాణి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాగారం మున్సి పల్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యల కారణంగా వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-అడిక్‌మెట్



ఆరోగ్య ఆర్థిక సమస్యలతో సతమతం అవతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం దోమలగూడ ఎంసీహెచ్ క్వార్టర్స్ సమీపంలో శివ ప్రసాద్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. శివప్రసాద్ ఫైనాన్స్ కలెక్షన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం సమస్యల కారణంగా (షుగర్/డయాబెటిస్‌తో బాధపడుతున్నాడు), అతను తన ఉద్యోగాన్ని వదిలి కల్లు, మద్యానికి బానిసయ్యాడు. దీంతో శరీరంపై నియంత్రణ కోల్పోయి వికృతంగా ప్రవర్తిస్తుండటంతో కుటుంబ సభ్యులు హిమాయత్‌నగర్‌లోని సిటీ నర్సింగ్ హెూమ్‌లో చికిత్స చేయించినా ఎలాంటి మార్పు రాలేదు. రోజు దినచర్యలో భాగంగా భార్య బయటికి వెళ్ళగా పిల్లలు స్కూల్‌కి వెళ్లారు. ఇది గమనించిన శివప్రసాద్ ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చనిపోయే ముందు శివప్రసాద్ అతని స్నేహితుడు నరేష్‌కు తాను చనిపోతానని వాట్స్ యాప్ మెసేజ్ పంపినట్టు ఆ తర్వాత తెలిసింది. నరేష్ హుటాహుటిన మృతుడి ఇంటికి వెళ్లగా అప్పటికే అతడి స్నేహితుడు మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి ఆత్మహత్యకు ఆర్థిక ఆరోగ్య సమస్యలే కారణమని కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైలాస్ మార్పు చేయవలసిన అవసరం ఉంది

నవతెలంగాణ-బేగంపేట్



విశ్వకర్మ సంఘ పురాతన బైలాస్‌లో కాలానుగుణంగా మార్పులు చేయవలసిన అవసరం ఉందని విశ్వకర్మ సంఘం కార్యవర్గ సభ్యులు తీర్మానం చేశారు. సోమవారం సికింద్రాబాద్ సోమ సుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావే శానికి ముఖ్యఅతిథిగా సంఘ సలహాదారు హైకోర్టు న్యాయ వాది పొలాస గిరి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారిలు గత సంవత్సర కాలంగా సంఘంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలు సేవా కా ర్యక్రమాల గురించి వివరించారు. అనంతరం సంఘ ఆర్థిక లావాదేవీల గురించి కోశాధికారి బోనాల శ్రీనివాస్ సభ్యు లకు వివరించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు కటకం చక్ర పాణి, సాంఘిక సంక్షేమ శాఖ చైర్మెన్ బౌరంపేట వీరాచారి, మాజీ అధ్యక్షులు దుబ్బాక కిషన్ రావు, మాజీ కోశాధికారి దుండిగల్ వెంకటేశం, మాజీ కార్యవర్గ సభ్యులు మోట్కూరి బాలాచారి మురుకుక్కు రమణ చారి ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భరత నగర్‌లో 'చాయ్ పే చర్చ'

నవతెలంగాణ-నేరేడ్ మెట్



మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నల సునీత యాదవ్ భరత నగర్‌లో సోమవారం 'చాయ్ పే చర్చ' కార్యక్రమం నిర్వహించారు. శక్తి కేంద్రం కిరణ్, బూత్ అధ్యక్షులు సత్యనారాయణ, గిరి, మహేష్ ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తొమ్మిది సంవత్స రాల మోది పాలనలో భారతదేశం సాధించిన విజయాలు గురించి, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావలసిన ఆవశ్యకత గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మౌలాలి విస్తారక్ జిజు విజయన్, మల్కాజిగిరి సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సాయిబాబా, రాజేష్ యాదవ్, మల్లారెడ్డి, కేబుల్ కాలనీవాసులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి ప్రత్యేక పూజలో పాల్గొన్న భరత సింహారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని బౌద్ధ నగర్, బ్యాంక్ కాలనీ , పద్మా నగర్ ఫేస్ వన్‌లో గురు పౌరమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు సాయిబాబా ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారో. మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి, సభ్యులు, కర్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



విద్యార్థులకు నోటుబుక్కులు, ప్లేట్‌లు, గ్లాసుల పంపిణీ

నవతెలంగాణ-శామీర్‌పేట



మూడు చింతలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం. సునీత ఆధ్వర్యంలో లరస్ ల్యాబ్స్ వారు విద్యార్థులకు నోట్ బుక్స్, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం. సునీత మాట్లాడుతూ స్కూల్‌ని దత్తత చేసుకొని పాఠశాలను ఆదర్శంగా తీర్చి దిద్దారని, తరగతి గదులకు పెయింటింగ్, ఫర్నిచర్, కంప్యూటర్, ప్రింటర్ ఇచ్చారని, అలాగే పిల్లలకు ప్రతి సంవత్సరం నోటుబుక్కులు, బ్యాగులు అందజేస్తున్నరన్నారు. ఈ సంవత్సరం కూడా ఇచ్చారని తెలిపారు. లరస్ ల్యాబ్స్ వారికి స్కూల్ తరపున హెచ్ ఎం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలోలారస్ లాబ్స్ వైస్ చైర్మెన్ రమణారావు గారు.సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శివ లక్ష్మీ, చాముండేశ్వరి, ఉపాధ్యాయులు ప్రసన్న కుమారి కళావతి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం కృషి

- కౌన్సిలర్ నడికొప్పు ఉమానాగరాజు

నవతెలంగాణ- మేడ్చల్



మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు అభివృద్దే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని కౌన్సిలర్ నడికొప్పు ఉమానాగరాజు అన్నారు. సోమవారం వార్డు పరిధిలోని ఎన్జీవోఎస్ కాలనీలో రూ.10లక్షల నిధుల వ్యయంతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహ రెడ్డితో కలసి కౌన్సిలర్ ఉమా నాగరాజు ప్రారంభించారు. కౌన్సిలర్ ఉమా నాగరాజు మాట్లాడుతూ చైర్ పర్సన్ మర్రి దీపిక రెడ్డి నర్సింహ రెడ్డి సహకారంతో వార్డును ప్రణాళికతో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు గీత,వార్డు అధ్యక్షుడు కుద్రుముద్దీన్,బాలరాజ్,బాటిరెడ్డి, సంతోష్, ఉమేష్, నాగభూషణ్,సత్తయ్య, లక్ష్మీ,నాగమణి, బిక్షపతి, అక్బర్ పాల్గొన్నారు.

పేదలకు 100 గజాల జాగ ఇవ్వలేని సర్కారెందుకు..?

- ప్రజల భూములు కార్పొరేట్ల ధారాదత్తం
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్,
- ప్రజాసంఘాల పోరాట వేదిక

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రజలకు 100 గజాలు జాగా ఇవ్వలేని ప్రభుత్వం బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ము కాస్తూ.. భూములను ధారాదత్తం చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు డీజీ నరసింహారావు విమర్శించారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పాలడుగు భాస్కర్, డీజీ నరసింహారావు హాజరై మాట్లాడుతూ ప్రస్తుతమున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేదల పక్షమా పెట్టుబడిదారుల పక్షమా తేల్చుకోవాలని హెచ్చరించారు. ఈ రాష్ట్రంలో ఉన్న కార్మికులు, కర్షకులు, పేదలు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఏకమై ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో అనేక జిల్లాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేశారని... ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి ఆ గుడిసెలు తీసేయించి లాఠీ చార్జీలు చేసి అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. మోడీ సర్కారు 2022 నాటికి అందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసినా.. నేటికీ అది అమలు చేయలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలం ఉన్న పేదలకు రూ. పదిలక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరొక ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అంతేగాక ఈ రాష్ట్రంలో ఉన్న కొద్దిమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వం అండదండతో కోట్లాది రూపాయలు విలువచేసే భూములను కబ్జా చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మన దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు దాటినా నేటికీ ఉండడానికి 100 గజాలూ లేకుండా బాధపడే పరిస్థితి ఎందుకు ఉన్నదో ప్రభుత్వం ఆలోచించుకోవాలన్నారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేండ్లు పూర్తిచేసుకుని.. దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలోనూ కనీస వేతనాల జీవోలు సవరించకపోవడం వలన కార్మికులు లక్షల కోట్ల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవోలను సవరించి కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హత్యలు, లైంగికదాడులకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. నిరుద్యోగ యువతకు వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించాలనీ, పెరుగుతున్న ధరలను అదుపు చేయాలన్నారు. ధర్నా అనంతరం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు డీఆర్వో నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, చంద్రశేఖర్, ఐద్వా నాయకులు వినోదా, మంగ, ఎన్‌పీఆర్డీ నాయకులు వెంకటేష్, రమేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలపీర్, కృపా సాగర్ , డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు గణేష్, వెంకన్న, సబిత, రాజశేఖర్, ఉన్ని కృష్ణ, లింగస్వామి శ్రీనివాస్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్దర్ నగర్‌లో నూతన మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభం



నవతెలంగాణ- కేపీహెచ్‌బీ

మిషన్ భగీరథ పథకం ద్వారా తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు తాగునీటి ఇబ్బందులను తొలగించారని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసోద్దిన్ అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సబ్దర్ నగర్ ఈ బ్లాక్ లో సోమవారం నూతన మంచినీటి పైపులైన్ పనులను ఆమెతో పాటు మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ మహమ్మద్ గౌసుద్దీన్, వాటర్ వర్క్స్ మేనేజర్ విలియం ప్రకాష్‌లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సబ్దర్ నగర్‌లో పేద, మధ్యతరగతి ప్రజలు నివసిస్తున్నారని వారికి మంచినీటి కొరత చాలా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో వారి సహాయ సహకారాలతో మంచినీటి పైప్ లైన్ పనులను ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, జ్ఞానేశ్వర్, అబ్దుల్ హమీద్, సలీం, నార్లపురం నాగరాజు, మహబూబ్, సంజీవ, అస్లాం, యోగి రాజు, చిరంజీవి, రాఘవేందర్, హేమంత్, సంతోష్, నారాయణ, విజయ, కౌసల్య, ప్రశాంతి, హైమ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో యువకులు చేరిక

- గులాబీ కండువా కప్పి పార్టీలోకి

ఆహ్వానించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల 132 డివిజన్ న్యూ వివేకానంద నగర్ కు చెందిన యువకులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువకులకు ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సారుధ్యంలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. పార్టీలో చేరిన యువకులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు, పార్టీలో చేరిన కేమ శ్రీనివాస్ బృందం పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజ లు సోమవారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ మాట్లా డుతూ సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ కుటుంబ సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి



- మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ- మేడ్చల్

చిన్నప్పటి నుండే విద్యార్థులు కష్టపడి చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలుస్తారని రాష్ట్ర కార్మిక మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పూడూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30లక్షల నిధుల వ్యయంతో చేపట్టిన పాఠశాల పునరుద్ధరీకరణ పనులను మంత్రి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం కెసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టినంక 7వేల కోట్లతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించినట్టుగా తెలిపారు. పాఠశాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. సర్పంచ్ బాబు యాదవ్ మాట్లాడుతూ సెగల్ ఫౌండేషన్ వారికి అందించాల్సిన రూ.4లక్షల ఆర్థిక సహాయం చేసిన మజ్జిగ తిరుపతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రజలను తన చమత్కారమైన మాటల ద్వారా నవ్వించే నవ్వుల రారాజు మంత్రి మల్లారెడ్డి కొనియాడారు. అనంతరం సర్పంచ్ తన సొంత నిధులతో ప్రాథమిక, ఉన్నంత పాఠశాల విద్యార్థులకు షష్ పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి,జెడ్పీటీసీ శైలజవిజయా నందా రెడ్డి, వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, ఎంపీటీసీ నీరుడి రఘు,ఉప సర్పంచ్ మానేపల్లి వెంకటేష్,ప్రధానోపాధ్యాయులు మధుసూధన్ రెడ్డి,జగదీష్,విద్యా కమిటీ చైర్ పర్సన్ తపాల మాధవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు డప్పు కృష్ణ,నాయకులు కోలా వెంకటేష్,గాదం రాములు,ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ- మేడ్చల్



మానవత్వానికి, నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం మేడ్చల్ మండల పరిధిలోని డబిల్‌పూర్ గ్రామనికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వీర్లపల్లి భాగ్యరెడ్డిని గ్రామ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు జింకల నరేష్ అన్నారు. సోమవారం మేడ్చల్ మండలంలోని డబిల్ పూర్ గ్రామంలో వీర్లపల్లి భాగ్యరెడ్డి పుట్టినరోజు వేడుకలను యువకులు, అభిమానులు, నాయకుల మధ్య ఘనంగా జరిగాయి. అతకుముందు మేడ్చల్ పట్టణంలోని సాయిబాబా ఆలయంలో కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డితో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణములో మంత్రి మల్లారెడ్డి శాలువా కప్పి కేక్ కట్ చేసి భాగ్య రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డబిల్ పూర్ గ్రామ ప్రధాన కూడలి వద్ద నుండి అతిపెద్ద గజమాలతో జింకల నరేష్ ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు భాగ్యరెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని డిపో నుండి తన ఇంటి వరకు కారులో భారీ ర్యాలి నిర్వహించారు.అనంతరం ఇంటివద్ద ఏర్పాటు చేసిన పుట్టినరోజు కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు, గ్రామస్తులు విచ్చేసి కేక్ కట్ చేసి శాలువాలు, పూల దండలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డబిల్ పూర్ మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి,జిల్లా కో ఆప్షన్ గౌస్, నాయకులు తలారి అశోక్,ఉప్పరి శ్రీనివాస్,సార శ్రీనివాస్,పెరిక మల్లేష్,వార్డు సభ్యులు కొమ్ము శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, స్వప్న శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు జింకల నరేష్, పానుగంటి ప్రవీణ్ కుమార్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతతకు నిలయాలు దేవాలయాలు



లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

యాంత్రిక జీవనానికి అనువాటు పడ్డ ప్రజలకు దేవాలయాలలోనే ప్రశాంతత దొరుకుతుందని సంఘ సేవకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్య గాంధీనగర్ అధ్యక్షులు, శ్రీ లలితా పరమేశ్వరి దేవాలయం అధ్యక్షులు లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం "గురు పౌర్ణమి "పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీలోని శ్రీ లలితా పరమేశ్వరి, బాలశాస్త, కపర్దీశ్వర స్వామి (స్పటిక లింగం) సీతారామాంజనేయ స్వామి, సాయిబాబా దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ బాబు ఉపాధ్యక్షులు ఐ. వినోద్ కుమార్ ,కోశాధికారి సలాది సత్యనారాయణ మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రమణ, కిట్టు, రాకేష్, చంద్రకళ,కిరణ్, శర్మ మల్లేష్, గోపాల్‌రెడ్డి, సూర్యనారయణ, ఆలయ భక్తులు సభ్యులు, తరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CHAIRMAN: MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (HON'BLE III ADDITIONAL DISTRICT JUDGE CUM FAMILY JUDGE) AT NALGONDA
M.V.O.P.NO.134 OF 2021

Between:
Palem Naveen Kumar ....Petitioner
AND
B.Mohan and 2 Others ....Respondents

NOTICE TO RESPONDENT NO.2

To,
V.Tirumalaiah S/o.Mallaiah,Age:Not Known,Occ:Owner of Tavera bearing No.AP 10 AN 3700,R/o.H.No.17-1-383, A/6,Vinay Nagar Colony, Saidabad, Hyderabad.
...Respondent No.2

Take notice that the petitioner filed above M.V.O.P against Respondent No.2 and the case is posted to 26.07.2023 for your appearance. You should appear before the Hon'ble Court personally or through your Advocate.If you fail to appear on the above said date by 10.30 A.M, Respondent No.2 will be set exparte and decided the case in your absence.

// BY ORDER OF THE COURT //
P.SHYAM SUNDER
Advocate,H.No.6-7-54,
Shivaji Nagar,Nalgonda.
Cell:9848045097.

పూడూరు గ్రామ పర్యటన వల్ల గ్రామానికి ఒరిగిందేం లేదు

- యాటవెల్లి హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ -మేడ్చల్



మంత్రి మల్లారెడ్డి పూడూరు గ్రామ పర్యటన వల్ల గ్రామానికి ఒరిగింది ఏంలేదని మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు యాటవెల్లి హన్మంత్ రెడ్డి విమర్శించారు. సోమవారం మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సమస్యలు మంత్రికి చెప్పడానికి కనీస సమయము కూడ ఇవ్వలేదని ఆరోపించారు. సమస్యలను మంత్రికి చెప్పే క్రమంలోనే అర్ధాంత రంగా సమావేశం నుండి వెళ్లిపోవడం ఏంటని ప్రశ్నించారు. గ్రామ సమస్యలు చెప్పడానికి కనీస సమయం ఇవ్వరాని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పరిధిలో ఇంతవరకు ఒక్కరికి కూడా దళిత బంధు,పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులు,పే దలం దరికీ సరైన న్యాయం చేస్తామని తెలియజేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో మేడ్చల్ నియోజకవ ర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

గురుపౌర్ణమి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపి వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తా, ఐడీపీఎల్ కాలనీలోని సాయిబాబ ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి మనిషికి ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. అనంతరం భక్తులకు గురుపౌర్ణిమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రగతి నగర్ సాయిబాబా ఆలయంలో మేయర్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-దుండిగల్

గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా మేయర్ శ్రీమతి శ్రీ కోలన్ నీలా గోపాల్ రెడ్డి , కమీషనర్ రామకృష్ణ రావు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ చైర్మెన్ చల్లా సుధీర్ రెడ్డితో కలిసి ప్రగతి నగర్ సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసారు.అనంతరం అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ ఇంద్రజిత్ రెడ్డి, ఎన్ఎంసీ ఆయా విభాగాల అధికారులు సిబ్బంది,బిఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ రాములు నాయక్, మహిళా నాయకులు సబిత జలంధర్ రెడ్డి, ఎన్ఎంసీ బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రెటరీలు సాంబశివ రెడ్డి, దండుగుల స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



వరల్డ్ మెకానిక్ డే సందర్భంగా సుచిత్ర - కొంపల్లికి చెందిన మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానందని చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పాండు, కిరణ్, రామ్మోహన్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XIV ADDITIONAL DIDTRICT JUDGE RANGA REDDY DISTRICT AT::L.B.NAGAR
I.A.NO.56 OF 2018 IN O.S.NO.333 OF 2010

Between:
Samreddy Rghunath reddy ...Petitioner/Plaintiff
AND
samreddy Jaganmohan Reddy&others ...Respondents/Defendants

To,
1.A.Nagesh S/o.Letter A.Komaraiah, Aged about 60ysears.Occ:Business, R/o.H.NO.19-3-789.Aliabad,Kurmaguda, Hydarabad.
2.ManojKumar Chokada S/o.Shiva prasad Chokada, Aged about 59years, Occ:Business, R/o.H.NO.6-3-841/50, Ameerpet, Hosing, Borad Colony,
...Respondents NO. 4&5
...DefendantsNO.4&5

Please take notice thePetitiinor/Plaintiff has filed the above I.A.NO. 56of 2018 under Order IXRules 9 R/w.Sec.151of CPU and posted matter on 13-07-2023at 10:30 A.M to appear personally,through agent or Advocate for filling of youer counter and disposl on merits.

(BY ORDER OF RHE COURT)
K.AMARNATH REDDY
Advocate,
L.B.NAGAR,
R.R.DIstrict

మేడ్చల్‌లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ- మేడ్చల్



మేడ్చల్ పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన భక్తి పాటలతో కూడిన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకటుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మెన్ దాత్రిక సింహం మాట్లాడుతూ 8వేల మందికి పైగా భక్తులు బాబాను దర్శించుకున్నారని అన్నారు. భక్తులందరికి సరిపడే విధంగా అన్నదానం చేసినట్లు తెలిపారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్ జోన్ డీసీపీ సందీప్ రావు, ఏసీపి వెంకట్ రెడ్డి,సీఐ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నియోజక వర్గ కో ఆర్డినేటర్ హరివర్ధన్ రెడ్డి,విద్యాలయాల పునర్ నిర్మాణ దాత సుభాష్ రెడ్డిలు విచ్చేసి బాబాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ దాత్రిక సింహం,మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డి, వైస్ చైర్మెన్ రమేష్, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానందా రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

గురు పూర్ణిమ వేడుకల్లో శంభీపూర్ క్రిష్ణ



నవతెలంగాణ-దుండిగల్

గురు పూర్ణిమ సందర్భంగా పటాన్ చెరువు నియోజకవర్గం జిన్నారం మండలం కిస్టాయిపల్లి గ్రామంలో గురుపూర్ణిమ సందర్భంగా సాయి బాబా ఆలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంకర్ నాయక్, ఎల్లుగారి సత్యనారాయణ, సీనియర్ నాయకులు జక్కుల శ్రీనివాస్ యాదవ్, సుధాకర్ రెడ్డి, వావిలాల పాక్స్ వైస్ చైర్మెన్ విద్యానంద్ రావు, భౌరంపేట పాక్స్ వైస్ చైర్మెన్ నల్తూరి క్రిష్ణ, వార్డు మెంబర్ ఇంద్రసేన, మాజీ యం.పి.టి.సి. బండారి మహేష్, పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అద్యక్షులు కొడకంచి నగేష్, 27వ వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్, నాయకులు బల్వాంత్ రెడ్డి, హరీష్, వెంకటేష్, సద్దాం, రాము, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 170 OF 2020

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,Represented by its Divisional Manager, MANKAMMATHOTA Branch, D. Hanumanth Rao S/o Bhoomaiah, age:57years,R/O. KARIMNAGAR, of above Chit fund ....Disputant

VERSUS

DEVIREDDY SRINIVAS REDDY & Others
3. ALETI PRASHANTHI, D/o. Kanaka Durga Prasad, Age: 35Yrs, Occ: S.M.M (Home Science) , R/o.H.No. 16-4-1469, Shivanagar, Ramalayam Street, Warangal ..... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 27-07-2023 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

IN THE COURT OF THE II ADDL JUNIOR CIVIL JUDGE CUM XIII METROPOLITAN MAGISTRATE : RANGA REDDY DISTRICT:AT:RAJENDRANAGAR
I.A.No. 68 of 2022 in O.S.No. 87 OF 2022

BETWEEN: K.Nagender and another Petitioners/Plaintiffs.
AND
K.Nagesh, and others Respondents / Defendants.

TO, 4) Renuka, D/o. Late Vishwanatham, R/o. H.No. 3-75, Narsingi Village, Rajendranagar Mandal, Ranga Reddy District.
5) Poornima, D/o. Late Vishwanatham,R/o. H.No.3-75, Narsingi Village, Rajendranagar Mandal, Ranga Reddy District.
6) K.Srinivasa Reddy, S/o. Venkat Reddy,R/o. H.No. 13-6-433/15, Netaji Nagar Colony, Mehdipatnam Ring Road, Kulsumpura Hyderabad.
7) N.V.Suresh, S/o. N.V.Bhaskar, R/o.H.No.12-2-415/5, SBI Colony, GudimalkapurHyderabad.
8) B.Raju, S/o. Mysaiah,R/o.H.No.2-2-73/10, Amberpet, Hyderabad.
9) B.Govind Raj, S/o.Late Babu rao, R/o.H.No.1-10-180, Plot No. 16 and 17, Venkata Sai residency Alwal, Secunderabad.
10) Antony Louis, S/o. Joseph Louis, R/o. H.No.1-8-506/4/7/A, Prakash Nagar, Begumpet, Secunderabad.
11) Smt.Usha Rani, W/o. Late Pratap Sing, H.No. 23-6-852/12, Shalibhanda, Hyderabad
12) T.Mahesh Singh, S/o.Late Pratap Singh, H.No. 23-6-852/12, Shalibhanda, Hyderabad
13) T.Sachin Kumar, S/o. Late Pratap Singh, H.No. 23-6-852/12, Shalibhanda, Hyderabad.
14) T.Kishor Kumar, S/o. Late Pratap Singh.R/o. H.No. 23-6-852/12, Shalibhanda, Hyderabad.
15) Smt. B.Shakuntala, W/o. Late B.Venkata ratnam,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District
16) B.Anjan Kumar, S/o. Late B.Venkata Ratnam,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District
17) B.Anil Kumar, S/o. Late B.Venkata Ratanm ,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District.
18) Smt. T.Jaya Lakshmi, D/o. Late B.Venkata Ratnam,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District.
19) Smt. G.Vara Laxmi, D/o. Late B.Venkata ratnam,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District
20) C.N.Prasad, S/o. Appa Rao,R/o.H.No.6-3-456/2, Dwarakapuri Colony, Punjagutta Hyderabad.
21) Smt. G.B.Satyanarayanamma, W/o. Late Babu Rao, R/o. H.No.1-8-145/1, Near Alwal Railway Station,Alwal, Secundrabad.

(4 TO 21)..... Defendants

You are hereby informed that our client has filed the above case against the defendants No. 1 to 21 SUIT FOR SPECIFIC PERFORMANCE in respect All that part and parcel of land bearing Survey No.497, admeasuring Ac.1.00 gts out of the total extent of Ac.22.00 gts situated at Manchirevula Village, Rajendranagar Mandal, Ranga Reddy District. The defendants No. 4 to 21 are trying to take notices/Summon from this Hon'ble Court. Hence the Hon'ble Court was pleased to order for issuance of publication against the defendants No. 4 to 21 and further ordered the matter to posted on 28-07-2023 at 10:30am for your appearance and counter. Hence, you are hereby informed to appear before the above court in the above case, either in person or through your advocate. In case of your failure to appear before the court the case will be heard in your absence and the court may pass orders accordingly.

(BY ORDER OF THE HONOURABLE COURT)
M/s.Nyayapathi.Prashanth,
G.Prakash,& C.Vinayak Rao, S. Janamejai Advocates,
O/o 1-1-298/2/2, flat No. 201, Annapurna
Avenue Street No.1 Ashoknagar
Himayathnagar, Hyderabad, T.S.

IN THE COURT OF THE II ADDL JUNIOR CIVIL JUDGE CUM XIII METROPOLITAN MAGISTRATE : RANGA REDDY DISTRICT:AT:RAJENDRANAGAR
O.S.No. 87 OF 2022

BETWEEN:
K.Nagender and another ....Plaintiffs
AND
K.Nagesh, and others ...Defendants.

TO,
4) **Renuka,** D/o. Late Vishwanatham, R/o. H.No. 3-75, Narsingi Village, Rajendranagar Mandal, Ranga Reddy District.
5) **Poornima,** D/o. Late Vishwanatham,R/o. H.No.3-75, Narsingi Village, Rajendranagar Mandal, Ranga Reddy District.
6)**K.Srinivasa Reddy,** S/o. Venkat Reddy,R/o. H.No. 13-6-433/15, Netaji Nagar Colony, Mehdipatnam Ring Road, Kulsumpura Hyderabad.
7)**N.V.Suresh,** S/o. N.V.Bhaskar, R/o.H.No.12-2-415/5, SBI Colony, GudimalkapurHyderabad.
8)**B.Raju,** S/o. Mysaiah,R/o.H.No.2-2-73/10, Amberpet, Hyderabad.
9.) **B.Govind Raj,** S/o.Late Babu rao, R/o.H.No.1-10-180, Plot No. 16 and 17, Venkata Sai residency, Alwal, Secunderabad.
10) **Antony Louis,** S/o. Joseph Louis, R/o. H.No.1-8-506/4/7/A, Prakash Nagar, Begumpet, Secunderabad.
11) **Smt.Usha Rani,** W/o. Late Pratap Sing,H.No. 23-6-852/12,Shalibhanda, Hyderabad
12) T.Mahesh Singh, S/o.Late Pratap Singh,H.No. 23-6-852/12, Shalibhanda, Hyderabad
13) T.Sachin Kumar, S/o. Late Pratap Singh,H.No. 23-6-852/12, Shalibhanda, Hyderabad.
14) T.Kishor Kumar, S/o. Late Pratap Singh.R/o. H.No. 23-6-852/12, Shalibhanda, Hyderabad.
15) Smt. B.Shakuntala, W/o. Late B.Venkata ratnam,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District
16) B.Anjan Kumar, S/o. Late B.Venkata Ratnam,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District
17) B.Anil Kumar, S/o. Late B.Venkata Ratanm ,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District.
18) Smt. T.Jaya Lakshmi, D/o. Late B.Venkata Ratnam,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District.
19) Smt. G.Vara Laxmi, D/o. Late B.Venkata ratnam,R/o. H.No.Plot No. 106, Hasthinapuram Central Phase-II, Nagarjuna Sagar road, Karmanghat Village, Saroornagar Mandal, ranga reddy District
20) C.N.Prasad, S/o. Appa Rao,R/o.H.No.6-3-456/2, Dwarakapuri Colony, Punjagutta Hyderabad.
21) Smt. G.B.Satyanarayanamma, W/o. Late Babu Rao, R/o. H.No.1-8-145/1, Near Alwal Railway Station,Alwal, Secundrabad.

(4 TO 21)..... Defendants

You are hereby informed that our client has filed the above case against the defendants No. 1 to 21 SUIT FOR SPECIFIC PERFORMANCE. The defendants No. 4 to 21 are avoiding to take notices/Summon from this Hon'ble Court. Hence the Hon'ble Court was pleased to order for publication against the defendants No. 4 to 21 and directed the matter to beposted on 28-07-2023 at 10:30am for your appearance and counter. Hence, you are hereby informed to appear before the above court in the above case, either in person or through your advocate. In case of your failure to appear before the court, the case will be heard in your absence and the court may pass orders accordingly.
రాష్ట్రంలోని పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా అధికారులు లంచగొండి చర్యలు, కక్ష సాధింపు పద్ధతులు మానుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలు ఇస్తున్నామని, ప్రభుత్వం ఘనంగా ప్రకటిస్తూ, అనేక చోట్ల ఆదివాసీల భూములు సర్వే చేయకుండా.. చేసిన వాటికి పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అనుసరిస్తుందని ఆరోపించారు. కొందరు అధికారులు పెద్దఎత్తున లంచాలు తీసుకుని ప్రజలను దగా చేస్తున్నారన్నారు. అలాగే గిరిజనేతర పేదలకు వలస వచ్చిన గుత్తి కోయ వారికి పట్టా హక్కులు గాని, ఎలాంటి హక్కులు గాని ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అటవీ హక్కుల చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని ఎల్లన్న నగర్ భూములను ఇంతవరకు సర్వే చేయలేదని, మంత్రులు, కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చి ఎన్ని ఆందోళనలు చేసినా ఫారెస్ట్ అధికారులు తప్పుడు రిపోర్టును ఆధారం చేసుకుని సర్వే చేయలేదని తెలిపారు. ఫారెస్ట్ అధికారులే బ్లాక్‌మెయిల్ చేస్తూ సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. కొణిజర్ల మండలంలో వందలాది మంది గిరిజనులకు పట్టహక్కులు ఇవ్వలేదని, కావాలని పట్టా హక్కులు ఇవ్వకుండా పైరవీకారులను రంగంలోకి దింపి ఐటీడీఏ అధికారులు ఎకరాకు 5 వేల నుంచి 10వేల రూపాయలు తీసుకొని పట్టాలిస్తామని ప్రలోభాలకు, అవినీతికి గేట్లు తెరిచారని ఆరోపించారు. ఇల్లందు నియోజకవర్గంలోని గుండాల, టేకులపల్లి, ఇల్లందు, కారేపల్లి తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని, సర్వే చేయడం... చేసింది పక్కన పడేయటం జరిగిందన్నారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ.. పోడు చేసుకున్న భూములన్నింటిని సర్వే చేయాలని, పోడు సాగుదారులందరికీ చట్ట ప్రకారం పట్టా హక్కులు కల్పించాలన్నారు. ఫారెస్ట్ అధికారుల కక్షసాధింపు చర్యలు విడిచి పెట్టాలని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో 152 మందిపై యూఏపీఏ చట్టాన్ని నమోదు చేయడం నిరంకుశ చర్య అని, పార్టీకి చెందిన న్యాయవాది రవీందర్‌ను సైతం ఈ కేసులో ఇరికించారన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, జిల్లా నాయకులు గుర్రం అచ్చయ్య, అర్జున్ రావు, సి వై పుల్లయ్య ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ మాటలు అభ్యంతరకరం

- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఖమ్మం సభలో మాట్లాడిన తీరు అభ్యంతరకరంగా ఉన్నాయని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి రాహుల్ గాంధీ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రికార్డ్ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి, రాష్ట్ర రైతాంగంకు సాగునీటిని అందిస్తున్నదని గుర్తుచేశారు. దేశానికి అన్నం పెట్టే స్థాయికి రాష్ట్రం ఎదిగిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. స్థానిక నాయకులు రాసిచ్చిన అబద్దాల స్క్రిప్టును రాహుల్ గాంధీ చదివారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.4వేల పింఛన్ ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు.పోడు భూముల గురించి అబద్దాలు మాట్లాడారని తెలిపారు.


సెమీ క్రయోజనిక్ ఇంజన్ పరీక్షను రద్దు చేసిన ఇస్రో

బెంగళూరు : సెమీ క్రయోజనిక్ ఇంజన్ ఇంటర్మీడియల్ కాన్ఫిగరేషన్‌పై నిర్వహించాల్సిన మొదటి హాట్ టెస్ట్‌ను ఇస్రో రద్దు చేసింది. టర్బైన్ ఒత్తిడి అనూహ్యంగా పెరగడం, ఆ వెంటనే టర్బైన్ వేగం తగ్గిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

గమ్యం లేని సడక్

పీఎంజీఎస్‌వై పురోగతి పేలవం

- 6 రాష్ట్రాలు, యూటీలలో పనితీరు దారుణం
- గ్రామీణ రహదారి లక్ష్యాలలో 20 శాతం కూడా చేరుకోని వైనం
- కేంద్రం నివేదిక



న్యూఢిల్లీ: దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) ఆశించిన ఫలితాలను సాధించటం లేదు. ఈ పథకం కింద దేశంలోని అనేక రాష్ట్రాల్లో రోడ్ల నిర్మాణాలు నిర్దేశించిన స్థాయిలో ముందుకు సాగటం లేదు. పనులు నత్తనడకన సాగుతున్నాయి. పురోగతి అంతంత మాత్రంగానే ఉన్నది. నిర్దేశిత లక్ష్యాలను సాధించటంలో దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీలు) పనితీరు దారుణంగా ఉన్నది. ఇవి తమ లక్ష్యాలలో 20 శాతం కూడా చేరుకోలేకపోయాయి. కేంద్రం ఇటీవల విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది.

గత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో పీఎంజీఎస్‌వై కింద తమ లక్ష్యాలలో 20 శాతం లక్ష్యాన్ని కూడా చేరుకోలేక ఈ రాష్ట్రాలు చేతులెత్తేశాయి. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రతో సహా ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు(యూటీలు) ఈ జాబితాలో ఉన్నాయి. స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ (ఎంఓఎస్‌పీఐ) పురోగతి నివేదికలో ఈ విషయం వెల్లడైంది. జార్ఖండ్, నాగాలాండ్, అండమాన్ నికోబార్ దీవులు 20 శాతం లక్ష్యాన్ని చేరుకోని రాష్ట్రాలు, యూటీల జాబితాలో ఉన్నాయి. గతేడాది ఏప్రిల్-డిసెంబర్ కాలానికి సంబంధించి ఛత్తీస్‌గఢ్ తన లక్ష్యంలో సరిగ్గా 20 శాతానికి చేరుకున్నది. ఈ రాష్ట్రాల పని తీరును చూస్తే.. నాగాలాండ్(19శాతం), జార్ఖండ్(18 శాతం), మహారాష్ట్ర (15 శాతం), పశ్చిమ బెంగాల్ (12 శాతం), అండమాన్ నికోబార్ దీవులు (8శాతం) ఉన్నాయి.

ఇక 80 శాతం కంటే తక్కువ లక్ష్యాలను చేరుకున్న రాష్ట్రాలు, యూటీల పురోగతిని "పేలవం(పూర్)"గా నివేదికలో వర్గీకరించారు. ఇందులో బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, అసోం, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు సహా మొత్తంగా 24 రాష్ట్రాలు, యూటీలు ఉన్నాయి.

పీఎంజీఎస్‌వై పురోగతి పేలవం

పీఎంజీఎస్‌వై మొత్తం పురోగతి.. నివేదికలో "పేలవమైనది" అని పేర్కొనబడటం గమనార్హం. గతేడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్య సంచిత లక్ష్యంలో కేవలం 53 శాతం మాత్రమే సాధించబడింది. మొత్తం 18,808 కిలోమీటర్ల రహదారిని గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించారు. ఈ కాలానికి లక్ష్యాన్ని 35,385 కిలోమీటర్లుగా నిర్దేశించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణ వార్షిక లక్ష్యం 47,171 కిలోమీటర్లుగా ఉండటం గమనార్హం.

గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధి అందించిన సమాచారం ప్రకారం.. ఈ పథకం 2022-23 ఆర్థిక సంవత్సరంలో 29,753 కిలోమీటర్ల రహదారి నిర్మితమైంది. ఇది లక్ష్యంలో 63 శాతంగా ఉన్నది. 2014 నుంచి ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 3.53 లక్షల కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించామని ప్రతినిధి తెలిపారు. అయితే, లక్ష్యాలను చేరుకోకపోవటం, ఆలస్యానికి గల కారణాల గురించి మాత్రం సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి ప్రస్తుతానికి స్పందన లేదు.

విద్య కార్పొరేటీకరణను తరిమికొడదాం

- ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, నాగరాజు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



రాష్ట్రంలో విద్య కార్పొరేటీకరణను తరిమికొట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి. నాగరాజు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పూర్తిగా విస్మరిస్తుందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ కూడా అందలేదని తెలిపారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వ నియంత్రణ ఉండకపోవడం సిగ్గుచేటన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి రవి, గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ్, అజయ్, నాయకులు అల్తాఫ్, స్టాలిన్, అవినాష్, నితిన్, మణికంఠ, వర్షిని, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా శరణార్థుల శిబిరంపై ఇజ్రాయిల్ దాడి

తొమ్మిది మంది పాలస్తీనియన్లు మృతి

- కొనసాగుతున్న హింస, పెచ్చరిల్లిన ఉద్రిక్తతలు
- ఐరాస సహా పలు దేశాల ఖండన
- మరో 25 ఎఫ్-35 విమానాలు కొనుగోలు చేసిన ఇజ్రాయిల్



జెరూసలేం : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో జెనిన్ శరణార్థ శిబిరంపై సోమవారం తెల్లవారు జామున ఇజ్రాయిల్ దాడి చేసింది. మిలటరీ డ్రోన్‌లు, బలగాలతో జరిపిన ఈ దాడిలో తొమ్మిదిమంది పాలస్తీనియన్లు మరణించారని. పలువురు గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఆ ప్రాంతమంతా వేలాది బలగాలను ఇజ్రాయిల్ మోహరించింది. సోమవారం సాయంత్రానికి కూడా జెనిన్ శరణార్థుల శిబిరంలో సాయుధ ఘర్షణలు కొనసాగుతున్నాయని స్థానిక మీడియా తెలిపింది. మొత్తంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన ఇజ్రాయిల్ బలగాలు శిబిరంపై దాడిని కొనసాగిస్తున్నాయి. అవసరమైతే మరిన్ని బలగాలను, వాహనాలను ఇజ్రాయిల్ ఆర్మీ శిబిరంలోకి పంపిస్తోందని మీడియా వార్తలు తెలిపాయి. రద్దీగా వున్న శిబిరం వీధుల్లో నుండి నల్లటి దట్టమైన పొగ పైకి లేవడం కనిపిస్తోంది. తుపాకుల శబ్దాలు వినిపిస్తున్నాయి. పై నుండి డ్రోన్‌ల శబ్దాలు కూడా వినపడుతున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్‌ను నిలుపుచేశారని అక్కడి ప్రజలు తెలిపారు. శిబిరంలో పిల్లలు భయంతో వణికిపోతూ ఏడుస్తున్నారని తెలిపారు. ఇజ్రాయిలీ బలగాలకు దారిని క్లియర్ చేయడం కోసం ఇరుకుగా వుండే ఆ వీధుల్లో మిలటరీ బుల్డోజర్లు భవనాలను ధ్వంసం చేస్తున్నాయి.

పలు దేశాల ఖండన

కాగా ఈ హింసాకాండను పాలస్తీనియన్లు తీవ్రంగా ఖండించారు. గాజా నగర సెంటర్‌లో పాలస్తీనా వర్గాలు ప్రదర్శన నిర్వహించాయి. జెనిన్ ప్రజలకు సంఘీభావం తెలిపాయి. తక్షణమే ఇజ్రాయిల్ దూకుడుచర్యను నిలువరించాలని నినాదాలు చేశారు. ప్రతిఘటనకు సాయమందిస్తాం, జెనిన్‌వాసులకు బాసటగా వుంటామని రాసిన బ్యానర్లను ప్రదర్శించారు. ఈ మిలటరీ ఆపరేషన్‌ను అంతమొందించడానికి తక్షణమే అంతర్జాతీయ పక్షాలు, అరబ్ పక్షాలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం వుందని వారు నొక్కి చెప్పారు. ఇజ్రాయిల్ చర్యను ఇరాన్, ఈజిప్ట్, జోర్డాన్ సహా పలు దేశాలు, అరబ్ లీగ్, ఇస్లామిక్ సహకార సంస్థ (ఓఐసి)లు తీవ్రంగా ఖండించాయి. హేయమైన నేరానికి ఇజ్రాయిల్ పాల్పడిందని ఓఐసి విమర్శించింది. ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. గాయపడిన వారికి తక్షణమే సాయం అందేలా అవకాశం కల్పించాల్సిందిగా మానవతా కోఆర్డినేటర్ లిన్ హేస్టింగ్స్ ట్వీట్ చేశారు. అంతర్జాతీయ సమాజం చేతులు ముడుచుకుని కూర్చుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అనుకున్న ప్రకారమే సాగుతోంది

అనుకున్న ప్రకారమే ఆపరేషన్ కొనసాగుతోందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గల్లాంట్ వ్యాఖ్యానించారు. అత్యున్నత మిలటరీ కమాండర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఆపరేషన్ ఎప్పుడు ముగుస్తుందన్నది ఎలాంటి సూచనలు చేయలేదు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో శరణార్థుల శిబిరంపై దాడి చేయడంతో సైనిక ఆపరేషన్ ప్రారంభమైందని సైనిక ప్రతినిధి తెలిపారు. ఆయుధాలను ధ్వంసం చేయడం, వాటిని జప్తు చేసుకోవడం ఈ ఆపరేషన్ లక్ష్యమని చెప్పారు. నిర్దిష్ట లక్ష్యాలపై దాడి చేయాన్నలది తమ ఆలోచన అని చెప్పారు. మొత్తంగా 2వేలమంది సైనికులు ఈ అపరేషన్‌లో పాల్గొన్నారు.

300కోట్ల దాలర్లతో 25కి పైగా స్టెల్త్ జెట్‌లు

300కోట్ల డాలర్ల విలువైన ఒప్పందంలో భాగంగా 25కి పైగా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి ఆమోద ముద్ర లభించినటు ఇజ్రాయల్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అమెరికాకు వెలుపల ఈ యుద్ధ విమానాలను సమకూర్చుకున్న మొదటి దేశం ఇజ్రాయిల్‌నే. తాజా ఒప్పందంతో ఇజ్రాయిల్ వైమానిక దళంలో ఎఫ్-35 విమానాల సంఖ్య 75కి చేరనుంది. అమెరికా నుండి ఇజ్రాయిల్ అందుకున్న రక్షణ సహాయ ప్యాకేజీ ద్వారా ఈ ఒప్పందానికి నిధులు అందాయని ఇజ్రాయిల్ రక్షణ అధికారులు తెలిపారు.

హయ్యర్ పెన్షన్ దరఖాస్తు లోపాలు సరిదిద్దండి

- ఆర్టీసీ కార్మికుల కేవైసీలు అనుమతించాలి
- పీఎఫ్ కార్యాలయం ఎదుట టీఎస్ఆర్టీసీ జేఏసీ ధర్నా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల హయ్యర్ పెన్షన్ దరఖాస్తుల్లో లోపాలను సరిదిద్దాలని టీఎస్ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారంనాడిక్కడి బర్కత్‌పురా ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చిన్న చిన్న తప్పులకు కూడా హయ్యర్ పెన్షన్ దరఖాస్తుల్ని తిరస్కరిస్తున్నారని వారు తెలిపారు. ధర్నాకు జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి (ఎంప్లాయిస్ యూనియన్) అధ్యక్షత వహించారు. టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీ ప్రకాశ్, ప్రచార కార్యదర్శి పీ రవీందర్‌రెడ్డి, బీకేయూ ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య, జేఏసీ నాయకులు ఎమ్ వెంకట్‌గౌడ్, అంజిబాబు, ఎమ్ఏ మాజీద్, బీ జకరయ్య తదితరులు మాట్లాడారు. ఆర్టీసీలో పనిచేస్తున్న దాదాపు 1,600 మంది ఉద్యోగుల కేవైసీ ఫారాలను రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్ తిరస్కరించారని తెలిపారు. ఆధార్ కార్డులో, పీఎఫ్ రికార్డులో, ఆర్టీసీ సర్వీస్ రికార్డ్‌లో పేర్లు వేర్వేరుగా ఉన్నాయని దరఖాస్తులు తిరస్కరిస్తున్నారనీ, దీనిపై జాయింట్ డిక్లరేషన్ ఇచ్చినా పరిగణనలోకి తీసుకోవట్లేదని తెలిపారు.ఆర్టీసీ కార్మికు లు అప్లై చేసుకున్న కేవైసీ ఫారాలను అనుమతించాలని కోరారు. అనంతరం రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 డీవీకే పావనికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేసి, సర్వీసులో ఉన్న వారికి ఏలాంటి సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే రిటైర్ అయిన వారి కేవైసీ సమస్యను పరిష్కారం చేశామని చెప్పారు. రిటైర్ అయిన ఉద్యోగి చనిపోతే, ఆ ఉద్యోగి బార్య హయ్యర్ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకొనే అవకాశం లేదని తెలిపారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలి



నవతెలంగాణ-కేయూ క్యాంపస్

రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం హన్మకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల భవనం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1356 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులనూ పర్మినెంట్ చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కో- చైర్మెన్ జరుపుల చందూలాల్, నాయకులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శ్రీదేవి, శ్రీలత, డాక్టర్ సురేష్, డాక్టర్ దేవేందర్, డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీధర్ రావు, డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ సదానందం, డాక్టర్ దాస్, డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి కార్మికుడు మృతి



నవతెలంగాణ- వలిగొండ రూరల్

ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడటంతో గీత కార్మికుడు ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు కమ్మగోని స్వామి(58) తాటి చెట్టుపై కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడ్డాడు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్వామి మృతదేహాన్ని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. సంఘం మండల అధ్యక్షులు పబ్బతి మల్లేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి గాజుల ఆంజనేయులు గౌడ్, కోశాధికారి పలుసం స్వామి గౌడ్, గ్రామ అధ్యక్షుడు కర్నాటి సైదులు గౌడ్, గంగాపురం నరసింహ, కాసుల సాయిలు, గంగాపురం కిష్టయ్య గంగాపురం వెంకటేష్ గౌడ్ నివాళి అర్పించారు.

చైనాలో వరదల బీభత్సం

- 10వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- బీజింగ్ సహా పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలు

బీజింగ్ : చైనా రాజధాని బీజింగ్‌లో ఒక పక్క తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు మండుతుంటే మరోపక్క సెంట్రల్ ప్రావిన్స్ హనన్ సహా పలుచోట్ల వరదలు ముంచెత్తుతున్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత బీజింగ్‌లో ఇటీవలి కాలంలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటుతున్నాయని జాతీయ వాతావరణ కేంద్రం సోమవారం తెలిపింది. 1961లో చివరిసారిగా ఇటువంటి పరిస్థితి నమోదైంది. మెజారిటీ సంఖ్యలో ప్రజలకు ఫ్యాన్లు, ఎసిలు కూడా లేని ఆ కాలంలో ఈ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సరిగా వర్షాలు పడకపోవడం కూడా తాజా వేడి పరిస్థితులకు కారణమని భావిస్తున్నారు. ఈ ఏడాది సాధారణంగా పడే వర్షపాతం కన్నా కూడా చాలా తక్కువగా వుండడంతో మొత్తంగా రాజధానిలో పొడి పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం ఒక మోస్తరు ఉష్ణోగ్రత నమోదైనా ఈ వారంలో మళ్లీ బీజింగ్‌లోనూ, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ పెరుగుతాయని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు హనన్ ప్రావిన్స్‌లో వరదల కారణంగా 10వేలమందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాల కారణంగా దాదాపు 70ఇళ్లు నేలకూలాయి. మరో 2283 ఇళ్ళు ధ్వంసమయ్యాయి. పొలాలన్నీ వరద నీటితో నిండిపోయాయి. ఇప్పటివరకు జరిగిన నష్టాన్ని 7.9కోట్ల డాలర్లు అంచనా వేశారు. గత 50ఏళ్ళలో ఎన్నడూ లేని రీతిలో షాంక్సి ప్రావిన్స్‌కు ఉత్తరంగా గల జెన్బా కౌంటీలో వరదలు సంభవించాయని, రోడ్లు కొట్టుకుపోయాయని, ఇళ్లు ధ్వంసమయ్యాయని అధికారులు చెప్పారు. కాగా వరదల కారణంగా మరణాలు సంభవించలేదు. రాబోయే రోజుల్లో మొత్తంగా 11 ప్రావిన్స్‌ల్లో అంటే చైనా భూభాగంలో దాదాపు సగం ప్రాంతంలో భారీ వర్షాలు పడతాయని భావిస్తున్నారు.

ఆర్టికల్ 370 రద్దుపై పిటిషన్లను 11న విచారించనున్న సుప్రీం

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని 370వ అధికరణను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నెల 11న విచారించనుంది. ఈ అధికరణను రద్దు చేయడంతో జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయింది. ఫలితంగా 2019లో రాష్ట్రం రెండు ముక్కలైంది. ఈ అంశంపై త్వరగా విచారణ చేపట్టాలంటూ ఫిబ్రవరి 17న పిటిషనర్లు చివరిసారిగా కోరారు. త్వరలోనే విచారణ తేదీని నిర్ణయిస్తామంటూ ఆనాడు చంద్రచూడ్ వారికి హామీ ఇచ్చారు.

యూసీసీ అమలు సాధ్యమేనా?

- ముసాయిదా రూపకల్పనే జరగలేదు
- వివిధ సమూహాల నుంచి వ్యతిరేకత
- అమల్లో సంక్లిష్టతలు



న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం ప్రధాని నరేంద్ర మోడీ తన పార్టీకి ఓ ఎన్నికల అస్త్రాన్ని అందించారు. అదే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ). మన దేశంలో ప్రస్తుతం వివాహం, విడాకులు, భరణం, పిల్లల సంరక్షణ, వారసత్వం వంటి విషయాలకు సంబంధించి వివిధ మతాల వారికి వేర్వేరు చట్టాలు అమలులో ఉన్నాయి. అంతేకాక కులం, తెగ, భాష ఆధారంగా వివిధ ప్రాంతాలలో వేర్వేరు సాంస్కృతిక కట్టుబాట్లు కొనసాగుతున్నాయి. అయితే ఈ చట్టాలు, కట్టుబాట్ల స్థానంలో దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టాన్ని తీసుకురావాలని ప్రధాని ప్రతిపాదిస్తున్నారు. అదే యూసీసీ. అయితే దీని అమలుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ముస్లింలలో బహుభార్యత్వం, జననాల రేటుపై బీజేపీ తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తోంది. అయితే వాస్తవానికి బహుభార్యత్వం అనేది ముస్లింలతో పోలిస్తే హిందువులలోనే ఏదో ఒక రూపంలో అధికంగా ఉంటోంది. ఈ విషయాన్ని హిందూ శక్తులు గుర్తించడం లేదు. దేశంలో మైనారిటీల సంఖ్య పెరిగిపోతోందని, ఇది కొనసాగితే కొంతకాలం తర్వాత దేశం ముస్లిం దేశం అవుతుందని దుష్ప్రచారం చేస్తున్నారు. అందుకే పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి బహుభార్యత్వానికి, జననాల రేటుకు పెద్దగా సంబంధం లేదు. ముస్లింలలో జననాల రేటు తగ్గుతోంది. పర్సనల్ లాను జనాభా పెరుగుదలతో ముడిపెట్టడంలో భాగంగానే ఉత్తరాఖండ్ యూసీసీ బృందం 'ఇద్దరు పిల్లలు' అనే చైనా విధానాన్ని పరిశీలిస్తోందని తెలిసింది.

ఆదేశిక సూత్రమే

సుమారు పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న మోడీ యూసీసీని ఎందుకు అమలు చేయలేదనే ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి యూసీసీ అంటే ఎవరికీ తెలియదు. ఏడు దశాబ్దాలుగా దీనిపై చర్చ జరుగుతున్నప్పటికీ పరిశీలన, చర్చ కోసం ఇప్పటివరకూ నిర్దిష్ట ప్రతిపాదన ఏదీ రాలేదు. యూసీసీ ప్రస్తావన రాజ్యాంగంలో ఉన్నప్పటికీ పెద్దగా వివరాలు లేవు. పైగా రాజ్యాంగ నిర్మాతలు దానిని ఆదేశిక సూత్రాలలో మాత్రమే చేర్చారు. అంటే దీనిని నిర్బంధంగా అమలు చేయలేరు.

ఈశాన్యంలో నిరసన

యూసీసీపై ఇప్పటి వరకూ కనీసం ముసాయిదాను కూడా రూపొందించలేదు. దేశవ్యాప్తంగా ఒకే చట్టాన్ని అమలు చేయడం ఎంత సంక్లిష్టతతో కూడుకున్నదో తెలియంది కాదు. ముస్లింలను యూసీసీ పరిధిలోకి తేవాలని హిందూత్వ వాదులు వాదిస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ముస్లిం పర్సనల్ లా వలసవాదుల సృష్టి. వివిధ దేశాలలో నివసిస్తున్న ముస్లింలకు వేర్వేరు చట్టాలు అమలులో ఉన్నాయి. మన దేశంలో కూడా ప్రాంతాలు, జాతులను బట్టి వేర్వేరు చట్టాలను అమలు చేస్తున్నారు. ఉదాహరణకు భారత రాజ్యాంగం పార్లమెంటరీ చట్టాల నుండి ఈశాన్య ప్రాంతాలను వేరు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌లో నాగాలు, మిజోల ఆచారాలకు సంబంధించిన చట్టాల ప్రస్తావన ఉంది. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే ఈశాన్య ప్రాంతాల నుండి యూసీసీపై నిరసన గళాలు విన్పిస్తున్నాయి. యూసీసీ వ్యతిరేకులలో బీజేపీ భాగస్వామ్య పక్షాలు ఉండడం గమనార్హం. యూసీసీని అమలు చేస్తే రాష్ట్రానికి చెందిన 60 మంది ఎమ్మెల్యేల నివాసాలను తగలబెడతామని ఓ నాగా గ్రూపు హెచ్చరించింది కూడా.

ఇతర రాష్ట్రాలలో సైతం...

ఈశాన్యంలోనే కాకుండా దేశంలోని పలు రాష్ట్రాలలో సైతం యూసీసీపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. యూసీసీని అమలు చేస్తే తమకు ప్రస్తుతం ఉన్న రాజ్యాంగపరమైన రక్షణలు లేకుండా పోతాయని జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. సిక్కు వివాహ చట్టం ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని అకాలీదళ్ అంటోంది. ముస్లిం పర్సనల్ లా బోర్డ్ తరహాలోనే ఆదివారం నాడు సిక్కు పర్సనల్ లా బోర్డ్‌ను ఏర్పాటు చేశారు.

మాంసంపై నిషేధం నుంచి యూసీసీ వరకూ...

బీజేపీ హిందూత్వ పార్టీ అనే విషయంలో ఏ మాత్రం సందేహం అవసరం లేదు. బీజేపీ ప్రభుత్వ చేతలు ఈ విషయాన్ని నిజం చేస్తున్నాయి. ఆవు మాంసంపై నిషేధం విధించడం, హిందూ మత ఆచారాలను పాటించాలంటూ హిందూయేతరులను బలవంతం చేయడం, మత మార్పిడుల నిరోధక చట్టాన్ని తీసుకురావడం, పౌరసత్వ సవరణ చట్టం నుండి ముస్లింలను వేరు చేయడం వంటి చర్యలన్నీ బీజేపీ హిందూత్వ పోకడలకు అద్దం పడుతున్నాయి. ప్రత్యేక వివాహ చట్టం కింద వివాహం చేసుకున్న దంపతులను మతోన్మాదులు బెదిరిస్తున్న ఉదంతాలు అనేకం. మతాంతర వివాహాలను ఈ శక్తులు వ్యతిరేకిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లింలు, సిక్కులు, నాగాలు వంటి మైనారిటీలు యూసీసీని వ్యతిరేకించడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఓట్లు రాలవు

రాబోయే లోక్‌సభ ఎన్నికలలో రాజకీయ ప్రయోజనం పొందేందుకే మోడీ ప్రభుత్వం యూసీసీని తెరపైకి తెస్తోంది. అయితే దీనివల్ల బీజేపీకి పెద్దగా ఒరిగేదేమీ ఉండక పోవచ్చు. ఎందుకంటే బీజేపీ మద్దతుదారులందరూ యూసీసీని కోరుకుంటున్న వారే. నూతన చట్టాన్ని ప్రతిపాదించడం వల్ల బీజేపీకి అదనంగా వచ్చే ఓట్లేమీ ఉండవు. పైగా మైనారిటీ ఓట్లను ఆకర్షించేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొట్టే ప్రమాదం కూడా ఉంది.

బిజినెస్

రూ.2000 నోట్లు 76శాతం వెనక్కి

- విలువ రూ.2.72 లక్షల కోట్లు
- ఆర్‌బీఐ వెల్లడి



న్యూఢిల్లీ : చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 76 శాతం కరెన్సీని ఉపసంహరించుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. ఈ పెద్ద నోటును వెనక్కి తీసుకుంటున్నట్లు మే 19న ప్రకటన చేసిన విషయం తెలిసిందే. 2023 జూన్ 30 నాటికి బ్యాంక్‌లకు తిరిగి వచ్చిన మొత్తం నోట్ల విలువ రూ. 2.72 లక్షల కోట్లుగా ఉందని తాజాగా వెల్లడించింది. మార్చి 31 నాటికి రూ.3.62 లక్షల కోట్ల పెద్దనోట్లు చలామణిలో ఉన్నాయి. మే 19 నాటికి రూ.3.56 లక్షల కోట్లు చెలామణిలో ఉండగా.. ఇప్పటి వరకు 76 శాతం రిటర్న్ వచ్చాయని తెలిపింది. మే1 నాటికి మార్కెట్‌లో ఇంకా రూ.84,000 కోట్ల విలువ చేసే రూ.2వేల నోట్లు చెలామణిలో ఉన్నాయి. చెలామణి నుండి తిరిగి వచ్చిన రూ. 2,000 మొత్తం నోట్లలో 87శాతం డిపాజిట్ల రూపంలో ఉండగా, మిగిలిన 13శాతం ఇతర డినామినేషన్ నోట్లలోకి మార్పిడి జరిగిందని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. కాగా.. 2018-19లో రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. మే19న ఉపసంహరణ ప్రకటన సమయంలో వినియోగదారులకు రూ.2వేల నోట్లు ఇవ్వొద్దని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను మార్చుకునేందుకు సెప్టెంబరు 30వ తేదీ వరకు గడువు ఉందని.. ఆ లోపు నోట్లను మార్చుకోవాలని ఆర్‌బిఐ మరోమారు గుర్తు చేసింది. 2016లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు చేసి తర్వాత రూ.2వేల నోట్లను మోడీ సర్కార్ ప్రవేశపెట్టింది. తిరిగి ఎందుకు ఉపసంహరించుకుంటుందో మాత్రం ప్రకటన చేయలేదు.

టాటా కార్లు మళ్ళీ ప్రియం

న్యూఢిల్లీ : ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ మరోమారు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. జులై 17 నుంచి ప్యాసింజర్ వాహన ధరలను 0.6 శాతం హెచ్చించనున్నట్లు వెల్లడించింది. ముడి సరుకుల ధరలు పెరగడమే ఇందుకు కారణమని పేర్కొంది. ఇంతక్రితం జనవరి, మే మాసాల్లోనూ ధరలు పెంచింది.

అనిల్ అంబానీని విచారించిన ఈడీ

ముంబయి : రిలయన్స్ ఎడిఎ గ్రూప్ అధినేత అనిల్ అంబానీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు ప్రశ్నించారు. విదేశీ మారక చట్టం (ఫెమా) నిబంధనలు ఉల్లంఘన కేసులో సోమవారం అనిల్ విచారణకు హాజరయ్యారు. ముంబయిలోని ఇడి కార్యాలయంలో అధికారులు అనిల్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. కాగా.. ఏ కేసులో ఆయనను విచారించారనే విషయం బయటికి రాలేదు.

జియో నుంచి 999కే ఫోన్

హైదరాబాద్ : రిలయన్స్ జియో చౌక ధరలో 4జి ఫోన్‌ను విడుదల చేసింది. దీని ధరను రూ.999గా నిర్ణయించింది. ఈ ఫోన్‌తో పాటు కొత్త రూ. 123 ప్లాన్ ప్రకటించింది. ఇది 28 రోజుల పాటు చెల్లుబాటు అవుతుందని పేర్కొంది. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు నెలకు 14జిబి డేటాను అందించనున్నట్లు తెలిపింది. ఇప్పటికీ 2జి ఫోన్లను వాడుతున్న వారిని లక్ష్యంగా 4జిలోకి మళ్లించడానికి ఈ ఫోన్‌ను తెచ్చినట్లు పేర్కొంది.

ఎంజి మోటార్‌కు జాన్వీ కపూర్ ప్రచారం



న్యూఢిల్లీ : బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ ఎంజి మోటార్ ఇండియా తన ప్రచారకర్తగా జాన్వీ కపూర్, క్రికెటర్ ఇషాన్ కిషన్‌తో భాగస్వామ్యం కుదర్చుకుంది. వీరిద్దరిని తమ ఉత్పత్తుల ప్రచారకర్తలుగా నియమించుకున్నట్లు పేర్కొంది. తొలుత జెన్ జడ్ కామెట్ ఇవికి ప్రచారం కల్పించనున్నారని తెలిపింది.

తప్పుడు హామీలు ఇచ్చి గద్దెనెక్కడం కాంగ్రెస్ కే అలవాటు

- తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టూరిస్టుల మాదిరి తెలంగాణకు రావడం... అబద్ధపు హామీలు ఇవ్వడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ విమర్శించారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కాలని చూడడం తరువాత ప్రజలను విస్మరించడం కాంగ్రెస్ నేతలకు వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పింఛన్లు రూ. వెయ్యి సైతం ఇవ్వడం లేదని అలాంటిది తెలంగాణలో రూ. 4 వేల పింఛన్లు ఏవిధంగా ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మొన్నటికి మొన్న కర్నాటకలో ఉచిత బియ్యం అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ నేడు ఉచిత బియ్యం ఇవ్వడం కుదరదని చేతులెత్తేసిందని వివరించారు. 2019 ఎన్నికల్లో 6వేల పింఛన్ ఇస్తానన చెప్పిన కాంగ్రెస్ పార్టీని ఇంటికి పంపించారని అదే ఇప్పుడు 4 వేలు ఇస్తానంటే తెలంగాణ ప్రజలు లా నమ్ముతారని ప్రశ్నించారు. అడ్డగోలుగా హామీలు ఇవ్వడం తరువాత వాటిని విస్మరించడం దశాబ్దాలుగా కాంగ్రెస్ అనుసరిస్తున్న సూత్రమన్నారు. ఎన్నో కుంభకోణాలు కాంగ్రెస్ పాలనలోనే జరిగాయని అలాంటి పార్టీ అవినీతి గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించనట్లే ఉందని ఎద్దేవా చేశారు.

శంషాబాద్ విమానాశ్రయంలో రూ.14 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : దేశంలోకి విదేశాల నుంచి తరలివస్తున్న మాదక పదర్థాలను నిరోధించటానికి సంబంధిత విభాగాలు తీవ్రంగా కృషి చేస్తున్నప్పటికీ.. నిఘా వ్యవస్థను బురిడి కొట్టిస్తూ మాదక పదార్థాలను కొత్త మార్గాల ద్వారా దేశంలోకి తరలిస్తున్న స్మగ్లర్ల వైనం వెలుగు చూస్తూనే ఉన్నది. తాజాగా, శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక విదేశీ మహిళ భద్రతాధికారుల కండ్లుగప్పుతూ తీసుకు వచ్చిన కోట్ల రూపాయల హెరాయిన్ కస్టమ్స్ అధికారుల అప్రమత్తతతో పట్టుబడ్డది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బురుండి దేశస్థురాలైన 42 ఏండ్ల మహిళ విమానాశ్రయంలో అనుమానాస్పదంగా వెళ్తుండగా కస్టమ్స్ అధికారులు ఆమె వద్దన్ను హ్యాండ్ బ్యాగ్‌ను అనుమానంతో సోదా చేశారు. అనుకున్నదాని కంటే ఎక్కువ బరువున్న ఆ బ్యాగును అధికారులు క్షుణ్ణంగా సోదా చేయగా.. కొన్ని సబ్బులతో పాటు పెద్ద సంఖ్యలో ప్లాస్టిక్ ప్యాకెట్లు బయట పడ్డాయి. సబ్బు రూపంలో హెరాయిన్‌ను కనిపెట్టిన అధికారులు ప్లాస్టిక్ ప్యాకెట్లలో ఉన్న షర్ట్ బటన్‌లను కూడా అనుమానంతో పరీక్షించారు. బటన్‌ల రూపంలో లోపల రహస్యంగా పొందుపర్చిన హెరాయిన్ బయటపడటంతో కస్టమ్స్ అధికారులు విస్తుపోయారు. ఆ మొత్తాన్ని తూకం వేయగా 2014 గ్రాముల బరువుతో హెరాయిన్ ఉన్నట్టు గుర్తించారు.

ఈ హెరాయిన్‌ను అత్యంత పకడ్బందీగా ఆ మహిళ మొదట నైరోబి నుంచి విమానంలో షార్జాకు వచ్చి, అక్కడ నుంచి విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగి హైదరాబాద్‌లో కొందరికి చేరవేయడానికి హెరాయిన్‌ను తీసుకొచ్చినట్టు అధికారులు ప్రాథమికంగా తేల్చారు. దీంతో ఆమెను అరెస్టు చేసిన కస్టమ్స్ అధికారులు కోర్టుకు హాజరుపర్చి చంచల్‌గూడ జైలుకు తరలించారు. రూ.14 కోట్ల విలువైన ఈ మాదక పదార్థాన్ని ఈ మహిళ ఎవరికి చేరవేయదల్చుకున్నది? అక్కడ నుంచి ఎందరి చేతులకు అది మారుతున్నది? కనిపెట్టడానికి దర్యాప్తును కొనసాగిస్తున్నామని కస్టమ్స్ అధికారులు తెలిపారు.

హైదరాబాద్‌లో మైక్రోచిప్ టెక్నలాజీ సెంటర్ ఏర్పాటు



హైదరాబాద్ : అమెరికాకు చెందిన మైక్రోచిప్ టెక్నాలజీ కంపెనీ హైదరాబాద్‌లో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. కోకపేట్ సమీపంలో ఏర్పాటు చేసిన దీనిని సోమవారం మంత్రి కెటిఆర్ లాంచనంగా ప్రారంభించారు. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రంలో చాండ్లర్‌లో మైక్రోచిప్ టెక్నాలజీ కంపెనీ ప్రధాన కార్యాలయం ఉందని ఆ కంపెనీ ప్రెసిడెంట్, సిఇఒ గణేష్ మూర్తి అన్నారు. గణేష్ మూర్తి మీడియాతో మాట్లాడుతూ.. "భారతదేశంలో దాదాపు 25 సంవత్సరాలు విజయవంతంగా కార్యకలాపాలను నిర్వహించిన అనుభవంతో ఈ కొత్త సదుపాయం రాబోయే సంవత్సరాల్లో మైక్రోచిప్ వద్ధి ప్రణాళికలను అమలు చేయడానికి మాకు తోడ్పడుతుంది. ఈ సెంటర్ భారతదేశంలోని కీలక వ్యాపార కారిడార్‌లలో ఉండటంతో, గ్లోబల్ మైక్రోచిప్ వ్యాపార అవసరాలకు ఈ ప్రాంతంలో పెరుగుతున్న మా కస్టమర్ బేస్‌కు మద్దతుగా హెడ్‌కౌంట్‌ను గణనీయంగా విస్తరించడానికి మాకు దోహద పడుతుంది." అని అన్నారు.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చర్చ!

కేంద్రమంత్రి వర్గం భేటీ

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై సర్వత్రా చర్చ నెలకొంది. సోమవారం నాడిక్కడ ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఇది త్వరలో జరగనున్న మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ గురించి ఊహాగానాలకు దారితీసింది. కీలకమైన విషయాలపై చర్చించేందుకు అధికార బీజేపీ అగ్రనాయకత్వం పలు దఫాల సమావేశాల అనంతరం కేంద్ర మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ముఖ్యంగా, పార్టీ సంస్థాగత, రాజకీయ వ్యవహారాల పరిస్థితిని నిశితంగా అంచనా వేయడానికి ప్రధాని మోడీ జూన్ 28న కీలకమైన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ వ్యూహాత్మక ప్రణాళికకు నిదర్శనంగా ఏదైనా కాబోయే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నిస్సందేహంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికలను పరిగణనలోకి తీసుకుంటుంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంత్రి మండలిలో ఎలాంటి మార్పులు చేర్పులు జరుగుతాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

పాలకుర్తి టూరిజం హెూటల్ విశాలంగా ఉండాలి

మంత్రి ఎర్రబెల్లికి నిర్మాణ ప్లాన్ చూపెట్టిన టూరిజం అధికారులు

టూరిజం అధికారుల సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలకుర్తిలో రూ.25 కోట్లతో నిర్మించనున్న టూరిజం హెూటల్ విశాలంగా ఉండాలని సంబంధిత అధికారులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. నిర్మాణ పనులపై సోమవారం హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ... పాలకుర్తిలో టూరిజం హెూటల్‌ను విశాలంగా నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ హెూటల్ నిర్మాణం అయితే, ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పాలకుర్తికి వచ్చే టూరిస్టులు, భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇక్కడకు వచ్చే భక్తులకు పాలకుర్తిలో బస చేయడానికి వీలు కలుగుతుందని మంత్రి చెప్పారు. పాలకుర్తి ప్రాంత అభివద్ధికి టూరిజం హెూటల్ ఎంతగానో ఉపయోగ పడుతుందని, ఈ హెూటల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్‌కు మంత్రి మరోసారి కతజ్ఞతలు తెలిపారు.

చదువుల తల్లికి బాసటగా మంత్రి ఎర్రబెల్లి

నీట్‌లో సత్తా చాటిన శతికి వెంటనే ఆర్థిక సాయం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన శృతి నీట్ పరీక్షలో 454 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 9,292 ర్యాంకు తెచ్చుకుంది. ఎస్సీ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు గ్యారంటీ. కానీ, కనీస ఫీజు చెల్లించే ఆర్థిక స్తోమత లేని, పేదరికం ఆమెను వెక్కిరించింది. తండ్రి చేసే మేస్త్రి పని కూలీ సరిపోలేదు. తల్లి చేసే కూలీ, తన పైచదువుల ఫీజుకు సరిపోవడం లేదు. తెచ్చుకున్న ర్యాంకు, వచ్చిన మార్కులు, ఆ అమ్మాయిని వెక్కిరించాయి. ఇది జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం, పాలకుర్తి మండలం గూడూరు గ్రామానికి చెందిన చెరిపల్లి శతి పరిస్థితి. విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెంటనే స్పందించారు. ఆ చదువుల తల్లికి బాసటగా నిలిచారు. శతిని, ఆమె తల్లదండ్రులను హైదరాబాద్‌కు పిలిపించుకుని శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. శతిని బాగా చదివించిన ఆమె తల్లి తండ్రులను మంత్రి మెచ్చుకున్నారు. నీట్‌లో సత్తా చాటిన శతికి వెంటనే ఆర్థిక సాయం అందచేశారు. ఆమె చదువు పూర్తి అయ్యే వరకు ఎర్రబెల్లి ట్రస్టు ద్వారా బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. శతిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, శతికి సంబందించిన సమస్యను ఓ విలేకరి ట్వీట్ చేయగా, ప్రతిగా ఆ బాధ్యత తాము తీసుకుంటామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ రీ ట్వీట్ చేశారు. అయితే, ఆ బాధ్యతను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీసుకున్నారు. తన నియోజకవర్గానికి చెందిన శతి చూపిన గొప్ప ప్రతిభకు తాను సాయంగా, ఊతంగా నిలిచారు.

దత్తత వెళ్లాక పుట్టింటి ఆస్తిపై హక్కుండదు

హైకోర్టు తీర్పు



నవతెలంగాణ – హైదరాబాద్

దత్తత వెళ్లిన వ్యక్తికి అతను పుట్టిన కుటుంబంలోని ఆస్తికి హక్కుదారుడు కాదని హైకోర్టు తీర్పు చెప్పింది. ఖమ్మం జిల్లాకు చెందిన ఏవీఎల్ఆర్ నర్సింహరావ్ వేరే కుటుంబానికి దత్తత వెళ్లాక తాను పుట్టిన కుటుంబ ఆస్తిలో వాటా కావాలని కోరుతూ దాఖలు చేసిన దావాలో అనుకూల ఉత్తర్వులు పొందారు. దీనిని ఆయన సోదరుడు నాగేశ్వర్‌రావు హైకోర్టులో సవాల్ చేసిన పిటిషన్‌ను జస్టిస్ నవీన్‌రావుతో కూడిన ముగ్గురు జడ్జీల బెంచ్ సోమవారం తీర్పు చెప్పింది. దత్తత వెళ్లడానికి ముందు అతను లేదా ఆమె పేరిట ఆస్తి రాసినా, కానుకగా ఇచ్చినా వాటిలో మాత్రమే హక్కుదారుడు అవుతాడని, దత్తత తర్వాత జన్మించిన కుటుంబ ఆస్తిలో హక్కు ఉండదని స్పష్టం చేసింది. జన్మనిచ్చిన కుటుంబంలో అంత్యక్రియల దగ్గర నుంచి ఏ శుభకార్యమైనా దత్తత వెళ్లిన వ్యక్తికి ఆర్థిక ఆస్తిపరమైన సంబంధం ఉండదని, పుట్టగానే ఆస్తి హక్కు ఉన్నట్టుగా చెబుతున్నప్పటికీ అది హక్కు కాదని, దత్తత చట్టం వర్తిస్తుందని వెల్లడించింది.

బదిలీలపై స్టే పొడిగింపు

ఉపాధ్యాయుల బదిలీలను సవాల్ చేసిన కేసులో స్టే ఉత్తర్వులను ఈనెల 11 వరకు పొడిగిస్తూ హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. రంగారెడ్డి జిల్లాకు చెందిన సక్కుబాయ్ ఇతరులు టీచర్ల బదిలీ జీవో తొమ్మిదిని సవాల్ చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. స్టే రద్దు చేయాలన్న ప్రభుత్వ వినతిని తోసిపుచ్చింది. స్టే ఎత్తేల్సిన తొందర ఏమీ లేదని చెప్పింది.

18కి కేంద్ర సర్వీస్ ఆఫీసర్ల కేసు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో ఉమ్మడి ఏపీలోని ఐఏఎస్, ఐపీఎస్ వంటి కేంద్ర సర్వీస్ అధికారుల బదిలీ వ్యవహారంపై దాఖలైన కేసుల విచారణ ఈనెల 18కి వాయిదా పడింది. ప్రత్యూష్‌సిన్హా కమిటీ సిఫారసుల మేరకు ఏపీకి కేటాయింపునకు గురైన డీజీపీ అంజనీకుమార్ ఇతరులు కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్)లో సవాల్ చేసి స్టే ఆదేశాలతో తెలంగాణలో కొనసాగుతున్నారు. క్యాట్ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ కేంద్రం హైకోర్టును ఆశ్రయించిన కేసులను జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి బెంచ్ విచారించింది. తమ వాదనలు వినాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అవసరం లేదంటూ కేంద్రం చెప్పింది. ఇరుపక్షాలు సంయమనం పాటించాలని హైకోర్టు సలహా ఇచ్చింది.

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం హైదరాబాద్ వస్తున్నారు. ఇక్కడ జరిగే అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొంటారు. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమంలో ఆమె మాట్లాడతారు. అనంతరం 5వ తేదీ మహారాష్ట్రలోని గోండ్వానా విశ్వవిద్యాలయం 10వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వెళ్తారు. అనంతరం నాగ్‌పూర్‌లోని కోరడిలో భారతీయ విద్యాభవన్ సాంస్కృతిక కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

నవధాన్యాలతో సీఎం కేసీఆర్ చిత్రపటం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నవ ధాన్యాలతో రూపొందించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు నిలువెత్తు చిత్రపటాన్ని సోమవారం ప్రగతిభవన్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సీఎంకు బహూకరించారు. ఆర్టిస్టులు గొట్టేటి బాలకష్ణ, ఆయన కుమార్తె సాయిశ్రీ 6 అడుగుల ఎత్తు, 4 అడుగుల వెడల్పుతో రూపొందించిన ఈ చిత్ర పటాన్ని దశాబ్ది ఉత్సవాల్లో సత్తుపల్లి రైతువేదికలో ప్రదర్శించినట్లు ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. ఎమ్మెల్యే వెంట సత్తుపల్లి మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేష్, ఆర్టిస్టులు గొట్టేటి బాలకష్ణ, సాయిశ్రీ ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వారిని అభినందించారు.

ఉపాధి హామి కూలీల సమస్యలను పరిష్కరించండి

మంత్రి ఎర్రబెల్లికి డీబీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ వ్యవసాయ వృత్తి దారుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధి హామి పరిరక్షణకు కూలీల నుంచి చేపట్టిన లక్ష సంతకాల సేకరణ పత్రాలను మంత్రికి సమర్పించారు. ఈ సందర్భంగా డీపీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, టీవీవీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం వెంకటయ్య మాట్లాడుతూ పనిదినాలను వంద రోజుల నుంచి 200 రోజులకు, కనీస వేతనాలను రూ.800లకు పెంచాలని కోరారు. వేతనాల అలస్యాన్ని నివారించాలనీ, బడ్జెట్ పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి కమిషనర్‌కు సైతం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగన్న, ప్రభుదాస్ ,జమలయ్య, వెంకటమ్మ, స్వాతి, శ్రీనివాస్, మునెష్ తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ పంచాయతీ ఎన్నికలు ప్రతిపక్షాల అభ్యర్థులపై యథేచ్ఛగా దాడులు

- పేట్రేగిపోతున్న తృణమూల్ గూండాలు
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న పోలీసులు

కొల్‌కత: పశ్చిమ బెంగాల్‌లో మూడంచెల పంచాయతీ రాజ్ ఎన్నికల పోలింగ్ గడువు దగ్గరపడుతున్న కొద్దీ తృణమూల్ గూండాల ఆగడాలు పెరిగిపోతున్నాయి. నామినేష్ల దాఖలు సమయంలో ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులను అడ్డుకోడానికి యథేచ్ఛగా బెదిరింపులు, దాడులకు తెగబడిన అధికార తృణమూల్ కాంగ్రెస్, ఎన్నికల ప్రచారాన్ని కూడా హింసాత్మకంగా మార్చేసింది. బెంగాల్‌లోని 20 జిల్లా పరిషత్‌లకు చెందిన 825 జెడ్‌పిటిసిలకు, 341 పంచాయతీ సమితులకు చెందిన 9,240 సమితి మెంబర్ల స్థానాలకు, 3,354 గ్రామ పంచాయతీలకు చెందిన 48,751 వార్డు స్థానాలకు ఈ నెల8న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఫలితాలు 11న వెలువడతాయి.

ప్రతిపక్ష అభ్యర్థులపై యథేచ్ఛగా దాడులు

ఎన్నికల ప్రచార సందర్భంగా తృణమూల్ దుండగులు సాగిస్తున్న ఎడాపెడా దాడులకు సిపిఐ(ఎం), కాంగ్రెస్ కు చెందిన పలువురు కార్యకర్తలు చనిపోయారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. పశ్చిమ మిడ్నపూర్ జిల్లా సబాంగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బల్వాయ్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇద్దరు సిపిఐ(ఎం) అభ్యర్థులపై సోమవారం తృణమూల్ దుండగులు బాంబులు, తుపాకులతో దాడి చేశారు. వీధి మీటింగ్ కోసం వేసిన కుర్చీలు, బల్లలను ధ్వంసం చేశారు.. సైకిళ్లను ఎత్తుకుపోయారు. ఈ దాడిలో ఇద్దరు అభ్యర్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు.

రాయ్‌గంజ్ పంచాయితీలో ఎన్నికల నామినేషన్ వేయకుండా అడ్డుకోడానికి తృణమూల్ బెదిరింపులకు దిగింది. అయినా లెక్కచేయకుండా సిపిఐ(ఎం) అభ్యర్థి మన్సూర్ ఆలం నామినేషన్ వేయడానికి వెళ్తుండగా ఆయన తలకు గురిపెట్టి తృణమూల్ దుండగులు కాల్పుఱ జరిపారు. ఈ దాడిలో గాయపడి గత కొద్ది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆలం సోమవారం చనిపోయారు. ఈ దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ దస్పర పోలీస్ అవుట్ పోస్టు ఎదుట రహదారిపై సిపిఎం కార్యకర్తలు ఆందోళనకు దిగారు. వారం రోజుల్లో నిందితులను పట్టుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉత్తర 24 పరగణాల జిల్లా హరోవాలో సోమవారం తెల్లవారు జామున జరిగిన బాంబు పేలుడులో ఒకరు మరణించారు. పొలంలో బాంబులు తయారు చేస్తుండగా అవి పేలడంతో ఒకరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. తృణమూల్ కాంగ్రెస్‌లోని ముఠా ఆధిపత్య పోరులో భాగంగానే బాంబులు తయారు చేస్తున్నారని కుటుంబ సభ్యులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

ఇదిలా వుండగా తూర్పు మిడ్నపూర్ జిల్లాలో బిజెపి గూండాలు బెదిరింపులు, మానసిక వేధింపులకు ప్రతిపక్షాలకు చెందిన 74 ఏళ్ల సిపిఎం అభ్యర్థి చనిపోయారు.

బీర్భుమ్ ఎంపి శతాబ్ది రాయ్‌కు నిరసన సెగ

బీర్భుమ్‌కు చెందిన తృణమూల్ ఎంపి శతాబ్ది రాయ్‌కు నిరసన సెగ తగిలింది. సోమవారం ఆమె ప్రయాణిస్తున్న కారును గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వర్షాకాలం వస్తే మురుగు నీటి కాల్వలు పొంగి పొర్లుతూ ఇళ్లల్లోకి వస్తుందని, ఈ విషయమై స్థానిక పంచాయతీ ప్రధాన్‌కు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిగా ఎన్నికైన తరువాత ఒక్కసారి కూడా తమ ప్రాంతం వైపు తొంగి చూడని ఎంపీని వారు నిలదీశారు. చాలా కాలంగా శిథిలావస్థలో ఉన్న వంతెన స్థానే కొత్త వంతెన కట్టాలని వారు డిమాండ్ చేశారు.

ఈనెల 5 నుంచి 8 వరకు సెయిలింగ్ పోటీలు

- విలేకరుల సమావేశంలో మేజర్ జనరల్ అజయ్‌శర్మ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈనెల 5వ తేది నుంచి 8 వరకు సెయిలింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు, 9న బహుమతుల ప్రదానం చేయనున్నామని మేజర్ జనరల్ అజయ్‌శర్మ తెలిపారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ ఆవరణంలోని సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో 37ఏండ్లుగా హుస్సేన్‌సాగర్‌లో జాతీయ స్థాయి సెయిలింగ్ ఛాంఫియన్‌షిఫ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 'హైదరాబాద్ సెయిలింగ్ వీక్' అనేది ప్రతిష్టాత్మక ఈవెంట్ అని, స్థానికులు, టూరిస్టులు ఆసక్తిగా చూస్తారని చెప్పారు. నేషనల్ సెయిలింగ్ కోచింగ్‌క్యాంప్‌ను 20జూన్ నుంచి 30 వరకు నిర్వహించామని తెలిపారు. దేశంలోనే హైదరాబాద్ సెయిలింగ్ పోటీలకు ప్రముఖ నరగమని అని అన్నారు. జులై, ఆగష్టు మాసాల్లో వాతావరణం కూడా సహకరిస్తుందని, సెయిలర్స్ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, బోట్‌ను నడిపించడానికి సులభంగా ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో సెయిలర్స్ ప్రతిభా ఆధారంగానే జాతీయ స్థాయిలో ర్యాంకులు కేటాయించనున్నట్టు చెప్పారు.

నీట్ తెలంగాణలోనూ శ్రీచైతన్య చరిత్ర

- టాప్‌టెన్‌లోపు 7, వందలోపు 67 ర్యాంకులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) తెలంగాణ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు చరిత్ర సృష్టించారు. ఓపెన్ కేటగిరీలో 720కి 720 మార్కులతో బి వరుణ్ చక్రవర్తి ఆలిండియా ఒకటో ర్యాంకు, ఏపీ ఒకటో ర్యాంకు సాధించారు. ఇప్పుడు తెలంగాణలో రఘురామ్‌రెడ్డి ఒకటో ర్యాంకు సాధించి ఆధిపత్యాన్ని కొనసాగించారు. రాష్ట్రంలో టాప్‌టెన్‌లో ఏడు, టాప్ వందలోపు 67 ర్యాంకులను శ్రీచైతన్య విద్యార్థులే కైవసం చేసుకున్నారు. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్ డైరెక్టర్ సుష్మ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టాప్ ర్యాంకులతోపాటు మొత్తం ర్యాంకుల్లోనూ తిరుగులేని సత్తాచాటారని తెలిపారు. రఘురామ్‌రెడ్డి ఒకటి, బి జాగృతి రెండు, ప్రాచిగిల్డా నాలుగు, డి గురు శశిధర్ ఐదు, టి వరుణ్‌రెడ్డి ఆరు, జె సుధీక్ష తొమ్మిది, వి సుహిత్ పదో ర్యాంకులను సాధించారని వివరించారు. నాణ్యమైన శిక్షణను అందిస్తూ అనితర సాధ్యమైన ప్రోగ్రామ్‌లు, మైక్రో షెడ్యూళ్లు, ఇంటర్నల్ పరీక్షలు, ర్యాంకింగ్ విధానం, నిరంతరం శ్రమించే ఫ్యాకల్టీ కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బిఎస్ రావు అభినందనలు తెలిపారు.

ఆగస్టు 4 నుంచి ప్లాస్టిక్ ఎక్స్‌పో

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తొలిసారిగా దేశంలోనే అతిపెద్ద ప్లాస్టిక్ ఎగ్జిబిషన్ (హిప్లెక్స్-2023)ను ఆగస్టు 4 నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్నట్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (టీఏపీఎంఏ) అధ్యక్షులు విమలేష్‌గుప్తా, హిప్లెక్ చైర్మెన్ బీఎల్ భండారి, మాజీ అధ్యక్షులు వీ అనిల్‌రెడ్డి తెలిపారు. సోమవారంనాడిక్కడి ఎఫ్‌టీసీసీఐలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు రోజులు జరిగే ఈ ఎక్స్‌పోలో దాదాపు రూ.500 కోట్ల విలువైన వ్యాపారం నమోదవుతుందని భావిస్తున్నామన్నారు. 500 మంది ఎగ్జిబిటర్లు 20వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచుతారనీ, 50వేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేశారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారాన్ని అందిస్తున్నాయన్నారు ప్రపంచ తలసరి సగటు ప్లాస్టిక్ వినియోగం 65 కిలోలుగా ఉందనీ, భారత్‌లో ఇది 32-35 కిలోలుగానే ఉందన్నారు. అమెరికాలో 70-75 కిలోల వినియోగం జరుగుతుందన్నారు. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో వినిమయం తక్కువగా ఉన్నదనీ, ఈ రంగంలో వ్యాపారం, ఉపాధికి మంచి అవకాశాలు ఉన్నాయని వివరించారు.

ట్వీట్ అంటేనే ట్విస్ట్..నో ఎక్స్‌ప్లనేషన్

- ఈటలతో నాకు గ్యాప్‌లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కి చుట్టరికం ఉంది
- పేరు, వాస్తు మార్చుకున్నా అధికారంలోకి రాలేరు : జితేందర్‌రెడ్డి
- ఈటల, జితేందర్‌రెడ్డితో గవర్నర్ దత్తాత్రేయ ప్రత్యక్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ట్వీట్ అంటేనే ట్విస్ట్ అనీ, దున్నపోతుల ట్వీట్‌కు ఎక్స్‌ప్లనేషన్ ఉండదని మాజీ ఎంపీ, బీజేపీ నేత జితేందర్‌రెడ్డి తేల్చి చెప్పారు. ఈటలతో తనకు గొడవ లేదనీ, ఆయనకు ఏ పదవి వచ్చినా సంతోషిస్తానని అన్నారు. సోమవారం హైదరాబాద్ శివారులోని జితేందర్‌రెడ్డి ఫామ్‌హౌజ్ సాక్షిగా ఈటల రాజేందర్, జితేందర్‌రెడ్డి ఒక్కటయ్యారు. వారిద్దరితో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ ప్రత్యక్షమవ్వడం చర్చనీయాంశమైంది. వారిద్దరి మధ్య ఆయనే సయోధ్య కుదిర్చినట్టు కూడా ప్రచారం జరుగుతున్నది. ఈ భేటీ అనంతరం జితేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పేరు మార్చుకున్నా, వాస్తు మార్చుకున్నా అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చుట్టరికం ఉందని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గెలిచే దమ్మున్న పట్టుమని నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు చెప్పాలని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు లేరన్నారు. రేవంత్‌రెడ్డి ఫోన్‌చేసి ట్వీట్ బాగుందని చెప్పారన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో ఈటల గెలుపు కోసం పనిచేశామని తెలిపారు. బీజేపీ పై తప్పుడు ప్రచారాలను ఆపాలని మీడియాను కోరారు. రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో తాను లేనని స్పష్టం చేశారు. తాను పదవుల కోసం ఢిల్లీకి వెళ్లనన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలతోనే ఉంటాననీ, అధిష్టానం ఎక్కడ పోటీచేయాలని చెబితే అక్కడ చేస్తానని చెప్పారు. గవర్నర్ దత్తాత్రేయ చేవెళ్ల వెళ్తుండగా తన ఇంటికి వచ్చారన్నారు.

లింబాద్రికి ఏపీ మంత్రి నాగార్జున అభినందనలు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్ లింబాద్రిని సోమవారం హైదరాబాద్‌లో ఏపీ మంత్రి మెరుగు నాగార్జున కలిసి అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జునను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి లింబాద్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మెన్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు.

వర్సిటీలను అభివృద్ధి చేయాలి

– లింబాద్రికి పీడీఎస్‌యూ వినతి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల అభివృద్ధికి చొరవ చూపాలని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రిని సోమవారం హైదరాబాద్‌లో కలిసి పీడీఎస్‌యూ వినతిపత్రాన్ని సమర్పించింది. వర్సిటీల పరిధిలో ఉన్న అన్ని కాలేజీల్లో పీజీ సీట్లను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని సూచించింది. నిబంధనలను పాటించకుండా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.